www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

నెలాఖరులోగా స్థానిక షెడ్యూల్

- వచ్చే క్యాబినెట్ భేటీలో ఎన్నికల తేదీలపై స్పష్టత
- వారం రోజుల్లో రైతుభరోసా, సన్నాలకు బోనస్
- రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం
- 7,578 సదస్సుల్లో 4.61 లక్షల దరఖాస్తులు
- రాష్ట్రంలోని 5 నక్షా గ్రామాల్లో సర్వే: పొంగులేటి

13



నేడు మంత్రులతో సీఎం రేవంత్ భేటీ

రైతు భరోసా నిధుల జమ, స్థానిక ఎన్నికలతో పాటు పలు అంశాలపై చర్చ

13

సోమవారం | 16-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 61

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం; తిథి: పంచమి మ.3.32 తదుపరి షష్ఠి; నక్షత్రం: ధనిష్ఠ రా.1.14 తదుపరి శతభిషం; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: మ.12.42-1.34, మ.3.18-4.10; అమృతఘడియలు: మ.2.43-4.20; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.47

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇజ్రాయెల్‌పైకి దూసుకెళ్తున్న ఇరాన్ క్షిపణులు



టెహ్రాన్‌లో పేలిన కారు బాంబులు



యుద్ధ బీభత్సం

మరింత విస్తరిస్తున్న ఇరాన్-ఇజ్రాయెల్ పోరు

- టెహ్రాన్‌లో కారు బాంబులు.. ఆరుగురు అణు శాస్త్రవేత్తల మృతి
- తాజాగా మరో ఇంధన కేంద్రంపై ఇజ్రాయెల్ దాడులు
- ఇరాన్‌లోని అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ప్రాంగణంపైనా..
- టెహ్రాన్‌లో రక్షణశాఖ ఆఫీసు, పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ధ్వంసం
- ఇజ్రాయెల్‌పైకి ఎయిర్‌డిఫెన్స్ కన్నుగప్పే హాజ్‌ఖాసీం క్షిపణులు
- అందుకే ఆ క్షిపణుల స్థావరాలపై దాడులు: నెతన్యాహు
- ఇజ్రాయెల్ 'వైజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్'పై ఇరాన్ క్షిపణులు
- అతిపెద్ద సైంటిఫిక్ కమ్యూనిటీకి ఆ సంస్థ ఆవాసం
- 80 లక్ష్యాలపై ఇజ్రాయెల్ దాడి.. 128 మంది మృతి
- టెల్‌అవీవ్ శివార్లలో విధ్వంసం.. 10 మంది దుర్మరణం
- ఇజ్రాయెల్‌కు మద్దతుగా పశ్చిమాసియాకు బ్రిటన్ సేనలు
- మా బేస్‌లపై దాడి చేస్తే ఇరాన్‌కు మూల్యం తప్పదు: ట్రంప్

టెల్‌అవీవ్/టెహ్రాన్/దుబాయ్, జూన్ 15: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ముదురుతుండడంతో పశ్చిమాసియా భగ్గుమంటోంది. ఇజ్రాయెల్‌కు మద్దతుగా బ్రిటన్ తన సేనలను పశ్చిమాసియాకు తరలిస్తుండగా.. ఇరాక్‌లోని తమ సైనిక బేస్‌లపై దాడులు చేస్తే, ఇరాన్ మూల్యం చెల్లించుకోక తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. భారత్-పాకిస్థాన్ మాదిరిగా ఇరాన్-ఇజ్రాయెల్ కలిసి చర్చలు జరిపి, యుద్ధాన్ని ఆపాలని పిలుపునిచ్చారు. అటు ఇరాన్‌కు పాకిస్థాన్, తుర్కియే మద్దతిస్తుండగా.. మరికొన్ని ఇస్లామిక్ దేశాలు అండగా నిలవాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ

మిగతా 2వ పేజీలో...

150 డాలర్లకు చమురు!

- ఇరాన్-ఇజ్రాయెల్ పోరుతో ఇప్పటికే 5 నెలల గరిష్ఠానికి..
- ఇప్పుడు చమురు, సహజ వాయు క్షేత్రాలపైనా దాడులు
- హోర్ముజ్ జలసంధిని మూసే దిశగా ఇరాన్ యోచన
- ఈ పరిణామాలతో ధరాభారం మరింత పెరిగే ముప్పు
- మన ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం.. ద్రవ్యోల్బణం పైపైకి!

2

మళ్లీ ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ!

- అల్ప, మధ్య, అధికాదాయ వర్గాలకూ ఇళ్లు?
- హౌసింగ్ బోర్డు పరిధిలో నిర్మాణాలు
- కూకట్‌పల్లిలో 80 ఎకరాల్లో అపార్ట్‌మెంట్లు!
- ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ విభాగాలకు ఫ్లాట్లు
- అక్కడే 'ఇందిరమ్మ' లబ్ధిదారులకూ కొన్ని ఇళ్లు?
- కసరత్తు చేస్తున్న గృహ నిర్మాణ శాఖ
- సమగ్ర వివరాలతో 'క్యాబినెట్'కు నివేదిక!



హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పేదల సొంత ఇంటి కలను సాకారం చేసుకునేందుకు ఆర్థిక సాయం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అల్ప, మధ్య, అధిక ఆదాయ వర్గాలకు కూడా అందుబాటు ధరల్లో ఇళ్లు అందించాలని భావిస్తోంది. మళ్లీ ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ విభాగాల్లో ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు హౌసింగ్ బోర్డు పరిధిలో కూకట్‌పల్లిలో ఉన్న 80 ఎకరాల (అత్యంత ఖరీదైన స్థలం)లో అపార్ట్‌మెంట్లు నిర్మించాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. అక్కడే కొంత భాగంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇచ్చేందుకు అపార్ట్‌మెంట్లనూ నిర్మిస్తే బాగుంటుందనే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మొత్తం 80 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని

మిగతా 12వ పేజీలో...



ఈసారి తెలంగాణ ఎన్నికలు..

లోక్‌సభతో కలిపే!

- 2029లో నిర్వహించే యోచనలో కేంద్రం
- 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానంలో భాగంగానే
- దేశవ్యాప్తంగా రెండు దఫాల్లో జమిలి ప్రక్రియ
- 2029లో కొన్ని రాష్ట్రాలతో కలిపి లోక్‌సభ ఎన్నికలు
- 2034 నాటికి మిగతా రాష్ట్రాలనూ కలిపి జమిలి
- 129వ రాజ్యాంగ సవరణ బిల్లుపై రాష్ట్రాలకు జేపీసీ
- రాజకీయ పార్టీలతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల అభిప్రాయాలనూ స్వీకరిస్తున్న కమిటీ

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు.. ఈసారి లోక్‌సభ ఎన్నికలతో కలిసి జమిలిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానంలో భాగంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను 2029లో లోక్‌సభ ఎన్నికలతో పాటు నిర్వహించాలనే యోచనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉంది. ఐతే 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానాన్ని దేశవ్యాప్తంగా ఒకే దశలో కాకుండా.. రెండు దశల్లో కొలిక్కి తేవాలని కేంద్రం భావిస్తోంది. అంటే.. దేశంలోని దాదాపు సగం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను 2029 లోక్‌సభ ఎన్నికలతోపాటు నిర్వహించాలని, అనంతరం 2034లో జరిగే సార్వత్రిక ఎన్నికల నాటికి మిగతా సగం రాష్ట్రాలకు కూడా కలిపి నిర్వహించాలని కేంద్రం యోచిస్తోంది. లోక్‌సభ ఎన్నికలతో పాటే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలనే దిశగా అడుగులు వేస్తున్న

మిగతా 12వ పేజీలో...



విహారయాత్ర విషాదాంతం

3

బాసర వద్ద గోదావరిలో మునిగి ఐదుగురు యువకుల మృతి

- అంతా హైదరాబాద్ వాసులు, బంధువులు
- వారిలో ముగ్గురు సొంత అన్నదమ్ములు

కేదార్‌నాథ్‌లో కూలిన హెలికాప్టర్



ఏడుగురి దుర్మరణం

2

- మృతుల్లో రెండేళ్ల చిన్నారి కూడా..
- గాల్లోకి ఎగిరిన కాసేపటికే కూలిన వైనం
- ప్రతికూల వాతావరణం వల్లే ప్రమాదం?

హైటెన్షన్ విద్యుత్తు తీగ తెగిపడి..

ఇద్దరి సజీవ దహనం

- హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో ఘటన
- మృతులు ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న యాచకులుగా గుర్తింపు?

కొత్తపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి ఘోరం జరిగింది. తలదాచుకునేందుకు ఇంత చోటు లేక రహదారి పక్కన ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఇద్దరిని హైటెన్షన్ విద్యుత్తు తీగ రూపంలో మృత్యువు కబళించింది. 11కేవీ విద్యుత్తు తీగ తెగి మీదపడడంతో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు(పురుషుడు, మహిళ) సజీవ దహనమయ్యారు. మృతులు యాచకులు అని భావిస్తున్నారు. ఈ ఘటనలో ఓ శునకం

మిగతా 3వ పేజీలో...



నదిలో కూలిన ఇనుప వంతెన..

నలుగురి మృతి

2

- 30 మందికి గాయాలు.. పుణెలో ఘటన
- మృతులకు రూ.5 లక్షల చొప్పున పరిహారం
- పాత వంతెన పైకి ఎక్కువ మంది చేరుకోవడంతో ప్రమాదం: మహారాష్ట్ర మంత్రి

విగ్రహం తరలిస్తుండగా విద్యుదాఘాతం

ఇద్దరి మృతి



వినోద్ (ఫైల్)



సాయికుమార్ (ఫైల్)

- ఎనిమిది మందికి గాయాలు
- గణేశుడి విగ్రహం హైటెన్షన్ విద్యుత్తు తీగలకు తగలడంతో ప్రమాదం
- జగిత్యాల జిల్లా కోరుట్లలో ఘటన

3



సీఎం రేవంత్ సమక్షంలో ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న ఎన్జీవోల ప్రతినిధులు, అధికారులు

ప్రభుత్వ పాఠశాలల్లో 'టెక్' బోధన!

- సాంకేతికత ఆధారిత పాఠాల కోసం ఆరు ఎన్జీవోలతో విద్యా శాఖ ఒప్పందం
- 'స్టెమ్' సబ్జెక్టుల్లో వీడియో ఆధారిత బోధన
- కోడింగ్, కంప్యూటేషనల్ థింకింగ్‌తోపాటు నీట్, జేఈఈ, క్లాట్ పోటీ పరీక్షలకు శిక్షణ
- బాలికల అక్షరాస్యత.. విద్యావకాశాల పెంపు
- ఉచిత కార్యక్రమాల్ని చేపట్టనున్న సంస్థలు
- రాష్ట్ర విద్యా రంగంలో నూతన ఒరవడికి నాంది అంటున్న అధికార వర్గాలు

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతికత (టెక్) ఆధారిత బోధనకు పునాది పడుతోంది. విద్యార్థులకు వీడియో ఆధారిత బోధన, కంప్యూటర్ కోడింగ్, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆరు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ ఎన్జీవోలతో రాష్ట్ర విద్యాశాఖ ఆదివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. విద్యా రంగంలో నూతన ఒరవడికి నాంది పలికే ఈ ఒప్పందం ద్వారా.. ఒకటో తరగతి

మిగతా 13వ పేజీలో...

ఆదిలాబాద్ డీసీసీబీ డైరెక్టర్

కిడ్నాప్!

- అర్ధరాత్రి ఆయన కారులోనే అపహరణ
- రూ. 3 కోట్లు డిమాండ్ చేసిన కిడ్నాపర్లు
- తూప్రాన్‌లోని టోల్ ప్లాజా వద్ద తప్పించుకున్న హరీశ్ కుమార్
- నిర్మల్ జిల్లాలో తీవ్ర కలకలం



మామడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్(డీసీసీబీ) చిక్యాల హరీశ్ కుమార్‌ను నలుగురు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్‌లో ఈ ఘటన జరిగింది. హరీశ్ కుమార్ నిర్మల్ జిల్లా మామడ మాజీ ఎంపీపీ కూడా. హరీశ్ కుమార్ వద్ద గతంలో కారు డ్రైవర్‌గా పనిచేసిన వ్యక్తే ఈ కిడ్నాప్‌కు సూత్రధారిగా అనుమానిస్తున్నారు. హైదరాబాద్ నుంచి పిలిపించుకున్న మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి ఆ వ్యక్తి.. హరీశ్‌కుమార్ నివాసానికి వెళ్లి నిద్రపోతున్న ఆయనను లేపి, బెదిరించి బలవంతంగా అతని కారులోనే ఎక్కించుకుని హైదరాబాద్ వైపు తీసుకెళ్లారు. ఈ సమయంలో వారు రూ.3 కోట్లు

మిగతా 3వ పేజీలో...

మేం మారేదే లే!

- ఇష్టారాజ్యంగా కొందరు ఐఏఎస్‌ల తీరు!.. సీఎం సూచించినా.. మారని ధోరణి
- ప్రభుత్వాన్నీ ఇరుకునపెడుతున్న వైనం.. పాలసీల రూపకల్పనలో ముందుచూపు కరువు
- అధికారులు, ఉద్యోగుల పట్ల కూడా దురుసు ప్రవర్తన
- జిల్లా కలెక్టర్ నుంచి రాష్ట్ర స్థాయి పోస్టుల్లోకి వచ్చిన ఐఏఎస్‌ల తీరు మరింత ఇబ్బందికరం!

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): 'మా శాఖలో మేమే సర్వం.. మేం చెప్పినట్లే జరగాలి' అన్నట్లుగా రాష్ట్రంలో పనిచేస్తున్న కొందరు ఐఏఎస్‌ల తీరు ఉంటోంది. వారు తీసుకునే నిర్ణయాలతో పాటు వ్యవహరిస్తున్న తీరు కూడా చర్చనీయాంశంగా మారుతోంది. కొంతమేర ప్రభుత్వాన్ని కూడా ఇరకాటంలోకి నెడుతోంది. కొందరు సీనియర్ ఐఏఎస్‌లు తమ సహచర అధికారుల పట్ల ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని, కొందరైతే ఏకంగా నోటికి పనిచెబుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కిందిస్థాయి ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని, దురుసు వ్యాఖ్యలు చేస్తున్నారని సచివాలయంలో చెప్పుకొంటున్నారు. మరికొందరు ఐఏఎస్‌లు.. పలు అంశాలపై ముఖ్యమంత్రి చేసిన సూచనల్ని కూడా పట్టించుకోవడంలేదని అంటున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోస్టుల్లోకి వచ్చిన పలువురు అధికారుల తీరు మరింత ఇబ్బందికరంగా ఉంటోందని ఆయా శాఖల్లో పనిచేసే ఉద్యోగులు చెబుతున్నారు. రాష్ట్ర స్థాయిలో పనిచేసే అధికారులు చాలా హుందాగా వ్యవహరించాల్సి ఉంటుందని గుర్తు చేస్తున్నారు. సచివాలయం కేంద్రంగా జరిగే ప్రతీ పని జనంతో కూడుకుని ఉంటుందని, ఇక్కడ రూపొందే పాలసీలు ప్రభుత్వాలపై ప్రభావం చూపుతాయని, ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూరితే ప్రభుత్వాలకు అంత మంచి జరుగుతుందని పేర్కొంటున్నారు. కానీ, పాలసీల రూపకల్పన నుంచి ఉద్యోగులతో వ్యవహరించే విధానం వరకు ఏ విషయంలోనూ కొందరు ఐఏఎస్‌ల వ్యవహారం సరిగా ఉండడంలేదనే భావన ఇటీవల వ్యక్తమవుతోంది. పలు సమీక్షల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అధికారులకు సూచనలు చేయడంతోపాటు అలసత్వం ప్రదర్శించిన వారిని హెచ్చరించారు. అయినా వారి తీరు మారడంలేదని సచివాలయ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. కొందరు ఐఏఎస్‌లు తమ శాఖల పరిధిలో తీసుకునే నిర్ణయాల విషయంలో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉదాహరణకు.. ఓ శాఖ పరిధిలో ఉన్న భూములను లీజుకు ఇవ్వకూడదని ఉమ్మడి ఏపీలోనే నిర్ణయం



మిగతా 13వ పేజీలో...

దటీజ్ మొస్సాద్!

ఇరాన్‌లోనే డ్రోన్ల పరిశ్రమ

డబుల్ ఏజెంట్లతో అనుమతులు

(సెంట్రల్ డెస్క్)



షెల్టర్‌లలో ఇజ్రాయెల్ పౌరులు

ఇరాన్‌పై శుక్రవారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఉపయోగించిన డ్రోన్లు ఎక్కడివి? రష్యాలోకి ఉక్రెయిన్ ట్రక్కుల ద్వారా పంపినట్లుగా ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ఆపరేషన్‌ను నిర్వహించిందా? రోడ్డుమార్గంలో తరలిస్తే.. ఏ దేశం నుంచి పంపింది? ప్రపంచవ్యాప్తంగా ఈ అంశాలపై చర్చలు జోరందుకున్నాయి. అయితే, ఈ వ్యూహం ఇప్పటిది కాదు! ఐదేళ్ల క్రితమే మొస్సాద్ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో పాగా వేసింది..! అక్కడే డ్రోన్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసింది. మొస్సాద్ నిర్వహించిన 'ఆపరేషన్ డ్రోన్స్'పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

డబుల్ ఏజెంట్ల సాయంతో..

మొస్సాద్ అధికారులు ఇరాన్ వ్యూహాలను తెలుసుకునేందుకు పలువురు ఇరానీయులను ఏజెంట్లుగా నియమించుకుంది. వీరినే డబుల్ ఏజెంట్లు అంటారు. వేర్వేరు ప్రాంతాల్లో కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ఇరాన్ ప్రభుత్వం నుంచి ఐదేళ్ల క్రితం ఈ ఏజెంట్ల ద్వారా అనుమతులు తీసుకుంది. అంతేకాదు.. విడిభాగాలను ఒకేచోట కాకుండా.. ఆయా పరిశ్రమల్లో తయారు చేసేలా ఏర్పాట్లు చేసింది. టెహ్రాన్‌లోని ఇస్లామ్ షహర్ అనే పారిశ్రామిక వాడలో మరో కర్మాగారాన్ని స్థాపించి, అక్కడ అసెంబ్లింగ్ చేసింది. గత ఏడాది లెబనాన్‌లో హిజ్బుల్లా నేతలే లక్ష్యంగా మొస్సాద్ భారీ ఎత్తున పేజర్ బాంబులు, వాకీటాకీ బాంబులను పేల్చిన విషయం తెలిసిందే..! అప్పటికే టెహ్రాన్‌లో మొస్సాద్ ఏజెంట్లు తమ లక్ష్యాన్ని పూర్తిచేశారు. డ్రోన్లను అసెంబ్లింగ్ చేసి.. అంతర్గతంగా పరీక్షలు నిర్వహించారు. సూసైడ్ డ్రోన్లు సవ్యంగా పనిచేసేలా.. ప్రోగ్రామింగ్ చేశారు. పేలుడు పదార్థాలను కూడా సాధారణ ట్రక్కుల్లో ముడిపదార్థాల మాటున ఇస్లాం షహర్‌కు తెప్పించారు. అన్నీ సిద్ధమయ్యాక.. ఇజ్రాయెల్ ప్రభుత్వ ఆదేశాల కోసం ఇంతకాలం ఎదురుచూశారు. ఇజ్రాయెల్ సర్కారు నుంచి ఆదేశాలు వచ్చిందే తడవుగా.. ఇరాన్ అణు స్థావరాలకు సమీపంలో సూసైడ్ డ్రోన్లను తీసుకెళ్లి తమ పనిని పూర్తిచేశారు. అయితే, ఇజ్రాయెల్ దాడులు జరిపాక ఇరాన్ మేల్కొంది. ఇస్లామ్ షహర్‌లోని కర్మాగారంలో డ్రోన్లను అసెంబుల్ చేసినట్లు ఆదివారం ఉదయం గుర్తించినట్లు ఇరాన్ వార్తాసంస్థ 'ఇరాన్ ఖబర్' వెల్లడించింది.



ఇరాన్ ఫైటర్ జెట్‌ను పేల్చేసిన ఇజ్రాయెల్

యుద్ధ బీభత్సం

ఇరాన్ క్షిపణి దాడులతో శిథిలాలుగా మారిన ఇజ్రాయెల్‌లోని బ్యాట్‌యామ్ నగర భవనాలు



(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. ఇలా ఇరాన్-ఇజ్రాయెల్‌కు వేర్వేరు దేశాల మద్దతు పెరుగుతుండడంతో.. ఉద్రిక్తతలు మరింత విస్తరించే ప్రమాదాలున్నాయి.

మూడో రోజూ ఇరాన్‌కు నష్టాలు

మొదటి రోజు ఇరాన్ క్షిపణి కేంద్రాలు, అణు స్థావరాలు, మిలటరీ అధికారులనే లక్ష్యంగా చేసుకుని క్షిపణి, డ్రోన్ దాడులు చేయగా.. శనివారం నుంచి ఆర్థిక మూలాలపై విరుచుకుపడుతోంది. బుషెహర్‌లోని అతిపెద్ద న్యాచురల్ గ్యాస్ క్షేత్రం(సౌత్ పార్స్), చమురు శుద్ధి కేంద్రంపై శనివారం రాత్రి దాడులు జరపగా.. ఆదివారం కూడా అక్కడ మంటలు ఎగిసిపడుతున్నాయి. టెహ్రాన్ సమీపంలోని మరో ఇంధన కేంద్రంపై ఆదివారం ఉదయం దాడి జరిగింది. ఈ చమురు క్షేత్రాలు సైన్యం కోసం పనిచేస్తుండడం వల్లే.. తాము వాటిని టార్గెట్‌గా చేసుకున్నామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. టెహ్రాన్ సమీపంలోని షిరాజ్‌లో ఉన్న అతిపెద్ద ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పారిశ్రామిక ప్రాంతంపైనా ఇజ్రాయెల్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇక్కడ ఇరాన్ సైన్యం భారీగా ఆయుధాలను నిల్వచేసినట్లు ఇజ్రాయెల్ చెబుతోంది. ఇరాన్‌లోని మషాద్(ఇజ్రాయెల్ నుంచి 2,300 కిలోమీటర్ల దూరం)లో ఉన్న వైమానిక స్థావరంలో నిలిపి ఉన్న ఫైటర్ జెట్ల రీఫ్యూయలింగ్ విమానాన్ని ఆదివారం సాయంత్రం బాలిస్టిక్ క్షిపణితో కూల్చివేసినట్లు వివరించింది. టెహ్రాన్‌లోని రక్షణశాఖ కార్యాలయాన్ని కూడా ధ్వంసం చేసినట్లు తెలిపింది. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ చీఫ్ మహమ్మద్ కజేమీ, డిప్యూటీ చీఫ్ హసన్ మొహఖ్ చనిపోయినట్లు ఇజ్రాయెల్ ప్రధానిని ఉటంకిస్తూ ఫాక్స్‌న్యూస్ ఓ కథనాన్ని ప్రసారం చేసింది. "ఇక ఇప్పట్లో ఇరాన్ అణుశుద్ధి కార్యక్రమాలు జరపలేదు. ఆ విధంగా అక్కడి అణుస్థావరాలను నాశనం చేశాం. ఖమేనీతో సహా.. మా టార్గెట్ పరిధిలో ఉన్నారు" అని ఐడీఎఫ్‌కు చెందిన ఓ సీనియర్ అధికారిని ఉటంకిస్తూ 'వాల్ స్ట్రీట్ జర్నల్' ఓ కథనాన్ని ప్రచురించింది. శనివారం సాయంత్రం నుంచి ఇజ్రాయెల్ దాడులు ముమ్మరమయ్యాయి. గడిచిన మూడు రోజుల్లో ఇరాన్ వ్యాప్తంగా 406 మరణాలు నమోదవ్వగా.. 654 మంది క్షతగాత్రులైనట్లు మానవహక్కుల సంస్థలు ప్రకటించాయి. ఆదివారం ఒక్క రోజే 128 మంది మృతిచెందినట్లు తెలిపాయి.

పేలిన కారు బాంబులు

ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ లెబనాన్‌లో హిజ్బుల్లా నేతలనే లక్ష్యంగా చేసుకుని పేజర్, వాకీటాకీ బాంబులను పేల్చిన విషయం తెలిసిందే..! శనివారం సాయంత్రం ఇరాన్‌లోనూ అలాంటి దాడులే చేసింది. ఏకకాలంలో పలు కారు బాంబులను పేల్చి, ఆరుగురు అణు శాస్త్రవేత్తలను మట్టుబెట్టినట్లు ఇజ్రాయెల్ మీడియా.. ఐదు కారుబాంబులు నమోదైనట్లు ఇరాన్ వార్తాసంస్థలు పేర్కొన్నాయి. తాజా మరణాలతో.. మొత్తం 14 మంది అణు శాస్త్రవేత్తలు కన్నుమూసిన విషయాన్ని రాయిటర్స్, అరబ్ మీడియా నిర్ధారించాయి. తాజా దాడుల్లో అణుశాస్త్రవేత్త అలీ బకావీ, ఆయన కుటుంబం కూడా మృతి చెంది ఉంటారని ఇరాన్ అధికారిక వార్తాసంస్థ ఐఆర్‌ఎన్‌ఏ తెలిపింది.

ఇజ్రాయెల్‌లో 10 మంది మృతి

ఇరాన్ తొలిసారి తన అమ్ముల పొదిలోని భీకర అస్త్రాన్ని ఇజ్రాయెల్‌పై ప్రయోగించింది. 'హజ్ ఖాసీం' బాలిస్టిక్ మిసైల్ కారణంగా టెల్‌అవీవ్ శివార్లలోని పలు పట్టణాలు రూపురేఖలను కోల్పోయాయి. హజ్ ఖాసీంను గగనతల రక్షణ వ్యవస్థలు గుర్తించలేవని ఇరాన్ విదేశాంగ శాఖ అధికారి అబ్బాస్ అరాగ్చి వెల్లడించారు. ఈ క్షిపణి దాడులతో టెల్‌అవీవ్ శివార్లలోని బ్యాట్‌యామ్, గుష్‌డాన్, షెఫెలా, తామ్రా పట్టణాల్లో భారీ ఆస్తినష్టం సంభవించగా.. ఆదివారం ఒక్కరోజే నలుగురు చిన్నారులు సహా.. 10 మంది మృతిచెందారు. ఇజ్రాయెల్ తమ న్యూక్లియర్ సైంటిస్టులను మట్టుబెట్టిన నేపథ్యంలో ఇరాన్ ప్రతీకార దాడికి దిగింది. ఇజ్రాయెల్‌లోని అతిపెద్ద సైంటిఫిక్ కమ్యూనిటీ (శాస్త్రవేత్తలు, పరిశోధనలకు ఆవాసం) అయిన వైజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్‌పై డ్రోన్ దాడులు జరిగాయి. అప్పటికే శాస్త్రవేత్తలు, వారి కుటుంబాలు బంకర్లలో ఉండడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్థానిక అధికారులు తెలిపారు. "ఇరాన్ వద్ద ఇలాంటి(హజ్‌ఖాసీం) క్షిపణులు వేలల్లో ఉంటే.. ఈ రోజు ఏం జరిగేదో ఆలోచించండి. అది ఇజ్రాయెల్ అస్తిత్వానికే ముప్పు అందుకే ఇరాన్ క్షిపణి కేంద్రాలను టార్గెట్‌గా చేసుకున్నాం" అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బాట్‌యామ్‌లో కూలిన భవనాలను పరిశీలిస్తున్న సందర్భంగా వ్యాఖ్యానించారు. కాగా.. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను దాదాపుగా ధ్వంసం చేశామని, ఇప్పుడు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఆ దేశ గగనతలంలోకి ప్రవేశించగలవని ఐడీఎఫ్ వాయుసేన ప్రకటించింది.

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు

ఇరాక్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు చేయడంతో ట్రంప్ సీరియస్ అయ్యారు. మరోమారు అమెరికా సైన్యం స్థావరాలపై దాడులు జరిగితే.. ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని, టెహ్రాన్ రూపురేఖలను కోల్పోతుందని ఆయన హెచ్చరించారు. భారత్-పాకిస్థాన్ మాదిరిగా.. ఇజ్రాయెల్-ఇరాన్ కూడా శాంతి చర్చలు జరిపి, యుద్ధాన్ని విరమించుకోవాలని సూచించారు.కాగా, అమెరికా, ఇరాన్ మధ్య ఆదివారం జరగాల్సిన అణు చర్చలు రద్దయ్యాయి. ఇజ్రాయెల్ భీకర దాడుల నేపథ్యంలో.. ఆ దేశానికి అమెరికా సహకరిస్తోందని ఇరాన్ ఆరోపిస్తూ.. "ఈ పరిస్థితుల్లో చర్చలకు అర్థం లేదు" అంటూ ఓ ప్రకటన చేసింది. మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీని అంతమొందించేందుకు ఇజ్రాయెల్ ప్రణాళిక రూపొందించిందని, తాను ఆ చర్యను అడ్డుకున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు రాయిటర్స్ ఓ కథనాన్ని ప్రచురించింది. అయితే దీన్ని నెతన్యాహు ఖండించారు.

ఇజ్రాయెల్ ఆపితే.. మేమూ ఆపుతాం: ఇరాన్

ఇజ్రాయెల్ ముప్పేట దాడులతో ఇరాన్ వెనక్కి తగ్గింది. "ఇజ్రాయెల్ మాపై దాడులను ఆపితే.. మేము కూడా ప్రతీకార దాడులను నిలిపివేస్తాం" అని ఇరాన్ విదేశాంగ శాఖ అధికారి అబ్బాస్ అరాగ్చి వ్యాఖ్యానించారు. ఈ ప్రకటన వచ్చాక కూడా ఇజ్రాయెల్ నుంచి స్పందన లేకపోవడంతో.. ఇరాన్ తన 'ఆపరేషన్ సాధిక్ ప్రామిస్-3'ని ఆదివారం రాత్రి ప్రారంభించింది. ఇజ్రాయెల్‌పైకి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తున్న దృశ్యాలను మీడియాకు విడుదల చేసింది. అదే సమయంలో.. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ)తో ఇకపై ఎలాంటి సమాచారాన్ని పంచుకోబోమని ప్రకటించింది.

లోకం తీరు



సైప్రస్ చేరిన ప్రధాని మోదీ



నికోసియా, న్యూఢిల్లీ జూన్ 15: ప్రధాని మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం సైప్రస్ చేరుకున్నారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలీడెస్ స్వయంగా లర్నాకా అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చి మోదీకి స్వాగతం పలకడం విశేషం. రెండు దశాబ్దాల అనంతరం భారత ప్రధాని సైప్రస్ సందర్శనకు రావడం ఇదే ప్రథమం. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇతర రంగాల్లో సంబంధాలు పుంజుకుంటాయని మోదీ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీది చరిత్రాత్మక పర్యటన అంటూ సైప్రస్ అధ్యక్షుడు నికోస్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సైప్రస్ నుంచి ప్రధాని మోదీ కెనడాలోని కనానస్కిస్‌కు వెళ్లనున్నారు. అక్కడ జీ-7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నారు. అనంతరం క్రొయేషియా దేశంలో పర్యటించనున్నారు.

మళ్లీ ఆస్పత్రిలో చేరిన సోనియా

న్యూఢిల్లీ, జూన్ 15: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియా గాంధీ ఆసుపత్రిలో చేరారు. ఉదర సంబంధిత సమస్యలతో ఆమె ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రి గ్యాస్ట్రో విభాగంలో చేరారు. ప్రస్తుతానికి ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యబృందం పర్యవేక్షణ కొనసాగుతోందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ నెల 9న కూడా సోనియా ఇదే ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అంతకు రెండు రోజుల ముందు ఈ నెల 7న అధిక రక్తపోటు కారణంగా సిమ్లాలోని ఇందిరాగాంధీ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చేరి వైద్యపరీక్షలు చేయించుకున్నారు.

యుద్ధం ఇలాగే కొనసాగితే.. 150 డాలర్లకు చమురు!

ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులతోనే 5 నెలల గరిష్ఠ స్థాయికి ధరలు

టెహ్రాన్‌లోని చమురు నిల్వ కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి



న్యూఢిల్లీ, జూన్ 15: ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంతో ముడి చమురు ధర మళ్లీ సెగలు కక్కుతోంది. శనివారం ఒక్కరోజే బ్రెంట్‌రకం పీపా (బ్యారెల్) చమురు ధర 13% పెరిగి 78 డాలర్లకు చేరింది. చమురు ధర గత ఐదు నెలల్లో ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం 75 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇజ్రాయెల్ తమపై దాడులు చేస్తున్న నేపథ్యంలో.. పర్షియన్ గల్ఫ్ నుంచి ప్రపంచదేశాలకు చమురు సరఫరాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసేయాలన్న ప్రతిపాదనను ఇరాన్ పరిశీలిస్తోంది. అది జరిగినా.. లేక ఈ ప్రాంతంలో అమెరికాకు మిత్రుడైన సౌదీ అరేబియా చమురు క్షేత్రాలపై ఇరాన్ దాడులకు దిగినా పీపా చమురు ధర 120 నుంచి 150 డాలర్లకు చేరే ప్రమాదం ఉందని రాబో బ్యాంకు ఇంటర్నేషనల్ గ్లోబల్ స్ట్రాటజిస్ట్ మైఖేల్ ఇవిరీ ఇప్పటికే హెచ్చరించారు. ప్రస్తుత ధరతో పోలిస్తే ఇది 103 శాతం ఎక్కువ.

ఇదీ లెక్క...

యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ గణాంకాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా రోజుకు సగటున 103 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉత్పత్తి అవుతోంది. అందులో ఇరాన్ వాటా (రోజుకు) 32 లక్షల బ్యారెళ్లు. అందులో 15 నుంచి 20 లక్షల బ్యారెళ్లను ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేస్తుంది. అలాగే.. అమెరికా, రష్యా తర్వాత ప్రపంచంలోనే మూడో అతిపెద్ద సహజవాయు ఉత్పత్తిదారు ఇరాన్. రోజుకు సగటున 275 బిలియన్ క్యూబిక్ మీటర్ల సహజవాయువును ఆ దేశం ఉత్పత్తి చేస్తుంది. అంతర్జాతీయ ఉత్పత్తిలో అది దాదాపు 6.5 శాతం. ఇరాన్ ప్రధాన ఆదాయ వనరులు.. ఈ చమురు, సహజవాయు నిక్షేపాలే. అందుకే.. ఆ దేశంపై యుద్ధంలో భాగంగా తొలి దశలో అణు, సైనిక స్థావరాలపై బాంబులు కురిపించిన ఇజ్రాయెల్ తాజాగా చమురు, సహజవాయు క్షేత్రాలపై దృష్టి సారించింది. అందులో భాగంగానే ఇరాన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై డ్రోన్ దాడి చేసింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సహజ వాయు రిజర్వు. ఈ దాడితో ఇరాన్ ఆ క్షేత్రంలో సహజ వాయు ఉత్పత్తిని పాక్షికంగా నిలిపివేయాల్సి వచ్చింది. ఫలితంగా 12 మిలియన్ క్యూబిక్ మీటర్ల మేర గ్యాస్ ఉత్పత్తి ఆగిపోయింది. ఇజ్రాయెల్ తన దూకుడును ఇలాగే కొనసాగించి ఇరాన్ ఇంధన క్షేత్రాలపై మరింత పెద్ద ఎత్తున దాడులు చేస్తే ఆ ప్రభావం అంతర్జాతీయ ముడిచమురు, సహజవాయు సరఫరా చైన్‌పై తీవ్రంగా పడే ప్రమాదం ఉందని ఇంధన రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా.. ఖార్గ్ ఐలండ్ వంటివాటిపై దాడులు జరిగితే మరింత ప్రభావం ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

హోర్ముజ్ జలసంధిని మూసేస్తే..

ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని.. ఇరాన్ పార్లమెంటు సభ్యుడు, ఐఆర్‌జీసీ సీనియర్ కమాండర్ సర్దార్ ఇస్మాయిల్ కౌసరి తాజాగా తెలిపారు. అదే జరిగితే చమురు ధరలు చుక్కలనంటే ప్రమాదం ఉంది. ఎందుకంటే.. ప్రపంచంలోనే చమురు ఉత్పత్తిలో అత్యంత కీలకమైన ఇరాక్, సౌదీ అరేబియా, ఇరాన్, యూఏఈ, ఒమన్ దేశాల నౌకలు రాకపోకలు సాగించేది ఈ జలసంధి గుండానే. ఆయా దేశాల నుంచి చైనా, భారత్, జపాన్, కొరియా దేశాల చమురు, ఎల్‌ఎన్‌జీ దిగుమతులకు ఇదే ప్రధాన ఆధారం. యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా నిత్యం వినియోగించే చమురులో 20 శాతం, సహజవాయువులో 25%.. పర్షియన్ గల్ఫ్ నుంచి ఈ జలసంధి గుండానే బయటకు ప్రయాణిస్తుంది.

భారత్‌కు దెబ్బే..

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం వీలైనంత త్వరగా ముగిస్తే సరే.. లేకపోతే మన దేశానికీ తిప్పలు తప్పవు. ఎందుకంటే మన ముడి చమురు అవసరాల్లో 90 శాతం, గ్యాస్ అవసరాల్లో 50 శాతానికి దిగుమతులే దిక్కు. మన చమురు దిగుమతుల్లో ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్, యూఏఈల వాటా సగం వరకు ఉంటుంది. ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేస్తే ఈ సరఫరాలకు తీవ్ర విఘాతం తప్పదు. అదే జరిగితే చమురు ధర భగ్గుమని మన ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. పీపా చమురు ధర రెండు డాలర్లు పెరిగినా చమురు కంపెనీలు అమ్మే ప్రతి లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ.2 ఆదాయం తగ్గుతుందని అంచనా. ఈ నష్టాలు తట్టుకునేందుకు ఆయిల్ కంపెనీలు మళ్లీ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదు. చమురు సెగతో ద్రవ్యోల్బణం ఎగబాకడంతో పాటు ద్రవ్య లోటు కట్టుతప్పి జీడీపీ వృద్ధి రేటూ మసకబారే ప్రమాదం ఉంది. అప్పుడు ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోతలకు స్వస్తి చెప్పి.. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు మళ్లీ వడ్డీ రేట్ల పెంపునకు దిగే అవకాశం ఉంది.

ఎగుమతులకూ ముప్పే

తాజా ఉద్రిక్తతలపై ఎగుమతిదారులూ బెంబేలెత్తిపోతున్నారు. గత ఏడాది హౌతీల దాడులతో ఎర్ర సముద్ర మార్గం మూసుకుపోవడంతో భారత ఎగుమతిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఇరాన్‌కు మద్దతుగా హౌతీలు మళ్లీ ఎర్ర సముద్రం మీదుగా ప్రయాణించే నౌకలపై ఎక్కడ దాడులు చేస్తారోనని భయపడుతున్నారు. ఈ దాడుల నుంచి తప్పించుకునేందుకు దక్షిణాఫ్రికా సమీపంలోని 'కేప్ ఆఫ్ గుడ్‌హోప్' మీదుగా నౌకలను మళ్లించాల్సి ఉంటుంది. అదే జరిగితే రవాణ ఖర్చులు 50% పెరిగిపోతాయి.

రాఫెల్ జెట్లు కూలలేదు.. పాక్ ప్రకటన అబద్ధం

» 'దసో' సీఈవో ప్రకటన


న్యూఢిల్లీ, జూన్ 15: భారత వైమానిక దళానికి చెందిన మూడు రాఫెల్ జెట్లను కూల్చివేశామన్న పాకిస్థాన్ ప్రకటనను దసో ఏవియేషన్ సంస్థ సీఈవో ఎరిక్ ట్రాపియెర్ ఖండించారు. నిర్దిష్ట ఆధారాలు లేకుండా పాక్ ఆ ప్రకటన చేసిందన్నారు. రాఫెల్స్ కూల్చివేత వాస్తవం కాదని స్పష్టం చేశారు. చాలామందిని వాస్తవం దిగ్భ్రాంతికి గురిచేస్తుందని ఎరిక్ వ్యాఖ్యానించారు. ఓ యూరోపియన్ పబ్లికేషన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌కు చెందిన దసో సంస్థ రాఫెల్ జెట్లను తయారు చేస్తున్న సంగతి తెలిసిందే. "ఆపరేషన్ సిందూర్ సమయంలో రాఫెల్స్‌ను కోల్పోయినట్టు భారత్ ఇంతవరకు అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో అసలు ఏం జరిగిందనేది స్పష్టత లేదు. పాక్ చెబుతున్నట్టు రాఫెల్స్‌ను కూల్చడం పూర్తిగా అవాస్తవం. అయినా, పూర్తి వివరాలు అందితేనే వాస్తవం ఏమిటనేది తెలుస్తుంది. నష్టాలు లేకుండా యుద్ధాలు ఉండవు" అని ఎరిక్ అభిప్రాయపడ్డారు.

విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు ఇక ఇండియాలో

» 5 విద్యా సంస్థలకు యూజీసీ లెటర్ ఆఫ్ ఇంట్రెస్ట్ జారీ

న్యూఢిల్లీ, జూన్ 15: ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా తదితర దేశాలకు వెళుతున్న భారతీయ విద్యార్థులు ఇక విదేశాలకు వెళ్లనక్కర్లేదు. త్వరలో ప్రసిద్ధ విదేశీ యూనివర్సిటీలు భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. జాతీయ విద్యావిధానం-2020' అంతర్జాతీయకరణలో భాగంగా దేశంలో విదేశీ యూనివర్సిటీల ప్రవేశానికి కేంద్రం అనుమతినిచ్చింది. ఈ మేరకు సదరు విదేశీ యూనివర్సిటీలకు యూజీసీ ఆదివారం ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో అధికారికంగా లెటర్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఎల్వోఐ) అందజేసింది. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, యూజీసీ తాత్కాలిక చైర్మన్ వినీత్ జోషి పాల్గొన్నారు. ఎల్వోఐ అందుకున్న సంస్థల్లో వెస్ట్రన్ ఆస్ట్రేలియా యూనివర్సిటీ అనుబంధ యూనివర్సిటీ ఆఫ్ యార్క్, యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటన్)లోని యూనివర్సిటీ ఆఫ్ అబెర్డీన్, ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - ఐఐటీ (అమెరికా), యూరోపియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ -ఎల్‌ఈడీ (ఇటలీ) ఉన్నాయి. సదరు సంస్థలు క్యాంపస్‌లు ఏర్పాటు చేసుకుని అడ్మిషన్లు ప్రారంభించడానికి 18 నెలల సమయం పడుతుంది.

నదిపై కూలిన ఇనుప వంతెన



నలుగురి మృతి.. 30 మందికి గాయాలు

మహారాష్ట్రలోని పుణెలో ఘటన

పుణె, జూన్ 15: మహారాష్ట్రలోని పుణె సమీపంలో ఇంద్రాయణి నదిపై ఇనుప వంతెన కూలిపోయింది. కుందమాల గ్రామంలో నదిపై నడక దారి కోసం ఏర్పాటు చేసిన ఈ ఇనుప వంతెన ఆదివారం ఒక్కసారిగా కుప్పకూలింది. ఎక్కువ మంది వంతెనపై నిలబడి ఉండగా కూలిపోయిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారని, 30 మంది గాయపడ్డారని పోలీసులు చెప్పారు. 38 మందిని కాపాడామని, కొందరు నదీ ప్రవాహంలో కొట్టుకుపోయారని తెలిపారు. సాయంత్రం 4 గంటల సమయంలో 100 మంది వరకు పర్యాటకులు బ్రిడ్జిపై ఒకే చోట నిల్చొని ఉన్నారన్నారు. కాగా, ఈ పాత ఇనుప వంతెనను కేవలం పాదచారుల కోసమే నిర్మించారని మహారాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మంత్రి గిరీశ్ మహాజన్ తెలిపారు. ద్విచక్ర వాహనదారులు ఈ వంతెనపై రాకపోకలు సాగించరాదని హెచ్చరిక బోర్డులు కూడా ఉన్నాయన్నారు. ఇలాంటి హెచ్చరికలను ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలిపారు.

ప్రపంచంలో బడికెళ్లని పిల్లలు 27.2 కోట్లు

న్యూఢిల్లీ, జూన్ 15: ప్రపంచవ్యాప్తంగా పాఠశాలకు వెళ్లని పిల్లల సంఖ్య ప్రస్తుతం దాదాపు 27.2 కోట్లుగా ఉందని ఐక్యరాజ్యసమితికి చెందిన యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ టీమ్ (జీఈఎం) తాజా నివేదిక పేర్కొంది. ఇది గత అంచనాల కంటే 2.1 కోట్లు ఎక్కువని తెలిపింది. ప్రాథమిక పాఠశాల వయస్సు పిల్లల్లో 11 శాతం మంది (7.8 కోట్లు), లోయర్ సెకండరీ స్కూల్ వయస్సు కౌమారదశ పిల్లల్లో 15 శాతం మంది (6.4 కోట్లు), అప్పర్ సెకండరీ స్కూల్ వయస్సు వాళ్లలో 31 శాతం మంది (13 కోట్లు) పాఠశాలకు దూరంగా ఉన్నారని వెల్లడించింది. పాఠశాలకు వెళ్లని పిల్లల పెరుగుదలకు ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని పేర్కొంది. 80 లక్షల మంది (38 శాతం) పెరుగుదలకు కొత్త ఎన్‌రోల్‌మెంట్, అటెండెన్స్ డేటా లేకపోవడం కారణమని పేర్కొంది. 2021లో అఫ్ఘానిస్థాన్‌లో సెకండరీ విద్యలో చేరే విద్యార్థినులపై విధించిన నిషేధం కూడా ఇందుకు దోహదం చేసిందని వెల్లడించింది. మరోవైపు అప్‌డేట్ చేసిన యూఎన్ జనాభా అంచనాల కారణంగా మరో 1.3 కోట్ల మంది (మిగతా 62 శాతం) పెరిగారని, ఇది మరొక కారణమని తెలిపింది.

కేదార్‌నాథ్‌లో కూలిన హెలికాప్టర్

» రెండేళ్ల చిన్నారి సహా ఏడుగురి దుర్మరణం

» గాల్లోకి ఎగిరిన కాసేపటికే కూలిన వైనం

రుద్రప్రయాగ్(ఉత్తరాఖండ్), జూన్ 15: ఎయిరిండియా విమాన ప్రమాదం ఘటన నుంచి ఇంకా తేరుకోకముందే మరో ఘోర ప్రమాదం జరిగింది. చార్‌ధామ్ యాత్రికులు ప్రయాణిస్తున్న ఓ ప్రైవేటు హెలికాప్టర్ ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున కూలిపోయింది. ఈ ప్రమాదంలో రెండేళ్ల చిన్నారి సహా ఏడుగురు దుర్మరణం చెందారు. మృతులు మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవారు. అధికారుల కథనం ప్రకారం.. ఆర్యన్ ఏవియేషన్ సంస్థకు చెందిన బెల్ 407 హెలికాప్టర్.. ఆరుగురు యాత్రికులు, పైలట్ సహా ఏడుగురితో ఆదివారం ఉదయం 5:10 గంటలకు గుప్తకాశి నుంచి బయలుదేరి 5:18 గంటలకు కేదార్‌నాథ్ చేరుకుంది. అక్కడి నుంచి 5:19 గంటలకు తిరుగు ప్రయాణమైన హెలికాప్టర్ 5:20 నిమిషాలప్పుడు గౌరీకుండ్ సమీపంలోని అడవిలో కూలిపోయింది. దీంతో హెలికాప్టర్‌లో ఉన్న పైలట్ రాజ్వీర్ సింగ్ చౌహాన్(39), బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయ కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్ రావత్, మహారాష్ట్రకు చెందిన రాజ్‌కుమార్ జైస్వాల్, శ్రద్ధ దంపతులు వారి కుమార్తె కాశీ(2), ఉత్తరప్రదేశ్‌కు చెందిన వినూద్ దేవి(66) తుష్టీ సింగ్(19) మంటల్లో కాలిపోయి అక్కడికక్కడే మరణించారు. రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన పైలట్ రాజ్వీర్ సింగ్ చౌహాన్ 15 ఏళ్లకు పైగా భారత ఆర్మీలో పని చేశారు. పర్వత ప్రాంతాల్లో హెలికాప్టర్ నడపడంలో ఆయనకు విశేష అనుభవం ఉంది. అయితే, కేదార్‌నాథ్ నుంచి తిరుగు ప్రయాణం అప్పుడు వాతావరణం ఒక్కసారిగా మారిపోయిందని, హెలికాప్టర్‌ను దారి మళ్లించేందుకు పైలట్ ప్రయత్నిస్తుండగానే ప్రమాదం జరిగిందని స్థానిక పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర ఏప్రిల్ 30 నుంచి ప్రారంభమవ్వగా.. ఆ తర్వాత ఈ మార్గంలో జరిగిన ఐదో హెలికాప్టర్ ప్రమాదం ఇది. వరుస ప్రమాదాల నేపథ్యంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం చార్‌ధామ్ మార్గంలో సోమవారం వరకు హెలికాప్టర్ సేవలను నిలిపివేసింది. కాగా, మే 8న గంగోత్రిధామ్ వెళుతున్న ఓ హెలికాప్టర్ ఉత్తరకాశీ జిల్లాలో కూలిపోగా.. ప్రమాదంలో ఆరుగురు మరణించారు. మే 12న జరిగిన ఘటనలో సెర్సీ నుంచి బద్రీనాథ్‌కు యాత్రికులతో వస్తున్న ఓ హెలికాప్టర్‌ను ప్రతికూల వాతావరణం వల్ల ఓ పాఠశాల మైదానంలో పైలట్ అత్యవసరంగా ల్యాండ్ చేశారు. మే 17న జరిగిన ఘటనలో రిషికేశ్ ఎయిమ్స్ ఆస్పత్రి హెలికాప్టర్ అంబులెన్స్.. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ హెలీప్యాడ్ సమీపంలో కూలిపోయింది. జూన్ 7న కేదార్‌నాథ్ వెళుతున్న ఓ హెలికాప్టర్‌ను సాంకేతిక సమస్యల వల్ల రహదారిపై అత్యవసరంగా ల్యాండ్ చేశారు.

ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం

ఎయిరిండియాకు చెందిన మరో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఆదివారం ఘజియాబాద్ నుంచి కోల్‌కతా వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ బోయింగ్ ఐఎక్స్ 1511 విమానంలో ఈ లోపం తలెత్తింది. దీంతో రన్‌వేపైనే గంటసేపు నిలిపివేయాల్సి వచ్చింది. లోపాన్ని సరిచేసి విమానం బయలుదేరేటప్పటికి ఏడు గంటలు ఆలస్యమైంది. విమానం బయలుదేరే ముందు సాంకేతిక సమస్య ఉన్నట్లు సిబ్బంది గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇంజనీరింగ్ సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరించేందుకు గంటల్లో సమయం పట్టింది. దీనిపై ఎయిరిండియా వివరణ ఇచ్చింది. టేకాఫ్‌కు కాసేపు ముందు సాంకేతిక సమస్యను గుర్తించామని, ఆలస్యం కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపింది. వారి ప్రయాణాన్ని రీషెడ్యూల్ చేసేందుకైనా, టికెట్ సొమ్మును తిరిగి చెల్లించేందుకైనా సిద్ధంగా ఉన్నామని పేర్కొంది.

ఏపీఎస్ రాజు జీవితం యువతకు స్ఫూర్తి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- ఏపీఎస్ రాజు జీవిత చరిత్ర.. స్టాండింగ్ టాల్, శిఖరాయమాణుడు పుస్తకాల ఆవిష్కరణ
- శాంతా బయోటెక్ వరప్రసాద్ రెడ్డి, మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు హాజరు

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ) వ్యవస్థాపకులు అల్లూరి వెంకట సత్యనారాయణ రాజు (ఏపీఎస్ రాజు) జీవితం యువతరానికి స్ఫూర్తిపాఠం అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. నిర్మాణ రంగంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పిన ఏపీఎస్ రాజు ఆదర్శనీయుడని కొనియాడారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఎన్‌సీసీ అధినేత ఏపీఎస్ రాజు జీవిత చరిత్రపై వి.పట్టాభిరాం రాసిన 'స్టాండింగ్ టాల్' ఆంగ్ల పుస్తకాన్ని హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. స్టాండింగ్ టాల్‌కు తెలుగు అనువాదం డి.చంద్రశేఖర్ రెడ్డి రాసిన 'శిఖరాయమాణుడు' పుస్తకాన్ని వెంకయ్య నాయుడు ఆవిష్కరించి తొలిప్రతిని శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు వరప్రసాద్ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ విలువలు పాటించడం ద్వారా వ్యాపార సామ్రాజ్యాలు నిలబడతాయి అనేందుకు ఏపీఎస్ రాజు జీవితం నిదర్శనం అన్నారు. నిర్మాణ రంగంలో రాజు సాధించిన విజయాలే కాక, దేశాభివృద్ధిలో ఆయన భాగస్వామ్యాన్ని కూడా ఈ పుస్తకాలు తెలియజేస్తాయని పేర్కొన్నారు. ఏదైనా నిర్మాణం చేపట్టేటప్పుడు ఓ చెట్టును తొలగించాల్సి వస్తే దానికి బదులుగా మరికొన్ని మొక్కలు నాటించి రాజు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. కంటి ఇన్‌ఫెక్షన్ బాధిస్తున్నా కార్యక్రమానికి హాజరైన వెంకయ్యనాయుడు.. నేచర్, కల్చర్ కలిస్తే బ్రైట్ ఫ్యూచర్ సొంతమంటూ తనదైన శైలిలో ప్రసంగించారు. మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ.. వ్యాపార రంగంలోనే కాక కుటుంబ జీవితంలోనూ ఏపీఎస్ రాజు విజేతగా నిలిచారని కొనియాడారు. శాంతా బయోటెక్ వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... సహనం, సహానుభూతి, ధార్మికసేవ వంటి సుగుణాలన్నింటితో మూర్తీభవించిన గొప్ప వ్యక్తి ఏపీఎస్ రాజు అని కొనియాడారు. ఇక, ఏపీఎస్ రాజుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ పంపిన సందేశాన్ని తెలంగాణ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారక్ లింగం శ్రీధర్ చదివి వినిపించారు. కాగా, పుస్తక రచయితలు పట్టాభిరాం, చంద్రశేఖర్ రెడ్డిని ఏపీఎస్ రాజు కుటుంబసభ్యులు సత్కరించగా.. ఏపీఎస్ రాజు దంపతులను వక్తలు సన్మానించారు. కనుమూరి బాపిరాజు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, అల్లు అరవింద్ తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఏపీఎస్ రాజు కుటుంబసభ్యులతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, అశోక్‌గజపతిరాజు, వరప్రసాద్‌రెడ్డి

హైటెన్షన్ విద్యుత్ తీగ తెగిపడి..
ఇద్దరి సజీవ దహనం

(మొదటి పేజీ తరువాయి)

కూడా విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. పోలీసులు, విద్యుత్ శాఖ డీఈ రాజేంద్ర నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీ నగర్ సాగర్ రింగ్ రోడ్డులోని ఓ విద్యుత్ స్తంభాన్ని శనివారం అర్ధరాత్రి గంటల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లింది. దీంతో ఆ స్తంభంపై ఉన్న 11కేవీ విద్యుత్ తీగ తెగి.. సమీపంలోని రేణుకా ఎల్లమ్మ గుడి ఎదుట ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఇద్దరు వ్యక్తులు, వీధి శునకంపై పడింది. తీగ మీద పడడంతో మంటలు అంటుకుని ఆ యాచకులు దహనమయ్యారు. అదే తీగ గొంతుకు చుట్టుకోవడంతో శునకం కూడా మృత్యువాత పడింది. స్థానికుల సమాచారంతో పోలీసులు, విద్యుత్ శాఖ సిబ్బంది.. విద్యుత్ సరఫరాను నిలిపివేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుల గుర్తింపు వివరాలు తెలియాల్సి ఉంది. విద్యుత్ శాఖ అధికారులు ప్రమాదం ఎలా జరిగింది ? అనే దానిపై పరిశీలన చేస్తున్నారు. 11కేవీ విద్యుత్ తీగ పాలిమర్ పిన్ ఇన్సులేటర్‌లోని రాడ్ ఊడిపోవడంతో తీగ తెగిపడి ఉంటుందని భావిస్తున్నారు. కాగా, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్టుగా ఉందని అభిప్రాయపడ్డారు.

భారీ వర్షాలకు దేశ వ్యాప్తంగా
25 మంది మృతి

- పిడుగుపాటు, కరెంటు షాక్‌లతో మరణాలు

న్యూఢిల్లీ, జూన్ 15: భారీ వర్షాల కారణంగా ఆదివారం 24 గంటల వ్యవధిలో దేశ వ్యాప్తంగా 25 మంది మరణించారు. పిడుగుపాటు, కరెంటు షాక్‌లు, నీటిలో మునిగిపోవడం వంటి కారణాలతో ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్‌ల్లో ఈ దుర్ఘటనలు చోటు చేసుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా జిల్లాలో పిడుగు పడి 13 ఏళ్ల బాలిక మరణించింది. బిజ్నోర్ జిల్లాలో మరో బాలిక వర్షం నీటిలో స్నానం చేస్తుండగా, ఆకస్మికంగా డ్రెయిన్ పొంగడంతో అందులో కొట్టుకుపోయింది. యమునానగర్ జిల్లా సోన్‌బర్సా గ్రామంలో అర్ధరాత్రి పిడుగు పడడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్, పంచమహల్ జిల్లాల్లో ఆకస్మికంగా భారీ వర్షాలు కురిశాయి. రాజ్‌కోట్ జిల్లాలో కరెంటు షాక్ కారణంగా ఒకరు ప్రాణాలు కోల్పోయారు. పంచమహల్ జిల్లాలో పిడుగుపడి ఓ ఇంట్లో మంటలు వ్యాపించాయి. ఎలాంటి నష్టం జరగలేదు. ఢిల్లీలో ఈదురుగాలుల కారణంగా సెల్ టవర్ కూలింది. విద్యుత్తు తీగలపై ఓ చెట్టు కూలడంతో సంభవించిన కరెంట్ షాక్ కారణంగా ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్రలో పిడుగులుపడి 8 మంది మరణించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో బుధవారం వరకు 40-60 కి.మీ.వేగంతో గాలులు వీస్తాయని, పిడుగులు, ఉరుములు ఉంటాయంటూ అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

విహారయాత్ర విషాదాంతం

బాసర వద్ద గోదావరిలో మునిగి ఐదుగురు యువకుల మృతి

- అంతా హైదరాబాద్ వాసులు, బంధువులు
- వారిలో ముగ్గురు సొంత అన్నదమ్ములు

బాసర, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, చాదర్‌ఘాట్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసరలోని గోదావరి నది తీరంలో ఆదివారం ఘోరం జరిగింది. గోదావరి నదిలో స్నానానికి దిగి గల్లంతై హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు అన్నదమ్ములు సహా ఐదుగురు యువకులు చనిపోయారు. మృతులంతా బంధువులు కాగా.. తల్లిదండ్రులు, సన్నిహితులు చూస్తుండగానే వారంతా ప్రాణాలు కోల్పోయారు. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్, చింతల్‌లోని చంద్రానగర్‌కు చెందిన ప్రేమ్‌రామ్ రాథోడ్, సోనీ దంపతులు, వారి పిల్లలు రాకేష్ (20), మదన్ (18), భరత్ (16), దిల్‌సుఖ్‌నగర్‌లో నివాసముండే వారి బంధువులు కలిసి మొత్తం 15మంది ఆదివారం బాసరకు రైలులో వచ్చారు. అమ్మవారిని దర్శించుకునే ముందు వీరంతా గోదావరి నదిలో స్నానానికి వెళ్లారు. అయితే, నదిలో నీటి నిల్వలు తగ్గి అక్కడక్కడ ఇసుక మేటలు తేలాయి. దీంతో రాకేశ్, మదన్, భరత్, రుత్విక్ (22), వినోద్ (19) నాటు పడవలపై నది మధ్యలో ఇసుక మేటలు వేసిన ప్రాంతానికి వెళ్లి స్నానం చేస్తూ గల్లంతయ్యారు. వీరు నీళ్లలో దిగిన చోట లోతును గ్రహించలేక మునిగిపోయారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే వారిని ఒడ్డుకు చేర్చినా ఫలితం లేకపోయింది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను భైంసా ఆస్పత్రికి తరలించారు.


ఘటనలో చనిపోయిన యువకులు భరత్, మదన్, రాకేష్, రుత్విక్ (ఫైల్)

చదువుల్లో మేటి

రాజస్థాన్‌కు చెందిన ప్రేమ్ కుమార్ రాథోడ్ కుటుంబంతో సహా 15ఏళ్ల క్రితం హైదరాబాద్ వలస వచ్చి చింతల్, చంద్రానగర్‌లో కిరాణా హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉండే ప్రేమ్‌రామ్ రాథోడ్ ముగ్గురు కుమారులు చదువులోనూ రాణిస్తున్నారు. పెద్ద కొడుకు రాకేష్ ఆదివారం విడుదలైన నీట్ ఫలితాల్లో మంచి ర్యాంక్ సాధించాడని స్థానికులు తెలిపారు. రెండో కుమారుడు మదన్ ప్రస్తుతం ఇంటర్ చదువుతుండగా.. మదన్ మెరుగైన విద్యార్థి అని అధ్యాపకులు చెబుతున్నారు. ఇక, ప్రేమ్‌రామ్ చిన్న కొడుకు భరత్.. పదో తరగతిలో 591 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడని, ఇటీవల ఓ కార్యక్రమంలో సినీ నటుడు బాలకృష్ణ కూడా భరత్‌ను మెచ్చుకున్నారని స్థానికులు వెల్లడించారు. కాగా, అన్నదమ్ములు ముగ్గురూ మరణించడంతో ప్రేమ్‌రామ్ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. కాగా, ముసారాంబాగ్ శాలివాహననగర్‌లో ఉండే రుత్విక్.. తన అన్న ప్రవీణ్‌తో కలిసి స్థానికంగా కిరాణా వ్యాపారం చేస్తున్నాడు. అన్న, తల్లి, ఇద్దరు చెల్లెల్లు చూస్తుండగానే రుత్విక్ నీటి మునిగి కన్నుమూశాడు.

గణేశుడి విగ్రహం తరలిస్తుండగా..
విద్యుదాఘాతానికి గురై ఇద్దరి మృతి

- ఎనిమిది మందికి గాయాలు
- జగిత్యాల జిల్లా కోరుట్లలో ఘటన

కోరుట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఓ వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. తోపుడు బండిపై తరలిస్తున్న వినాయకుడి భారీ ప్రతిమ హైటెన్షన్ విద్యుత్ తీగలను తాకడంతో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు మరణించగా ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. అల్వాల వినోద్(32) అనే వ్యక్తి కోరుట్ల శివారులో శ్రీ బాలాజీ వినాయక విగ్రహ తయారీ కేంద్రం నిర్వహిస్తున్నాడు. అయితే, ఆ కేంద్రంలో తయారైన వినాయకుడి భారీ ప్రతిమను.. వినోద్ మరో 9 మంది కూలీలు కలిసి తోపుడుబండిపై మరో షెడ్డుకు తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో విగ్రహం.. పైన ఉన్న 33/11 కేవీ లైన్‌కు తగిలింది. విగ్రహం తడిగా ఉండడంతో విద్యుత్ సరఫరా జరిగి బండిని తోస్తున్న వారంతా విద్యుదాఘాతానికి గురై ఒక్కసారిగా ఎగిరి పడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తుండగా.. విగ్రహ తయారీ కేంద్రం నిర్వాహకుడు వినోద్‌తోపాటు సాయికుమార్(29) అనే కూలీ మార్గమధ్యలో మరణించారు. మిగిలిన 8 మంది తీవ్రంగా గాయపడగా వారిలో ఆరుగురిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లోని ఆస్పత్రులకు తరలించారు.

ఆదిలాబాద్
డీసీసీబీ డైరెక్టర్ కిడ్నాప్!

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని డిమాండ్ చేయడంతో హరీశ్ కుమార్ తన సన్నిహితులకు ఫోన్ చేసి కొంత నగదు కావాలని కోరినట్లు సమాచారం. అయితే, హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద ఆగిన సమయంలో హరీశ్ కుమార్ చాకచక్యంగా కిడ్నాపర్ల చెర నుంచి తప్పించుకున్నారు. అక్కడి నుంచి నేరుగా తూప్రాన్ పోలీస్‌స్టేషన్ వెళ్లి జరిగిన ఘటన గురించి పోలీసులకు తెలిపారు. కాగా, ఈ ఘటన నిర్మల్ జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది. కిడ్నాప్ జరిగిన మాట నిజమేనని తాను ప్రస్తుతం క్షేమంగా ఉన్నానని, ఎవరూ ఆందోళన చెందవద్దని హరీశ్ కుమార్ తమ సన్నిహితులకు ఫోన్ చేసి చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని మామడ ఎస్సై అశోక్ తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌లో
1.93 లక్షల కేసులు రాజీ

- సైబర్ నేరాల బాధితులకు రూ.53 కోట్లు చెల్లింపు

హైదరాబాద్, జూన్15(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 1,93,439 కేసులు రాజీ చేశామని డీజీపీ జితేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 6,294 సైబర్ నేరాలకు సంబంధించి 6,848 మంది బాధితులకు రూ.53కోట్ల సొమ్మును రిఫండ్ చేయించామని తెలిపారు. గత త్రైమాసికంలో జరిగిన మెగా లోక్ అదాలత్‌లో 1,83,182 కేసులను రాజీ చేయించగా ఈ సారి వీటి సంఖ్య పెరిగిందని పేర్కొన్నారు. జరిమానా విధించతగిన ఎఫ్ఐఆర్ కేసులు 22,095, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కేసులు 8,922, ఈ-పెట్టి కేసులు 84,601, ఎంవీ యాక్ట్ కేసులు 71,527 రాజీ చేయించామని వివరించారు. సైబర్ నేరాల్లో బాధితులకు సొమ్ము వాపసు చేయించడంలో హైదరాబాద్ కమిషనరేట్ తొలి స్థానంలో ఉందని, తర్వాత స్థానాల్లో సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సంగారెడ్డి జిల్లా ఉన్నాయని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


శంకర్ (ఫైల్)


గంభీరావుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పంట దిగుబడి ఆశించిన మేర లేకపోవడం, అప్పులు పెరిగిపోవడం, అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన దుద్దెడి శంకర్(55) తనకున్న ఐదెకరాల వ్యవసాయ భూమిలో వరి, కౌలుకు తీసుకున్న రెండెకరాల్లో మామిడి సాగు చేశాడు. వరి, మామిడి ఆశించిన దిగుబడి రాలేదు. రూ.4 లక్షల వరకు అప్పులయ్యాయి. దీనికి తోడు అనారోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో అప్పులు తీర్చే మార్గం కనిపించక జీవితంపై విరక్తి చెందిన శంకర్ శనివారం సాయంత్రం పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

విజయ్ రూపాణీ మృతదేహం గుర్తింపు

ఇప్పటివరకు 47 దేహాల డీఎన్ఏ విశ్లేషణ పూర్తి.. 24 దేహాలు కుటుంబ సభ్యులకు అప్పగింత

- విమాన ప్రమాద స్థలంలో ముక్కలుగా లభ్యమైన మృతదేహాలు
- అన్ని భాగాలకు డీఎన్ఏ విశ్లేషణతో ఆలస్యం జరుగుతోందంటున్న ఆస్పత్రి వర్గాలు
- ముక్కలుగా ఉన్న శరీరభాగాలను అప్పగిస్తుండటంతో బంధువుల ఆవేదన

అహ్మదాబాద్, జూన్ 15: ఎయిరిండియా విమాన ప్రమాదంలో కన్నుమూసిన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ మృతదేహాన్ని వైద్యులు ఆదివారం ఉదయం గుర్తించారు. ఆయన కుటుంబసభ్యుల డీఎన్ఏతో సరిపోల్చి నిర్ధారించామని తెలిపారు. గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ స్వయంగా రూపాణీ కుటుంబసభ్యులను కలిసి ఈ విషయం చెప్పారని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి రుషికేష్ పటేల్ వెల్లడించారు. రూపాణీ మృతదేహాన్ని ప్రత్యేక విమానంలో రాజ్‌కోట్‌కు తరలించి సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎయిరిండియా విమానం కూలిన ఘటనలో 241 మంది ప్రయాణికులు, సిబ్బందితోపాటు వైద్య విద్యార్థులు, వైద్యులు, వారి కుటుంబసభ్యులు, హాస్టల్ మెస్‌లోని పనివారు, ఆ ప్రాంతంలో ఉన్నవారు కలిపి మరో 33 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. విమాన ప్రమాదంలో భారీ పేలుడుతోపాటు మంటలు వ్యాపించడంతో.. చాలా మంది మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. చాలా మృతదేహాలు ఛిద్రమై భాగాలు చెల్లాచెదురుగా పడ్డాయి. వాటన్నిటినీ అహ్మదాబాద్ నగర సివిల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతదేహాలు, భాగాల నుంచి శాంపిళ్లు సేకరించి.. ఆ డీఎన్ఏతో కుటుంబసభ్యుల డీఎన్ఏను సరిపోల్చే ప్రక్రియ చేపట్టారు. అన్ని భాగాలకు డీఎన్ఏ విశ్లేషణ చేయాల్సి వస్తుండటంతో ఆలస్యం జరుగుతోందని వైద్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకు 47 మృతదేహాలకు డీఎన్ఏ విశ్లేషణ పూర్తయిందని, అందులో 24 దేహాలను కుటుంబసభ్యులకు అప్పగించామని చెప్పారు.


గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ

అయితే ముక్కలు ముక్కలుగా ఉన్న కొన్ని శరీర భాగాలను అప్పగిస్తుండటంతో.. కుటుంబసభ్యులు తీవ్రంగా ఆవేదనకు లోనవుతున్నారు. పూర్తి మృతదేహాన్ని అప్పగించాలని వైద్యులను వేడుకుంటున్నారు. ఇక తమ వారి మృతదేహాల గుర్తింపు ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురుచూస్తున్న కుటుంబసభ్యులు, బంధువుల రోదనలతో ఆస్పత్రి ప్రాంగణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మరోవైపు ఘటనా స్థలంలో శిథిలాల తొలగింపు, సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రధాని మోదీ కార్యాలయ ముఖ్య కార్యదర్శి పీకే మిశ్రా ఆదివారం విమాన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. ఎయిరిండియా విమాన ప్రమాదంపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సోమవారం మధ్యాహ్నం తొలి భేటీ నిర్వహించనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

ఆకాశ మార్గంలో తెగిన కేబుల్

- మనాలీలో జిప్‌లైన్ నుంచి కిందపడ్డ బాలికకు తీవ్ర గాయాలు

మనాలీ, జూన్ 15: ప్రముఖ పర్యాటక కేంద్రం మనాలీలో విహారయాత్రకు వచ్చిన ఓ కుటుంబానికి దుర్ఘటన ఎదురయింది. కొండలను కలుపుతూ ఏర్పాటు చేసిన తీగ మార్గంపై ఆదివారం జిప్‌లైన్ ద్వారా విహరిస్తున్నప్పుడు ఆ కుటుంబానికి చెందిన 12 ఏళ్ల బాలిక ప్రమాదానికి గురయింది. నాగ్‌పూర్‌కు చెందిన ప్రఫుల్ బిజ్వే కుటుంబం విహార యాత్ర నిమిత్తం ఇక్కడికి వచ్చింది. ఆయన కుమార్తె త్రిష బిజ్వే... కేబుల్‌పై నడిచే జిప్‌లైన్‌పై ఆకాశ మార్గంలో విహరించడానికి ఉత్సాహం చూపించింది. ఆమె విహరిస్తున్న సమయంలో అకస్మాత్తుగా ఆ తీగ తెగిపోవడంతో కిందనున్న బండలపై పడిపోయింది. పలుచోట్ల తీవ్రగాయాలపాలైన ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా ప్రస్తుతం కోలుకుంటోంది. ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యవర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మొదట అంతా సవ్యంగానే సాగింది. అకస్మాత్తుగా కేబుల్ తెగిపోవడంతో ఆమె కిందనున్న రాళ్లపై పడిపోయింది. ఈ దుర్ఘటనకు సంబంధించిన పరిహారంపై జిప్‌లైన్ నిర్వాహకులు, కుటుంబసభ్యులు అవగాహనకు వచ్చారని మనాలీ డీఎస్పీ తెలిపారు.

ఆ విమాన నిర్వహణ మేం చేపట్టలేదు

- స్పష్టం చేసిన తుర్కియే

న్యూఢిల్లీ, జూన్ 15: అహ్మదాబాద్‌లో విమానం కూలిన ఘటన నేపథ్యంలో.. ఎయిరిండియా విమానాల నిర్వహణలో టర్కిష్ టెక్నిక్ పాత్రపై అనుమానాలు తలెత్తిన సంగతి తెలిసిందే. డ్రీమ్‌లైనర్ కూలిపోవడంలో టర్కిష్ టెక్నిక్ ప్రమేయం ఉందన్న ఆరోపణలు వచ్చాయి. ఇవన్నీ తప్పుడు ఆరోపణలని తుర్కియే స్పష్టం చేసింది. 'ఎయిరిండియా ప్యాసింజర్ విమానం టేకాఫ్ సమయంలో కూలిపోయింది. అయితే టర్కిష్ టెక్నిక్ అనే సంస్థ ఈ విమాన నిర్వహణను నిర్వహించిందనేది వాస్తవం కాదు' అని రిపబ్లిక్ ఆఫ్ తుర్కియే డైరెక్టరేట్ ఆఫ్ కమ్యూనికేషన్స్ సెంటర్ ఫర్ కౌంటర్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎయిరిండియాకు చెందిన ఏ ఒక్క బోయింగ్ విమానానికి కూడా టర్కిష్ టెక్నిక్ సంస్థ నిర్వహణ పనులు చేపట్టలేదని ఆ ప్రకటనలో వివరణ ఇచ్చింది. 2024-2025లో ఎయిరిండియా, టర్కిష్ టెక్నిక్ మధ్య కుదిరిన నిర్వహణ ఒప్పందాలు బీ777 వైడ్-బాడీ విమానాలకు మాత్రమేనని తెలిపింది. భారత్-తుర్కియే మధ్య సంబంధాలపై ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆ దేశ అధికారులు పేర్కొన్నారు. కూలిపోయిన విమాన నిర్వహణను చేపట్టిన కంపెనీ గురించి తమకు తెలుసని, కానీ.. వివాదాల జోలికి వెళ్లకూడదనే ఉద్దేశంతో ఆ వివరాలు వెల్లడించడం లేదని చెప్పారు. తుర్కియేకు చెందిన ఒక ఏజెన్సీ ఎయిరిండియా విమాన నిర్వహణ బాధ్యతలు చేపట్టిందంటూ యోగా గురువు బాబా రామ్‌దేవ్ బహిరంగ వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో తుర్కియే ఈ వివరణ ఇచ్చింది.

బొమ్మలు: అక్బర్

చదువు ముచ్చట్లు

సాంబమూర్తి లండ

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

బాల్యంలో మాక్సింగ్ గోర్కీ 'అమ్మ'. అప్పుడంతగా కొరుకుడు పడలేదు కానీ ఆ పుస్తకంతో నాదొక ఎమోషనల్ జర్నీ. యవ్వనంలో బాలగంగాధర్ తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' ఇష్టంగా చదువుకున్నాను. ఇంటర్ డిగ్రీ చదివే రోజుల్లో ఆ పుస్తకం లోని కొన్ని వాక్యాలు చదువుకుని నిద్రపోవడం, మళ్ళీ పొద్దున్నే తలగడ కింద నుంచి పుస్తకాన్ని తీసి ఒకట్రెండు వాక్యాలు చదివి గానీ లేవకపోవడం. మతగ్రంథం లెక్కన్నమాట.

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?



చిన్నప్పుడు లాంతరు వెలుగులో నాన్న చదివి వినిపించిన పురాణాలు, నవలలు, కథలు, పద్యాలు నన్ను పుస్తక ప్రేమికుడిని చేశాయి. సహజత్వం మీద ఇష్టంతో జానపద కథల వెంట పడ్డాను. స్నేహితుల ప్రభావం ఊహల్లోంచి నేల మీదకొచ్చి పడేలా చేసింది. ప్రపంచాన్ని సరిగా అర్థం చేసుకోవడానికి సైన్స్ అనే

"రక్షణతంత్రంలా కవిత్వాన్ని ఆశ్రయిస్తాను"

మూడో చూపు అవసరాన్ని గుర్తించాను. మహీధర నళినీ మోహన్ నా అభిమాన కలం. యండమూరి – యద్దనపూడి అనే భిన్న ధ్రువాలతో యవ్వనం గడిచిపోయింది. ఆఖర్లో బుచ్చిబాబును చదవడం పెద్ద కుదుపు. వర్తమానంలో అమ్మలేని వెలితిని కవిత్వంతో పూడ్చుకున్నాను. నా దృష్టిలో కవిత్వం సంపూర్ణ ప్రక్రియ. అలా కాల్పనిక రచనలతో మొదలై సైన్స్ మీదుగా కవిత్వం గూటికి చేరుకున్నాను.

ఇటీవల చదివి ఇష్టపడిన పుస్తకం?

సిద్ధార్థ కవిత్వ సంపుటి 'మల్లెల తీర్థం మహాఖననం'.



నిన్ను నువ్వు వదిలించుకోవటం తోటే కవిత్వం మొదలవుతుంది అనే ఆయన వాక్యం నిటారుగా నిలబెడుతుంది. వ్యక్తిగత జీవితంలో, వర్తమాన సమాజంలో ఇప్పుడున్న సంక్లిష్టతకు ఈ కవిత్వంలో కారణం దొరుకుతుంది. భాషాపరమైన స్థానికత కవితా వస్తువుతో కనెక్ట్ చేస్తుంది. బరువైన విషయాలను సైతం పాఠకుడి రోజువారీ అనుభవాలతో సందర్భాలతో జోడించి చెప్పడం వల్ల కవిత్వ సారాంశాన్ని చదువరి తన శక్తి మేర అందుకోగలుగుతాడు.

కవిత్వం పట్ల మీ దృక్పథాన్ని మలిచిన పుస్తకాలేవి?

నగ్నముని 'కొయ్యగుర్రం'తో నాకు కవిత్వం అంతిమ లక్ష్యం తెలిసొచ్చింది. 'I met my future' అనిపించింది. వ్యవస్థ వాస్తవిక పార్శ్వాలన్నింటినీ కవిత్వం అనే సిల్వర్ స్క్రీన్ మీద చూపెట్టిన పుస్తకమది.

మీరు ఎక్కువసార్లు చదువుకున్న కవిత్వ సంపుటి ఏది?

శేషేంద్ర 'ఆధునిక మహాభారతం'. రోజుకొక్క సారైనా గాయపడకుండా గడవని కాలంలో ఇది నా డగౌట్. కొన్నిసార్లు మనం అనుకున్న వాళ్ళే మన నుండి దూరంగా జరిగిపోతారు. మాటలతో ప్రవర్తనతో గాయపరుస్తారు. ఆ నిర్భాంతత కొన్నాళ్ళు కొనసాగుతుంది. ఇలాంటి సమయాల్లో ఒక రక్షణతంత్రంలా కవిత్వాన్ని ఆశ్రయిస్తాను. ఇంకొన్నిసార్లు ఎదురైన అనుభవాలు, కలిసిన వ్యక్తులు, చూసిన విన్న చదివిన సంఘటనలు భయపెడతాయి, బాధపెడతాయి. నిస్సహాయత చుట్టేస్తుంది. అలాంటప్పుడు శేషేంద్ర వాక్యాలు చదువుకుని మామూలు మనిషి అవుతాను. అవి కేవలం రసాత్మక వాక్యాలేనా? ఈ పట్టాల మీదే ప్రపంచం అనే రైలుబండిని అందుకున్నాను.

మీరు తరచూ మననం చేసుకునే కవిత్వ పంక్తులు?

శ్రీశ్రీ రాసిన 'ఆః!' కవిత:

"నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నే నెగిరిపోతే,
నిబిడాశ్చర్యంతో వీరు..

నెత్తురు క్రక్కుకుంటూ నేలకు నే రాలిపోతే
నిర్దాక్షిణ్యంగా వీరే.."

అలాగే నా ఒక వాక్యాన్ని కూడా నేను తరచూ మననం చేసుకుంటుంటాను:

"నేను చెట్టుని
ప్రతి తుఫాను తర్వాతా
నా మరణం
వాయిదా పడుతుంటుంది"

ఈ రెంటిలో– ఒకటి డాలు. మరొకటి కత్తిని కాపాడుకునే ఒర.

(సాంబమూర్తి లండ కవి. ఇప్పటిదాకా మూడు కవిత్వ సంపుటాలను వెలువరించారు. అవి: 2020లో 'గాజు రెక్కల తూనీగ', 2022లో 'నాలుగు రెక్కల పిట్ట', 2024లో 'ఆమెకు మిగలని ఆమె'.)

✆ 96427 32008

"ప్రతి జాతి జీవితంలోనూ ఒక సమయం వస్తుంది. అధికార మదాంధులూ, డబ్బు మదం కలవారూ, వారి పాలక యంత్రం, కాపలా కుక్కలూ – ప్రజల మీద దోపిడీ పీడనలను విస్తృతం చేసి జాతి మనుగడను దుర్భరం చేస్తారు. అలాంటి సమయంలో ప్రజలకు బ్రతకడం కంటే పోరాడి చావడమూ, శాంతికంటే అలజడీ ప్రియాతి ప్రియమైన విషయాలుగా పరిణమిస్తాయి"


– ఆలూరి భుజంగరావు (ఆత్మకథ 'గమనా గమనం'లో).

కల్లోల జీవితంపై అక్షరాల వంతెన

నోట్స్ కొనే డబ్బుల్లేక, ఖాళీ సిగరెట్ పెట్టె మీద టీచర్ చెప్పిన పాఠాలు రాసుకుని, వాటిని దారాలతో కుట్టి, చూరుకు వేలాడదీసి, తీరిక సమయాల్లో చదువుకుని... ఇలాంటి కల్లోల జీవితంలోంచి కమ్యూనిస్టుగా, రచయితగా, అనువాదకుడిగా ఆదర్శవంతమైన జీవితం లోకి ఎదిగారు ఆలూరి భుజంగరావు.

శిక్షించకపోతే చదువు రాదని పిల్లల కండ్లలో మిరియపు గంధం పెట్టడం, తల్లిదండ్రులే తమ పిల్లల్ని కమ్మరి దగ్గరికి తీసుకెళ్లి కాళ్లకు సంకెళ్లు వేయించడం వంటి అమానుష పద్ధతులు పాటించే కాలంలో– మూడోతరగతి వాచకం కొనమని గొడవపెట్టినందుకు కొనలేని దుస్థితిలో తండ్రి చింతబరికతో చావ బాదడంతో భుజంగరావు గారి చదువు అర్ధాంతరంగా ఆగిపోయింది. తర్వాతేముందీ... గోళీలాటలూ, బీడీలు కాల్చడాలూ, ఇంట్లో బియ్యం ఎత్తుకెళ్ళి సినిమాలు చూడ్డం, చిరుతిళ్ళూ, చిల్లర తిరుగుళ్ళూనూ!

తొమ్మిదో ఏట పొట్టకూటి కోసం పాట్లు మొదలయ్యాయి. వృద్ధుడైన తండ్రి వల్ల పూట గడవని స్థితిలో భుజంగరావు అన్నలతో కలిసి మధూకరం (భిక్ష) తెచ్చేవారు. పదేళ్ల వయసులోనే హోటల్ కార్మికుడిగా చేరి 23వ ఏట దాకా గుంటూరు, బెజవాడ, తెనాలి, బాపట్ల, చేబ్రోలు పట్టణాల హోటళ్లలో చాకిరీ చేశారు. తిండీ నిద్రా అక్కడే. తెల్లవారుజామున 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకూ పొగలో సెగలో పని. పొట్టకూటి కోసం అలా పాట్లు పడుతూనే హిందీ, తమిళం, కన్నడం, భాషల్ని నేర్చుకున్నారు. కథలు రాశారు. అవి చదివిన కష్టమర్లు హోటల్లో ఈయన్ని చూసి "ఆ రచయిత ఈయనా!" అని మొహం తిప్పుకుపోయేవారట. ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదవడం చూసి యజమానులు కస్సుమనేవారు. నెల జీతంతో పాటు బీడీలకు అర్ధణా దక్షిణ ఇచ్చేవారు. అవి కాల్చుకోడానికి పది నిమిషాల విరామం ఇచ్చేవారు. బీడీలు కాల్చక పోతే అర్ధణాతోపాటు ఆ విరామమూ పోతుందని బీడీలు కాల్చారు.



ఓ పక్క హోటల్లో పని చేస్తూనే, సంగీతం నేర్చుకోవాలన్న ఒక గురువు సలహా ప్రకారం తెల్లవారుజామున చలిలో స్వరసాధన కోసం పార్కులో కూర్చుని, ఎలుగెత్తి అరిచి, లాభం లేదని విరమించుకున్నారు. కొన్నాళ్ళు చిత్రకళ అభ్యసించి థియేటర్లలో బోర్డులు రాసి చేతులు కాల్చుకున్నారు. సురభి నాటక సంస్థలో చేరి చిట్టిపొట్టి వేషాలేశారు. మద్రాసువెళ్లి పూట భోజనమూ, ఐదు రూపాయల కూలీకి 'గొల్లభామ', 'నారద నారది' సినిమాల్లో అతిథి పాత్రలేశారు.

దుర్భర జీవితాన్ని గడుపుతూనే హిందీ భాషా సాహిత్యాల అధ్యయనం కోసం హిందీ నేర్చుకున్నారు. ఆయనకు హిందీ నేర్పిన గురువు కూడా ఒక హోటల్ పనివాడే కావడం విచిత్రం. పలక కూడా కొనుక్కోలేని దీన స్థితి చూసి పాపం ఆ గురువే పలక కొనిచ్చాడు. మద్రాసులో అద్దెగది. చింకిచాప కూడాలేని దుస్థితి. ఒక వార్తా పత్రిక మీద పడుకుని మరో పత్రికను కప్పుకుని కాలక్షేపం చేశారు. బ్రతకడానికి హిందీ ట్యూషన్లు చెబుతానంటే, అందుకోసం 'రాష్ట్రభాష' పరీక్ష పాసవ్వాలి గానీ, రాహుల్ సాంకృత్యాయన్నీ, ప్రేమచంద్నీ చదివి హిందీ పాఠాలు చెబుతానంటే ఎలా? అని పెదవి విరిచారట.

హోటల్లో చదువుకుంటే యజమాని ఒప్పుకోడు కాబట్టి రోడ్డుపక్కన కూర్చుని చదువుకున్నారు. అభ్యుదయ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. "గోర్కీ జీవితం, 'అమ్మ' నవలా నాకెంత ఇష్టమంటే కడుపుకి ఆపరేషన్ చేయించుకున్నపుడు దాన్ని తల కింద పెట్టుకుని పడుకున్నాను" అన్నారు. ఉద్యోగానికి ఎసరు వస్తుందని తెలిసి కూడా మేడే ప్రదర్శనలో పాల్గొన్నారు. అలా హోటల్లో పని కూడా పోయింది. రచనా వ్యాసంగంలోకి అడుగు పెట్టి 'కుక్క ఆత్మకథ', 'అంతా గమ్మత్తు', 'దిక్కు మొక్కు లేని జనం', 'ప్రజలు అజేయులు' వంటి నవలలు, 'సాహిత్య బాటసారి శారద' జీవిత చరిత్రా రాశారు. ప్రేమ్ చంద్, రాహుల్ సాంకృత్యాయన్, కిషన్ చందర్, యశ్ పాల్, సరోజ్ దత్తాల రచనలను తెలుగు లోకి అనువదించారు.

'వెలుగురవ్వల జడి'లో తన అనుభవాలను వివరించారు. 'ప్రభాత్' పత్రికకు సంపాదకులుగా ఉన్నారు.

"ప్రతి జాతి జీవితంలోనూ ఒక సమయం వస్తుంది. అధికార మదాంధులూ, డబ్బు మదం కలవారూ, వారి పాలక యంత్రం, కాపలా కుక్కలూ – ప్రజల మీద దోపిడీ పీడనలను విస్తృతం చేసి జాతి మనుగడను– దుర్భరం చేస్తారు. అలాంటి సమయంలో ప్రజలకు బ్రతకడం కంటే పోరాడి చావడమూ, శాంతికంటే అలజడీ ప్రియాతి ప్రియమైన విషయాలుగా పరిణమిస్తాయి" అంటారు ఆలూరి తన ఆత్మకథ 'గమనా గమనం'లో. 1928 లో గుంటూరు జిల్లా కొండముది గ్రామంలో జన్మించిన ఆయన విరసం సభ్యుడిగా, రచయితగా, అనువాదకుడిగా, జీవితాన్ని అర్థవంతం చేసుకుని 2013 జూన్ 20 న తుది శ్వాస విడిచారు.

■ పి.యస్. ప్రకాశరావు

✆ 99637 43021

నా మొదటి పుస్తకం


చిన్న పుస్తకమైనా అనుకోని స్పందన

నామాడి శ్రీధర్



రాజమండ్రి నుంచి నలుగురు మిత్రులం (ఒమ్మి రమేష్ బాబు, తల్లావజ్ఝల శశిశేఖర్, ఇక్బాల్ చంద్) 1990లలో ఇస్మాయిల్ గారిని కలవడానికి కాకినాడ వెళుతుండేవాళ్ళం. ఆయన ఆచితూచి మాట్లాడిన తర్వాత అప్పుడప్పుడు నేను ఒకటిరెండు కవితలను వినిపించేవాడిని. ఓసారి నన్ను ఉద్దేశించి ఆయనన్నారు: "మీ కవితలతో చిన్న పుస్తకం వేయండి." ఆ ప్రతిపాదన ఆనాటి నుంచి నా మనసులో మెదులుతుండేది. ఆలోపు ఉద్యోగనిమిత్తం హైదరాబాద్ చేరుకున్నాను. అక్కడే నా కవిత్వం 'ఆకుపచ్చ లోయ' (1996) పుస్తక రూపం తాల్చింది.

వాడ్రేవు చినవీరభద్రుడు, సతీష్ చందర్, అఫ్సర్ గార్లు అపురూపమైన ముందుమాటలు రాశారు. కవిత్వసారాన్ని తల్లావజ్ఝల శివాజీ గారు ముఖచిత్రంలోకి పట్టితెచ్చారు. కవర్ పేజీ కోసం 'చేతితో తయారు చేసిన కాగితం' ఎంచుకున్నాను. పుస్తకానికయ్యే మొత్తం వ్యయంలో ముఖపత్రానికి సగం ఖర్చుచేశాను. చరిత ప్రెసులో అచ్చువేశారు. అందుకు అవసరమైన డబ్బుని మా నాన్నగారు సమకూర్చారు.



నిజానికి అది చిన్న పుస్తకం. అయినా అనుకోని స్పందన లభించింది. మిత్రులు, పలువురు ఇష్టకవులు అక్కున చేర్చుకున్నారు. "మాటల గాజుపెంకుల మీద జాగ్రత్తగా అడుగులు వేయడం నేర్చుకున్నారు" అని జాబు రాశారు ఇస్మాయిల్. "సబ్బుతో చేతుల్ని శుభ్రంగా కడుక్కొన్న తర్వాత పుస్తకం తెరిచాను" అని వేగుంట మోహన్ ప్రసాద్ చెప్పారు. అద్భుతమైన సాహిత్య సంపాదకీయంతో ఎబికె ప్రసాద్ అబ్బురపరిచారు. 'అంతర్ముఖుడి గాయాలాపన' అంటూ కలేకూరి ప్రసాద్ తన సమీక్షలో అభివర్ణించారు. అలాగే సహృదయుల ప్రశంసకి పాత్రమై గొప్ప ఉత్తరాల్ని అందుకున్నాను.

నిబద్ధత, నిమగ్నతల మధ్య సరిహద్దురేఖని తుడిచివేసిన తరానికి చెందుతాను నేను. ఏనాటికీ ప్రత్యుత్తరం లేని ప్రేమలేఖల ప్రతీక్ష; యావత్ప్రపంచం కోనసీమలాగ సతతం హరితమనే అమాయకత; హృదయాంతరాళంలోంచి ఉప్పొంగిన నినాదం శుష్కవచనమైన సంవేదన 'ఆకుపచ్చ లోయ' పుటల్లో దాగి ఉన్నాయి. నా కవితలు క్లుప్తంగా ఉండటంతో కవిభావన చదువరికి సరిగా అందడం లేదని ఒకరిద్దరు విమర్శించారు. ఆ వ్యాఖ్యని గమనంలోకి తీసుకున్నాను. కానీ కవితకి క్లుప్తత, గాఢత చిరశాశ్వతమైన మౌలికగుణాలనే ఎరుకతో ఉన్నాను. డేవిడ్ షుల్మాన్ 'పురాగానం' కవితని ఆంగ్లంలోకి అనువదించారు. దానిని తన 'Spring, Heat, Rains: A South Indian Dairy' (2009) పుస్తకంలో చేర్చారు.

'ఆకుపచ్చ లోయ'ని ఇప్పటికీ కొందరు గుర్తుపెట్టుకున్నారు. ఎక్కడో ఎవరో తారసపడినప్పుడు అందులోంచి ఒకటిరెండు స్టాంజాలని ఉదహరిస్తుంటారు. అలా సుదూరగత స్మృతిపేటికని తెరుస్తారు. అటువంటివేళ సంభ్రమాశ్చర్యాలతో నవయవ్వనంలోకి రెక్కలు విప్పుతాను. పుస్తకం ప్రచురించిన స్వల్పకాలానికి మా అమ్మగారు అర్ధాంతరంగా కనుమూశారు. అనంతరం ఓనాడు ఆమె బీరువా తెరిచాను. నేను తనకి రాసిన లేఖలతో పాటు పదిలపరిచిన 'ఆకుపచ్చ లోయ' ప్రతిని కూడా చెమ్మగిల్లే కళ్ళతో చూశాను.

✆ 93968 07070

నిబద్ధత, నిమగ్నతల మధ్య సరిహద్దురేఖని తుడిచివేసిన తరానికి చెందుతాను నేను. ఏనాటికీ ప్రత్యుత్తరం లేని ప్రేమలేఖల ప్రతీక్ష; యావత్ప్రపంచం కోన సీమలాగ సతతం హరితమనే అమాయకత; హృదయాంతరాళంలోంచి ఉప్పొంగిన నినాదం శుష్కవచనమైన సంవేదన 'ఆకుపచ్చ లోయ' పుటల్లో దాగి ఉన్నాయి.

***

పుస్తకం ప్రచురించిన స్వల్పకాలానికి మా అమ్మగారు అర్ధాంతరంగా కనుమూశారు. అనంతరం ఓనాడు ఆమె బీరువా తెరిచాను. నేను తనకి రాసిన లేఖలతో పాటు పదిలపరిచిన 'ఆకుపచ్చ లోయ' ప్రతిని కూడా చెమ్మగిల్లే కళ్ళతో చూశాను.

కల



ఆదిమానవులు చేసిన ప్రయాణంలోని
అసలైన సౌందర్యాన్ని పట్టుకోడానికి
అతడు సుదీర్ఘ యాత్ర చేస్తున్నట్లు
నిద్రలో కలగన్నాడు

సూర్యుని కింది మనుష్యుల సుఖదుఃఖాలను
దాటాడు
జంతువుల అమాయకత్వాన్ని చేత్తో తాకాడు
నదులు దాహంతో తాగిన సూర్యోదయాల్ని
సముద్రాలు వెన్నెలను చూసి పడిన మోహాల్ని
చూసాడు




అడవుల్లో చెట్ల కొమ్మలకు
వేలాడే భయాల్ని
అడవే నాకు కాపలా ఉండగా
అడవి నన్నేం చేస్తుంది అనుకునే
లేత ప్రాణుల ధైర్యాన్ని
విన్నాడు

గుహల్లో నిద్రపోతున్న శతాబ్దాల
పక్క నుండి నడిచాడు
జలపాతాల తాడు పట్టుకొని ఊగి
ఇసుక తుఫాను ఆగిపోయాక మెల్లిగా కళ్ల తెరిచిన
ఎడారుల్లోంచి నడుచుకుంటూ
అగ్నిపర్వతం అంచును చేరి
అగ్నిపుష్పాన్ని తెంపుకొని జేబులో పెట్టుకొని
ఆ అంచు నుండి ఎగిరి మంచుపర్వతాల మీద పడి
జారిపోయి ఒక లోయలో పడ్డాడు.



పడడం పడడం
అప్పటికే ఆ లోయలోకి
జారిపడ్డ మనుష్యుల మధ్య
పడ్డాడు
ఆ తర్వాత ఆ మనుష్యులు చెప్పిన
చంద్రుని కింది మనుష్యుల సుఖదుఃఖాల
కథల నుండి కదిలి
తిరిగి తన ప్రయాణాన్ని కొనసాగించాడు.

■ భగవంతం



నకిలీ నవ్వు

చిన్నప్పుడు నాన్న
ఇంటినొదిలి వేరే ఊరికి
రెండు నెలల పాటు
హమాలి పనికెళ్ళినప్పుడు
హోరు వర్షంలో
ఇంటి ఇనుపరేకులెక్కడ
ఎగిరిపోతాయోనని
మంచం కింద దాక్కున్నప్పుడే
నా లేలేత నవ్వు నరికేయబడింది

నాలుగో తరగతిలో
హాస్టల్ నుండి బాసర లోని
శ్రీజ్ఞాన సరస్వతీదేవిని
దర్శించడానికెళ్ళినప్పుడు
అక్కడి పెన్ను పుస్తకాలను తీసుకుంటే
చదువు బాగొస్తుందని
కొనుక్కొచ్చామని స్నేహితులందరు
ఆటోలో మాట్లాడుకుంటుంటే
రిక్త హస్తాలతో ఉన్న నాకు
చదువు రాదని
నవ్వుతున్న వాళ్ళ మొహాలు
నా నవ్వును
అయస్కాంతంలా లాక్కున్నాయి

ఇల్లు కట్టినప్పుడు
పది సంవత్సరాలుగా పెంచుతున్న
మేకలన్నింటినీ అమ్మినా కూడా
అప్పులైనందుకు
మా తండానొదిలి
కట్టిన ఇల్లునొదిలి
పిస్సివాళ్ళ తండాకు
వలసెళ్ళినప్పుడు
నా నవ్వు మా తండా లోనే
ఉండిపోయింది

నచ్చిన అంగీని
షాపు లోనే వదిలేసొచ్చినప్పుడు
నా నవ్వు ఆ తెల్లని అంగీ లోనే
మెరుపైపోయింది

ఇంటరైనా ప్రైవేటు కాలేజీలో చదవాలని
ఎండకాలమంతా మేస్త్రీ పనికెళ్ళి
సంపాదించిన పైసలన్నింటినీ
కాలేజీలో ఫీజు కట్టినప్పుడు
నా నవ్వు ఫీజు కౌంటర్
దగ్గరే ఉరేసుకుంది

మిత్రుల దగ్గర అప్పులు చేసి
నచ్చిన పుస్తకాలను తీసుకుంటున్నప్పుడు
షాపులో నాకేసి చూస్తున్న పుస్తకాలను
వదిలేసొచ్చినప్పుడు
వాటిని తీస్కెళ్ళేంత వరకు
నా నవ్వును బయానాగా
ఇచ్చేస్తుంటాను

బాధ్యతలు
నచ్చిన చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టించి
వేరే ఉద్యోగం కోసం ప్రయత్నించటానికి
బలవంతం చేసినప్పుడు
నా నవ్వు పూర్తిగా కాల్చివేయబడింది

మొహమ్మీద
నవ్వును అతికించడానికి
ప్రయత్నించినప్పుడల్లా
పదేపదే విఫలమవుతుంటాను
నకిలీ నవ్వేమో?
ఎంత ప్రయత్నించినా
అధిక సమయంపాటు
అతకబడటం లేదు

■ జాధవ్ అంబదాస్

✆ 94902 31380

శ్రీపతి కథలపై ప్రసంగం

రాజాం రచయితల వేదిక 125వ సమావేశం జూన్ 22 ఉ.10 గంటలకు విజయనగరం జిల్లా, రాజాం పట్టణంలోని శ్రీవిద్యానికేతన్ స్కూల్లో జరుగుతుంది. ఆల్తి మోహనరావు అధ్యక్షతన జరిగే ఈ సభలో 'శ్రీపతి కథలు – ఒక పరిశీలన' అనే అంశంపై రాజాపు శాంతారావు ప్రసంగిస్తారు. వివరాలకు: 7095184846.

పిల్లా తిరుపతిరావు,

దాశరథి, ఆరుద్రలపై సదస్సు


ఎస్ఆర్ & బిజిఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ఖమ్మం ఆధ్వర్యంలో 'శతజయంతి సాహితీ మూర్తులు – దాశరథి, ఆరుద్ర జీవితం, సాహిత్యం' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జూన్ 20, 21 తేదీల్లో కళాశాల సెమినార్ హాల్‌లో జరుగుతుంది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, డిగ్రీ కాలేజీల అధ్యాపకులు70కి పైగా పరిశోధనా పత్రాలను సమర్పిస్తారు. వివరాలకు: 9290403605.

పి. రవికుమార్

తెరేష్ బాబు స్మారక సంచిక

దళిత కవి, కథకుడు, కళాకారుడు పైడి తెరేష్ బాబు స్మారక సంచిక వెలువరిస్తున్న నేపథ్యంలో తెరేష్ బాబు గురించిన వ్యాసాలు, కవితలు, జ్ఞాపకాలు లేదా మరేదైనా రచనలు జూన్ నెలాఖరులోగా పంపించవలసిందిగా మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆహ్వానిస్తోంది. సాహితీవేత్తలు జి.వి.రత్నాకర్, పి. శ్రీనివాస్ గౌడ్ దీనికి సంపాదకత్వం వహిస్తారు. 70135 07228, 99494 29449 నెంబర్లకు వాట్సప్‌లో గాని లేదా srinivasgoudpoet@gmail.comకు ఈమెయిల్ గాని చేయవచ్చు. వివరాలకు: 99494 29449.

కలిమిశ్రీ



అంతులేని విషాదాలు

నదులు, బీచ్‌లు, రోడ్డు ప్రమాదాల్లో నగరవాసుల మృత్యువాత

విషాదయాత్రలుగా మారుతున్న విహార యాత్రలు

- బాసరలో ఐదుగురి మృతితో ఉలిక్కపడ్డ సిటీజనులు
- కొత్త ప్రదేశాల్లో జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు



హైదరాబాద్ సిటీ, జూన్15 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో, స్నేహితులతో సరదాగా ప్రారంభమవుతున్న విహారయాత్రలు కొన్ని విషాదంగా మారుతున్నాయి. విహార, విజ్ఞాన యాత్రలు, దైవ దర్శనాలకు వెళ్లిన వారు తిరిగి క్షేమంగా ఇళ్లకు చేరే పరిస్థితులు ఉండటంలేదు. ఏదో ఒక ప్రమాదానికి గురవుతూ ప్రాణాలను కోల్పోతున్నారు. విహార యాత్రలకు వెళ్లే వారు కొత్త ప్రదేశాల గురించి అవగాహన కలిగి ఉండకపోవడం, సరైన జాగ్రత్తలను తీసుకోకపోవడం వల్లే ప్రమాదాల బారిన పడుతున్నారని పోలీసులు పేర్కొంటున్నారు.

బాసరలో ప్రమాదం.. నగరంలో విషాదం

బాసరకు విహారయాత్రకు వెళ్లిన నగరానికి చెందిన మూడు కుటుంబాల్లో తీరని విషాద నెలకొంది. గోదావరి నదిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి ఐదుగురు యువకులు మృతిచెందారు. ఈ హఠాత్పరిణామంతో కుటుంబ సభ్యులు, తోటి టూరిస్టులు షాక్‌కు గురయ్యారు. మృతుల్లో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ఉన్నారు. హైదరాబాద్ యువకులు బాసరలో మృత్యువాత పడిన విషయం తెలిసి నగర వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సోషల్ మీడియాతో పాటు.. టీవీల్లోనూ గోదావరిలో మునిగి యువకులు మృత్యువాత

మిగతా 6వ పేజీలో..

ఈ జాగ్రత్తలు పాటించాలి

- తెలియని ప్రదేశాలకు వెళ్లినప్పుడు అక్కడ గైడ్స్ సహకారం తీసుకోవాలి. వారి సలహాలు, సూచనల మేరకు అక్కడి ప్రదేశాలను చూడాలి.
- ముఖ్యంగా నదీ తీరాలు, సరస్సులు, బీచ్‌లాంటి ప్రదేశాలకు వెళ్లినప్పుడు ప్రమాదకర ప్రాంతాల గురించి ముందే తెలుసుకోవాలి.
- తెలిసీ తెలియక సముద్రతీరంలో లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దు.
- టూరిస్టుల కోసం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను గుర్తించాలి. అక్కడి ప్రమాదకర ప్రాంతాల గురించి తెలుసుకోవాలి.
- కారులో, ట్రావెల్స్ బస్సుల్లో విహార యాత్రలకు వెళ్లేవారు నిపుణులైన ఇద్దరు డ్రైవర్లను ఏర్పాటు చేసుకోవాలి.
- డ్రైవర్లు తగినంత నిద్రపోయేలా/ విశ్రాంతి ఉండేలా చూసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి పగలూ ఒకే డ్రైవర్‌తో డ్రైవింగ్ చేయించకూడదు.
- రాత్రిపూట ప్రయాణించేవాళ్లు.. మంచు ఎక్కువగా ఉన్న సమయంలో ప్రయాణాలు చేయకూడదు.
- వాహనాలకు బ్రేకులు, టైర్లు, ఇంజన్ భాగాలను ఎప్పటికప్పుడు చెక్ చేయాలి.



కేబీఆర్ పార్క్‌లోని మల్టీలెవల్ రోటరీ కారు పార్కింగ్

మల్టీలెవల్ కారు పార్కింగ్ సిద్ధం

బంజారాహిల్స్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన మల్టీలెవల్ రోటరీ కారు పార్కింగ్ వ్యవస్థ ప్రారంభానికి సిద్ధమైంది. కొరియన్ కంపెనీ, నవ నిర్మాణ్ అసోసియేట్స్ జాయింట్ వెంచర్‌లో పదేళ్ల పాటు పీపీపీ పద్ధతిన జీహెచ్ఎంసీ చేపట్టిన మల్టీలెవల్ కార్ల పార్కింగ్ వ్యవస్థ పనితీరును ఆదివారం ట్రయల్‌రన్ ద్వారా నిర్వాహకులు పరిశీలించారు. సుమారు రూ.6కోట్ల వ్యయంతో 400 చదరపు గజాల స్థలంలో నిర్మాణం చేపట్టిన ఈ ప్రాజెక్టులో ప్రతీస్టాక్‌లో 12 కార్ల చొప్పున మొత్తం 72 వాహనాలను పార్కింగ్ చేయవచ్చు. ఇది అందుబాటులోకి వస్తే పార్కింగ్ సమస్యకు పరిష్కారం లభించినట్లవుతుంది.





చొరబాటుదారులపై ఏం చేద్దాం..!

భవిష్యత్ కార్యాచరణపై ఉన్నతాధికారులు సమాలోచనలు..

- వేలల్లోకి చేరుతున్న విదేశీ అక్రమ వలసదారులు
- రెట్టింపవుతున్న బంగ్లాదేశీయులు
- నగరంలో 70వేలకు పైగా రోహింగ్యాల తిష్ఠ

హైదరాబాద్ సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నగరంలో అక్రమ వలసదారులు పెరిగిపోతున్నారు. వివిధ మార్గాల ద్వారా విదేశీయులు సైతం నగరంలో చొరబడుతూ తిష్ఠ వేస్తున్నారు. అడ్డదారిలో ఆధార్, ఓటర్ ఐడీ వంటి గుర్తింపు కార్డులను సంపాదించి పాతుకుపోయినట్లు తెలుస్తోంది. అయితే, విదేశీ వలసలను అడ్డుకోవడానికి, ఇప్పటికే తిష్ఠ వేసిన వారిపై ఉక్కుపాదం మోపడానికి ప్రత్యేక భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో అతి త్వరలోనే పోలీస్, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు సమావేశం కానున్నట్లు ఓ పోలీస్ ఉన్నతాధికారి ద్వారా తెలిసింది. ఇప్పటికే రోహింగ్యాల సంఖ్య వందల నుంచి వేలల్లోకి వెళ్లిందని, ప్రస్తుతం బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చే వారితోనూ పరిస్థితి ప్రమాదకరంగా మారే అవకాశం లేకపోలేదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇటీవల ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పలు విషయాలు వెలుగుచూశాయి. అప్పటికే నగరంలో 210మంది పాకిస్థానీలున్నట్లు వెలుగులోకి వచ్చింది. సుమారు 70వేల మంది వరకు రోహింగ్యాలు, 700మంది వరకు నైజీరియన్స్, మరి కొందరు చొరబాటుదారులు అక్రమంగా ఉన్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. ఇటీవల పోలీసులకు పట్టుబడిన ముఠాలో వెలుగుచూసిన కొన్ని విదేశీ అక్రమ వలసదారుల ఘటనలు ఇలా ఉన్నాయి.

పేరుమార్చుకుని..

బంగ్లాదేశ్‌లోని ఢాకాకు చెందిన మహ్మద్ హసీబుల్ అలియాస్ జోవన్ చౌదరి (25), రోమన్ సాహ అలియాస్ రహన్ (21) నాలుగేళ్ల క్రితం అక్రమ వలసదారులకు రూ.25వేలు చెల్లించి గుట్టుగా కోల్‌కతాకు వచ్చారు. ఆ తర్వాత పేర్లను హసిబుల్ జోవన్ చౌదరిగా, రోమన్ రహన్‌గా మార్చుకున్నారు. కొంతకాలం అక్కడ పనిచేసి హైదరాబాద్ యువతిని పెళ్లిచేసుకొని నగరానికి మకాం మార్చారు. స్థానికుల సహకారంతో ఆధార్‌కార్డు, ఇతర

మిగతా 8వ పేజీలో..

యూడైస్..పరేషాన్

ఉచిత బుక్స్ రాక విద్యార్థుల ఆందోళన

- పాఠ్య పుస్తకాలకు 'ఆధార్'తో ముడి
- పేర్లు నమోదు కాక గోదాముల నుంచి రాని పరిస్థితి
- ఉపాధ్యాయులను నిలదీస్తున్న తల్లిదండ్రులు
- అధికారుల వద్దకు పరుగులు తీస్తున్న టీచర్లు
- 9వేల మంది విద్యార్థుల పేర్లు
- ఇప్పటికీ యూడైస్‌లో నమోదు కాని పరిస్థితి



హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫాంలను అందజేస్తున్నట్లు అధికారులు ఊదరగొడుతున్నా చాలామందికి రాలేదు. విద్యాశాఖకు సంబంధించిన యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (యూడైస్ ప్లస్)లో విద్యార్థి పేరు నమోదు చేయకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. అయితే, ఉచిత బుక్స్ చేతికి అందకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా పాఠశాలలకు చేరి ఉపాధ్యాయులను నిలదీస్తున్నారు.

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంల పంపిణీ కోసం యూడైస్ ప్లస్‌లో విద్యార్థి పేరు తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే యూ డైస్‌లో

మిగతా 6వ పేజీలో..



పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందుకుంటున్న విద్యార్థి

యూడైస్‌లో నమోదైనా..

మారేడ్‌పల్లిలోని ఓ పాఠశాలలో 3వ తరగతిలో ఉన్న 46 మంది విద్యార్థుల పేర్లు యూడైస్‌లో నమోదైనప్పటికీ కేవలం 28 మందికి మాత్రమే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ వచ్చాయి. మిగతా 18మందికి రాకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. సిస్టమ్ పొరపాటు జరిగిందో, నమోదులో జరిగిందో తెలియక టీచర్లు సతమతమవుతున్నారు.

డబ్బు ఎందుకు అంటూ మందలించడంతో..

- సారీబావ.. అంటూ మెసేజ్..
- ఆ తర్వాత యువకుడి అదృశ్యం



గడ్డం ప్రవీణ్

కూకట్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సారీ బావ... అంటూ మెసేజ్ చేసిన యువకుడు కనిపించకుండా వెళ్లిపోయిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలానగర్‌లోని హెచ్ఎంటీ టూల్స్‌లో పనిచేస్తున్న గడ్డం ప్రవీణ్ (33) సమీపంలోని క్వాటర్స్‌లో నివసిస్తున్నాడు. అయితే, తనకు అవసరం ఉన్నాయంటూ బావ కొప్పుల రజినీకాంత్ వద్ద రూ.25వేలు తీసుకున్నాడు. ఈ విషయం తెలిసిన ప్రవీణ్ సోదరి డబ్బులు ఎందుకు కావాలి.. ఎక్కడ ఖర్చు చేస్తున్నావని అతన్ని ప్రశ్నించింది. దీంతో మనస్తాపం చెందిన ప్రవీణ్ ఈనెల 11న సాయత్రం 4గంటలకు 'సారీ బావ..' అంటూ రజినీకాంత్‌కు మెసేజ్ చేసి, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి కనిపించకుండా పోయాడు. దాంతో ప్రవీణ్ మిత్రుల వద్ద అతని గురించి ఆరా తీయగా ఆన్‌లైన్ యాప్‌లలో బెట్టింగ్‌లు ఆడుతున్నట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో రజనీకాంత్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రాణాలు తీస్తున్న పాత తీగలు!

నగరంలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

- కాలం చెల్లిన వాటిని పట్టించుకోని పరిస్థితి
- తీగలు తెగిపడి ఎల్బీనగర్‌లో ఇద్దరి సజీవదహనం
- మెటల్‌రాడ్ దెబ్బతినడం వల్లే ప్రమాదం..
- ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన అధికారులు



పాలిమర్ పిన్ ఇన్సులేటర్ రాడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో పాత విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు స్థానికుల పాలిట మృత్యుపాశాలుగా మారుతున్నాయి. విద్యుత్ లైన్ల నిర్వహణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు వాటిని గాలికి వదిలేస్తున్నారు. పలు ప్రాంతాల్లో కరెంట్ వైర్లపై అధిక లోడ్ పడి ఎప్పుడు తెగిపోతాయో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదకరంగా మారినా విద్యుత్ తీగలు గుర్తించి మార్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. వేల కిలోమీటర్లు విద్యుత్ లైన్ల నిర్వహణకు ప్రతి ఏటా దక్షిణ డిస్కం కోట్లు ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మారడం లేదు.

ఎల్బీనగర్ చింతలకుంట ప్రాంతంలో ఆదివారం 11కేవీ విద్యుత్ తీగలు తెగిపడి ఇద్దరు అగ్నికి ఆహుతి కావడం గ్రేటర్‌లోని విద్యుత్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి వర్షాకాలం ప్రారంభానికి ముందే అధికారులు ప్రాంతాలవారీగా విద్యుత్ లైన్లు పరిశీలించడంతో పాటు ప్రమాదకరంగా ఉన్న పాత తీగలను తొలగించాల్సి ఉంటుంది. అయితే గ్రేటర్‌లో చాలాచోట్ల ఇప్పటికీ కాలంచెల్లిన తీగలు ఉన్నప్పటికీ వాటిని మార్చేందుకు చర్యలు చేపట్టే నాథుడే కరువయ్యాడు. ప్రధానంగా ఎల్బీనగర్, ఉప్పల్, ఎర్రగడ్డ, జీడిమెట్ల, కూకట్‌పల్లి, హబ్సిగూడ, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మియాపూర్, హఫీజ్‌పేట, కొండాపూర్ లాంటి ప్రాంతాల్లో విద్యుత్ తీగలు రోడ్ల వెంట

మిగతా 6వ పేజీలో..



నాలుగేళ్ల చిన్నారిపై బాలుడి అత్యాచారం

జీడిమెట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జగద్గిరి గుట్ట పరిధిలో నాలుగేళ్ల చిన్నారిపై 15సంవత్సరాల బాలుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఇంటిపక్కనే ఉంటున్న నాలుగేళ్ల చిన్నారికి ఓ బాలుడు మాయమాటలు చెప్పి శనివారం రాత్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

ఖైరతాబాద్ గణపతి మూల స్తంభం ఏర్పాటు



ఖైరతాబాద్, జూన్15 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ గణేష్ తయారీ పనుల్లో ఆదివారం మరో ఘట్టాన్ని పూర్తిచేశారు. విగ్రహ తయారీ కోసం ప్రధానంగా ఉండే మూల స్తంభాన్ని ఆదివారం క్రేన్ సహాయంతో నిలబెట్టి వెల్డింగ్ పనులు చేశారు. ఉదయం ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీప్ రాజ్, చైర్మన్ రాజ్‌కుమార్‌లు పూజలు చేయగా మూడడుగుల బేస్‌పైన దాదాపు 50అడుగుల మూల స్తంభాన్ని తాళ్ల, క్రేన్ సహాయంతో నిల్చోబెట్టి వెల్డింగ్ పనులు చేశారు. మచిలీపట్టణానికి చెందిన నాగబాబు బృందం భారీ గణేశ్ విగ్రహ ఏర్పాటు వెల్డింగ్ పనులను చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపూర్ నుంచి తెప్పించిన సర్వే కర్రలతో ఆదిలాబాద్ జిన్నారానికి చెందిన నర్సయ్య బృందం మండప షెడ్డు ఏర్పాటు పనులను ప్రారంభించారు. 69 అడుగుల ఎత్తుతో తయారవుతున్న గణపతి విగ్రహం కోసం 73 అడుగుల ఎత్తులో ఈ మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

లేక్స్ ఎస్ఈ.. కుర్చీ ఖాళీ

పదినెలలుగా భర్తీ చేయని వైనం



ఇన్‌చార్జి బాధ్యతలూ అప్పగించలేదు..

మంత్రాల చెరువు ఉప్పొంగి జలమయమైన జిల్లెలగూడ మిథిలానగర్ (ఫైల్)

- చెరువుల చెంత పూర్తికాని పనులు
- ఇప్పటికే నిండుకుండల్లా చెరువులు
- వర్షాకాలం వేళ పొంచి ఉన్న ముప్పు

ఇదీ లెక్క..

జీహెచ్ఎంసీ పరిధిలోని చెరువులు	185
గొలుసు కట్టు చెరువులు	175
ఐసోలేటెడ్ లేక్స్	10
చెరువులకు అనుసంధానంగా ఉన్న మేజర్ నాలాలు	29

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చేసింది. ఈ ఏడాది భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ నేపథ్యంలో మహానగరంలో పరిస్థితేంటి? ముంపు ముప్పు, రోడ్లపై వరదనీటి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వ విభాగాలు సిద్ధంగా ఉన్నాయా..? అంటే ఇప్పటి వరకు లేదన్నదే సమాధానం. వరద నీటి నిర్వహణలో కీలకమైన జీహెచ్ఎంసీలోని లేక్స్ విభాగంలో పది నెలలుగా సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) స్థానం ఖాళీగా ఉంది. దీంతో చేపట్టిన పనుల్లో పురోగతి లేక ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది పరిస్థితి. అధికారిక లెక్కల ప్రకారం నగరంలో 185 చెరువులున్నాయి. వీటిలో 175 గొలుసు కట్టు చెరువులు కాగా, 10 ఐసోలేటెడ్ లేక్స్ ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తే చెరువులు పొంగిపొర్లి పక్కనున్న కాలనీలు, బస్తీలు నీట మునుగుతాయి. ఎప్పటికప్పుడు చెరువుల్లో నీటి మట్టం తనిఖీ చేస్తూ తూములు, అలుగుల ద్వారా నీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకోవడం వర్షాకాలంలో చాలా ముఖ్యం. ఇప్పటికే గ్రేటర్‌లోని మెజార్టీ చెరువులు నిండుకుండల్లా మారాయి. భారీ వర్షం కురిస్తే ముంపు ముప్పు ఉండే అవకాశం ఉంది.

జీహెచ్ఎంసీలోని లేక్స్ విభాగం చీఫ్ ఇంజనీర్ పర్యవేక్షణలో అధికారులంతా పని చేస్తారు. అయితే, గత ఆగస్టు నుంచి లేక్స్ విభాగం ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇప్పటి వరకు ఎవరికీ బాధ్యతలు అప్పగించకపోగా.. కనీసం

మిగతా 6వ పేజీలో..



మత్తు సరఫరాకు కొత్త ఎత్తులు

- ప్రజా రవాణా, ఆటోలు వినియోగిస్తున్న స్మగ్లర్స్
- రాచకొండ ప్రత్యేక పోలీసు బృందాలు నిఘా
- రెండు నెలల్లో రూ. 5 కోట్ల విలువైన సరుకు స్వాధీనం

6

రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని టెకీ దుర్మరణం

- స్నేహితుడి వివాహానికి హాజరై తిరిగి వెళ్తుండగా ఘటన

6

ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీలు



6

ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీలు

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యాత్రికులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోని ఆలయాలు, విహార ప్రాంతాల సందర్శన కోసం ఆర్టీసీ ఆయా డిపోల నుంచి ప్రత్యేక ప్యాకేజీతో బస్సులు నడుపుతోంది. బర్కత్‌పుర డిపో నుంచి, హైదరాబాద్ నుంచి వరంగల్, జోగులాంబ గద్వాల్, వికారాబాద్ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ పలు రకాల ప్యాకేజీలతో బస్సులు నడుపుతున్నట్లు బర్కత్‌పుర డిపో మేనేజర్ మంజుల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టూర్ ప్యాకేజీల బస్సులు ఎంజీబీఎస్ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. గద్వాల్‌లో అలంపూర్ జోగులాంబ ఆలయం, నవ బ్రహ్మ ఆలయం, పాపవినాసిని, సంగమేశ్వర స్వామి ఆలయం, జూరాల ప్రాజెక్ట్ సందర్శనకు పెద్దలకు ఒకరికి రూ.1,450, పిల్లలకు రూ. 1000 ప్యాకేజీతో బస్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. డిపో నుంచి ఉదయం 4 గంటలకు బస్సు ప్రారంభమై రాత్రి తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. వికారాబాద్ అనంతగిరి హిల్స్, కోటపల్లి రిజర్వాయర్ ప్యాకేజీలో పెద్దలకు ఒకరికి రూ.1000, పిల్లలకు రూ.600ల టికెట్ చార్జీలు ఉంటాయని తెలిపారు. ఉదయం 6 గంటలకు మొదలైన బస్సు రాత్రి 10గంటల వరకు నగరానికి చేరుకుంటుందని అన్నారు. రామప్ప దేవాలయం, వరంగల్ పోర్టు, భద్రకాళి ఆలయం సందర్శనకు పెద్దలకు ఒకరికి రూ.1100, పిల్లలకు రూ.700లతో వెళ్లవచ్చని తెలిపారు. నగరంలో ట్యాంక్‌బండ్, గోల్కొండ పోర్ట్, సాలర్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ సందర్శనకు పెద్దలకు ఒక్కరికి రూ.300, పిల్లలకు రూ. 150గా టికెట్లతో బస్సులు అందుబాటులో ఉన్నాయని, ఈ ప్యాకేజీ బస్ ఉదయం 6గంటలకు ప్రారంభమవుతాని తెపాపారు. బస్సుల ప్రత్యేక ప్యాకేజీ, ఇతర వివరాలకు ఫోన్ నం.9000406069లో సంప్రదించాలని పేర్కొన్నారు.

తండ్రి ప్రేమ ప్రభావవంతమైనది

● రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ రజని ప్రియ

అల్వాల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తండ్రి ప్రేమ, తల్లి ప్రేమకు భిన్నంగా ఉండవచ్చు కానీ తండ్రి ప్రేమ ప్రభావవంతమైదని రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ కె.రజని ప్రియ అన్నారు. తన పిల్లల ఎదుగుదలకు తండ్రి మార్గనిర్దేశం చేస్తారని వివరించారు. సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆదివారం ఫాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ వృద్ధాశ్రమాల నుంచి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్ నుంచి దాదాపు 1,200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి నిలయంలో తిరగడానికి గైడెడ్ టూర్ అవకాశం కల్పించారు. ఎస్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, జయాఆర్ట్స్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శాస్త్రీయ, వాయిద్య సంగీత బృందం సంగీత విభావరిని నిర్వహించింది. ఈ వేడుకలకు నగరానికి చెందిన ప్రముఖ డాక్టర్ ఎస్‌వీ కామేశ్వరి, డాక్టర్ సూర్యప్రకాష్ వింజమూరి దంపతులు హాజరై కుటుంబంలో తండ్రి పాత్రను వివరించారు.


వైద్యులు కామేశ్వరి, సూర్యప్రకాష్‌ను సన్మానించిన రజని ప్రియ



ఉర్రూతలూగించిన చిత్రామృతం

హైదరాబాద్‌సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గాయని చిత్ర సంగీత కార్యక్రమం 'చిత్రామృతం 2.0' శనివారం రాత్రి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. 'యే మేరే వతన్ కే లోగో' అంటూ 'ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న వీర సైనికులకు నివాళులర్పించిన ఆమె, నువ్వొస్తానంటే నే వద్దంటానా, జగదానంద కారకా, చిలకమ్మా చిటికేయంగ.. తదితర పాటలను పాడి నగరవాసులను ఉర్రూతలూగించారు. దాదాపు 3గంటల పాటు జరిగిన ఈ చిత్రామృతం కార్యక్రమంలో సంగీత దర్శకులు ఆర్‌పీ పట్నాయక్, మణిశర్మ సహా పలువురు గాయనీగాయకులు పాల్గొన్నారు. త్వరలోనే ఈ చిత్రామృతం కార్యక్రమాన్ని పలు నగరాలలో నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నామని కార్యక్రమ నిర్వాహక సంస్థ ఎన్ చాంట్ మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు.


పాట పాడుతున్న గాయని చిత్ర

సైబరాబాద్‌లో 283 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వారం రోజుల వ్యవధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 283 మందిపై కేసులు నమోదయ్యాయి. కమిషనరేట్ పరిధిలో 16 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉండగా, ఆయా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేకంగా నిర్వహించిన తనిఖీల్లో 283 కేసులు నమోదయ్యాయి. అందులో 219మంది ద్విచక్ర వాహనదారులు, 11మంది త్రీ వీలర్, 50 మంది ఫోర్ వీలర్ వాహనాలను నడుపుతున్న వారు ఉన్నారని పోలీసులు తెలిపారు. అత్యధికంగా చేవెళ్ల ట్రాఫిక్ పీఎస్‌లో 27మంది, శంషాబాద్‌లో 26 మంది, మియాపూర్, బాలానగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 22 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని సైబరాబాద్ పోలీసులు తెలిపారు.

లేక్స్ ఎస్ఈ.. కుర్చీ ఖాళీ !

(5వ పేజీ తరువాయి)

ఇన్‌చార్జిని కూడా నియమించలేదు. ఎస్ఈ స్థాయి అధికారిని డిప్యూటేషన్‌పై పంపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ పలుమార్లు ఇరిగేషన్ విభాగానికి లేఖ రాసినా అక్కడి నుంచి స్పందన లేదని తెలుస్తోంది.

నిలిచిన పనులు

చెరువు కట్టల బలోపేతం, తూములు, అలుగుల మరమ్మతు, మురుగునీటి మళ్లింపు పనులను సంస్థ ఆరేళ్ల క్రితం రూ.217.33 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి దశలవారీగా చేపట్టింది. మొదటి విడతగా 20 ప్రాంతాల్లో చేపట్టిన పనుల్లో ఎనిమిది పూర్తయ్యాయి. మిగతా చోట్ల పనులు యేడాది క్రితం నిలిచిపోయాయి. నిధుల కొరత, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో పనుల్లో ముందడుగు పడలేదు. రెండో దశ పనులు పట్టాలెక్కనేలేదు. తొలిదశ పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో చెరువుల చుట్టూ ఉన్న ప్రాంతాలకు ముంపు ముప్పు పొంచి ఉంది. ఇలాంటి సమయంలో ఎస్ఈ లేకపోవడం ముంపు ముప్పు నివారణ, వరద నీటి నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం లేక్స్ విభాగం చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న అధికారి నాలుగు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. దీంతో ఆయన పూర్తిస్థాయిలో దృష్టి సారించే పరిస్థితి లేదు.



అంతులేని విషాదాలు

(5వ పేజీ తరువాయి)

పడిన దృశ్యాలు చూసిన ప్రతిఒక్కరి మనసు చలించిపోయింది.

విషాదం నింపిన ఘటనల్లో కొన్ని..

2022లో విశాఖ ఆర్కే బీచ్‌లో సికింద్రాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు మృత్యువాత పడటం తీవ్ర కలకలం సృష్టించింది. సికింద్రాబాద్ రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌కు చెందిన 8 మంది స్నేహితులు కొత్త సంవత్సర వేడుకలను ఎంజాయ్ చేయాలని విశాఖ వెళ్లారు. రెండు రోజులపాటు అక్కడే ఉండి దైవ దర్శనాలు చేసుకొని సరదాగా గడపాలని ఆర్కే బీచ్‌కు వెళ్లారు. నీటిలో దిగగా ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగసి పడిన రాకాసి అల ముగ్గురు యువకులను సముద్రంలోకి లాక్కెళ్లింది. ఇద్దరి మృతదేహాలు లభ్యం కాగా.. మరొకరి మృతదేహం గాలించినా ఫలితం దక్కలేదు.

అరకులో బస్సు బోల్తా పడి..

2021లో షేక్‌పేటకు చెందిన కొట్టం సత్యనారాయణ కుటుంబసభ్యులు, స్థానిక కుటుంబాలు కలిసి దినేష్ ట్రావెల్స్ బస్సులో అరకు విహారయాత్రకు వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో ఘాట్‌రోడ్డులో బస్సు బ్రేకులు ఫెయిలై లోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఓ చిన్నారి సహా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. మరో 22 మంది గాయపడ్డారు. ఈ ఘటన రెండు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం సృష్టించింది.

శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్తూ..

2023లో శ్రీశైలం హైవేపై నాగర్‌కర్నూల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందారు. వారిలో నగరానికి చెందిన వారు నలుగురు. మరో ముగ్గురు ఏపీకి చెందిన వారున్నారు. రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృత్యువాత పడ్డ వారిలో నిజాంపేట, జీడిమెట్ల, ఆనంద్‌బాగ్‌కు చెందిన వారు ఉన్నారు.

నూతన దంపతులు సహా ఐదుగురు..

2023లో సికింద్రాబాద్ వెస్ట్ వెంకటాపురానికి చెందిన నూతన జంట తమ కుటుంబసభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల వద్ద రోడ్డుమీద ఆగివున్న లారీని ఢీకొట్టడంతో ఐదుగురు దుర్మరణం చెందారు. పెళ్లయిన ఆరు రోజులకే కుటుంబం మొత్తం మృత్యువాత పడడంతో వధువు, వరుడి కుటుంబంలో తీరని విషాదం నెలకొంది.




ముగిసిన కిక్ బాక్సింగ్ పోటీలు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : లులు మాల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న లైవ్ కిక్ బాక్సింగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. జాతీయస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 8 మ్యాచుల్లో 16 మంది బాక్సర్లు తలపడ్డారు. నగర ప్రజల్లో క్రీడలపై ఆసక్తి పెంచేందుకు తమవంతు బాధ్యతగా బాక్సింగ్ పోటీలు నిర్వహించినట్లు రీజనల్ డైరెక్టర్ అబ్దుల్ ఖదీర్ షేక్ తెలిపారు. విజేతలకు మెడల్స్, మెమెంటోలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం మహ్మద్ షరీఫ్, మేనేజర్ ఎడిల్ అరసన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న పాత తీగలు!

(5వ పేజీ తరువాయి)

ప్రమాదకరంగా ఉన్నా వాటిని స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారులు విస్తరిస్తున్న క్రమంలో విద్యుత్ స్తంభాలు, లైన్లు యుద్ధప్రాతిపదికన మార్చాల్సి ఉన్నా.. నెలల కొద్దీ వాటిని పట్టించుకోకపోవడంతో అవి ప్రమాదాలకు కేంద్రంగా మారుతున్నాయి.

కనిపించని సూచిక బోర్డులు

విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడ ఏర్పాటు చేసినా వాటి పరిసరాల్లో రక్షణచర్యలు తీసుకుని దాని పరిసరాల్లో అపాయం(డేంజర్) అని తెలిపేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ అలాంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. బేగంబజార్, చార్మినార్, అఫ్జల్‌గంజ్, సికింద్రాబాద్, కూకట్‌పల్లితో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను ఆనుకుని వ్యాపార కేంద్రాలు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎల్‌బీనగర్, ఉప్పల్, బోరబండ, రహ్మత్‌నగర్, ఎల్లారెడ్డిగూడ, ఖైరతాబాద్ వంటి ప్రాంతాల్లో హైటెన్షన్ విద్యుత్ తీగల కింద పెద్దసంఖ్యలో భవన నిర్మాణాలు చేపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

గ్రేటర్‌లో విద్యుత్ వ్యవస్థ


- 33 కేవీ యూజీ కేబుల్స్ : 1,280 కి.మీ.
- 33 కేవీ ఓవర్‌హెడ్ లైన్లు : 3,725 కి.మీ.
- 11 కేవీ ఓవర్‌హెడ్ లైన్లు : 21,643 కి.మీ.
- 11 కేవీ యూజీ కేబుల్ : 957కి.మీ.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు : 1,50,992
- విద్యుత్ స్తంభాలు : 5,08,271
- 33/11 కేవీ సబ్‌స్టేషన్లు : 498
- పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు : 1,022

అధికారులపై చర్యలు ఎక్కడ..?

లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటున్న కొంతమంది ఇంజనీర్లు విద్యుత్‌లైన్ల రక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మరమ్మతులకు కేటాయిస్తున్న నిధులు సైతం జేబులో వేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. విద్యుత్‌తీగలు తెగిపోతున్న సంఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపినా క్షేత్రస్థాయి అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తీగలు తెగిపోయేందుకు సాంకేతిక కారణాలు చూపిస్తూ కొంతమంది అధికారులు తప్పించుకుంటున్నారు.

మెటల్ రాడ్ దెబ్బతినడం వల్లే..

ఎల్‌బీనగర్‌లోని చింతలకుంటలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం విద్యుత్ స్తంభాన్ని తాకడంతో ఆ ఒత్తిడికి స్తంభంపై ఉన్న పాలిమర్ పిన్ ఇన్సులేటర్‌లోని మెటల్ రాడ్ దెబ్బతిని ఉంటుందని, అందువల్లే తీగలు తెగిపడి ఉంటాయని విద్యుత్‌శాఖ అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. సాధారణంగా విద్యుత్ తీగలు తెగిపోయి భూమిమీద పడగానే ఫీడర్ ట్రిప్ అయి కరెంట్ సరఫరా నిలిచిపోతుందని, ఈ ప్రమాదంలో తీగలు నేరుగా మనుషులపై పడడంతో ప్రమాదం జరిగిందని వారు పేర్కొంటున్నారు.





యూడైస్..పరేషాన్

(5వ పేజీ తరువాయి)

పేర్లు ఎంటర్ చేసేందుకు కావాల్సిన ఆధార్‌కార్డులు కొంతమంది విద్యార్థుల దగ్గర ఇప్పటికీ లేకపోవడంతో వారికి పుస్తకాలు అందని పరిస్థితి నెలకొంది.

12.50 లక్షల పాఠ్యపుస్తకాల ముద్రణ

గతానికి భిన్నంగా పాఠశాలలు ప్రారంభమైన రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఒక జత యూనిఫాం ఇచ్చేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు గతేడాది విద్యార్థుల సంఖ్యకు అదనంగా 10నుంచి 15 శాతం పుస్తకాలు, 5నుంచి 8శాతం యూనిఫాంలను అదనంగా సిద్ధం చేసింది. పాఠశాలలో చదువుకుంటున్న పాత విద్యార్థులకు తొలుత ఇచ్చిన తర్వాత.. కొత్తవారికి అందజేయాలని భావించింది. 1వ తరగతిని మినహాయించి మిగతా 2నుంచి 10వ తరగతి వరకు ఉండే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను ముద్రించింది. అలాగే యూనిఫాంలను కుట్టించింది. జిల్లాలోని 713 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న 94,339మంది విద్యార్థులకు సుమారు 12.50 లక్షల టెక్ట్స్ బుక్స్, 6.20 లక్షల నోట్‌బుక్స్‌ను ముద్రించారు.

ఉపాధ్యాయులతో వాగ్వాదం

పాఠశాలల పునః ప్రారంభం నేపథ్యంలో ఈనెల 12నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలను పంపిణీ చేస్తున్నారు. యూడైస్‌లో పేర్లు లేని పిల్లలకు బుక్స్ ఇవ్వని విషయం తెలుసుకున్న కొందరు తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగుతున్నారు. దీంతో ఉపాధ్యాయులు పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారు.

ప్రభుత్వం చొరవ చూపాలి

ప్రభుత్వం చొరవ చూపి పాఠశాలల్లో ఇప్పటి వరకు ఆధార్ తీసుకోని పిల్లల కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి కార్డులు అందించాలి. ఇలా చేస్తే కార్డులు వచ్చిన వెంటనే యూడైస్‌లో వారి పేర్లు నమోదు చేసి పుస్తకాలు, యూనిఫాంలు అందించే అవకాశం ఉంటుంది. లేకుంటే పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పడిపోయే ప్రమాదం ఉంటుంది. - మల్లికార్జున్‌రెడ్డి, హెచ్ఎం, చిలకలగూడ దూద్‌బౌలి ప్రాథమిక పాఠశాల

ఆధార్ లేకపోవడానికి కారణాలు

కొంతమంది విద్యార్థులకు ఆధార్ లేకపోయేందుకు వివిధ కారణాలున్నాయి. కొంతమందికి పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేకపోవడం, మరికొందరికి తల్లిదండ్రుల ఆధార్ అప్‌డేట్ కాకపోవడంతో ఇప్పటికీ వారు ఆధార్‌ను పొందలేకపోతున్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బిహార్, తదితర రాష్ట్రాల నుంచి నగరానికి వలసొచ్చిన వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. కాగా, అడ్మిషన్ సమయంలో ఆధార్ తప్పనిసరి అని చెబుతున్నప్పటికీ కొంతమంది తల్లిదండ్రులు ఆలస్యంగా ఇస్తామని చెబుతూ వెళ్తున్నారని, తర్వాత ఎన్నిసార్లు గుర్తు చేస్తున్నా పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని టీచర్లు వాపోతున్నారు. పుస్తకాలు రాని పిల్లలకు పాత తరగతికి చెందిన విద్యార్థుల నుంచి తెప్పించి ఇస్తున్నామని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, జిల్లాలోని మొత్తం 94,339 మంది విద్యార్థుల్లో ఇప్పటివరకు 9వేలకు పైగా మంది యూడైస్‌లో నమోదు కాలేదని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

రాజేంద్రనగర్ కోర్టుల్లో లోక్ అదాలత్



లోక్ అదాలత్‌లో పాల్గొన్న రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి నీలిమ, తదితరులు

రాజేంద్రనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ కోర్టులలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,046 కేసును పరిష్కరించినట్టు రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి నీలిమ అన్నారు. కార్యక్రమంలో 13వ అదనపు న్యాయమూర్తి నిష్కా పాత్రుడు, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రవి కుమార్, ఏపీపీ ప్రవీణ్ నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసోజు యాదగిరి, ప్రధాన కార్యదర్శి బందయ్య, లోక్ అదాలత్ సభ్యులు వెంకట్‌రెడ్డి, సుదర్శన్, సుదాకర్‌రెడ్డి, సుజాత, వరప్రసాద్, శ్రీనివాసులు, జ్ఞానేశ్వర చారి, తలారి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

'అశ్వక్ చిరస్మరణీయుడు'



ప్రసంగిస్తున్న మానవ హక్కుల వేదిక సమన్వయకర్త జీవన్‌కుమార్

బర్కత్‌పుర, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నివాస హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన అశ్వక్ చిరస్మరణీయుడని, మూసీ బచావో ఆందోళన ద్వారా దేశవ్యాప్త గుర్తింపు పొందారని మానవ హక్కుల వేదిక రెండు తెలుగు రాష్ట్రాల సమన్వయ కర్త జీవన్‌కుమార్ అన్నారు. ఆయన మరణం పేదల పోరాటాలకు తీరని లోటన్నారు. నివాస హక్కుల నేత అశ్వక్ రెండవ సంస్మరణ సభ ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మానవ హక్కుల వేదిక నగర అధ్యక్షుడు సురేష్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మలక్‌పేట మూసానగర్ బస్తీ నుంచి నివాస హక్కుల నేతగా జాతీయ స్థాయికి ఎదిగారని అనేక రాష్ట్రాల్లో జరిగిన పేదల పోరాటాల్లో భాగస్వాములయ్యారని అన్నారు. అశ్వక్‌ను ఆదర్శంగా తీసుకొని నివాస హక్కుల కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మౌంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ సంస్థ ప్రతినిధి హైమా, నివాస హక్కుల సాధనలో పేద ప్రజలెదుర్కొంటున్న ఇబ్బందులపై అమన్ వేదిక వ్యవస్థాపకురాలు అనురాధ, బాల కార్మికుల సమస్యలపై యుగంతర్ సంస్థ ప్రతినిధి కరీం అన్సారీ, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రసంగించారు. ఈ సంస్మరణ సభలో వివిధ సంఘాల నేతలు వసంతలక్ష్మి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా వీడియో పాడ్ కాస్టింగ్ వర్క్‌షాప్



పాడ్ కాస్టింగ్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఔత్సాహికులతో అతిథులు

రవీంద్రభారతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో ప్రముఖ ఆర్జే, ఫిలిం మేకర్ మిర్చి మహేష్ నేతృత్వంలో రెండు రోజుల పాటు జరిగిన వీడియో పాడ్ కాస్టింగ్ వర్క్‌షాప్ ఘనంగా జరిగింది. 400కి పైగా వచ్చిన అప్లికేషన్స్‌లో 110మంది ఔత్సాహికులకు రిజిస్ట్రేషన్ పద్ధతి ద్వారా అవకావం కల్పించి పాడ్ కాస్టింగ్ మాధ్యమం పట్ల అవగాహన కల్పించి పాల్గొన్న వాళ్ల ప్రాక్టికల్‌గా శిక్షణలో వీడియో రికార్డింగ్, ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్, స్టూడియో సెటప్ వంటి వాటిలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు గెస్ట్ స్పీకర్లుగా ప్రముఖ జర్నలిస్టు బుచ్చన్న గొర్ల, క్రైమ్ జర్నలిస్టు మురళీధర్ బలివాడ, రామ్ వెంకట్ శ్రీకర్, దర్శకుడు అక్షరకుమార్, యాంకర్ మంజూష అర్థ, రేఖ పర్వతాలుతో జరిగిన సంభాషణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ హాజరై మాట్లాడుతూ.. ఉపనిషత్తుల కాలం నుంచి ఇప్పుడు పాడ్ కాస్టింగ్‌గా పిలుచుకుంటున్న ఈ మాధ్యమం ఎలా పరిణామ క్రమం చెందిందో తెలియజేశారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఔత్సాహికులను ప్రోత్సహించడంలో భాగంగా వాళ్లకు ఎగ్జామ్ పద్ధతి ద్వారా ముగ్గురు విజేతలకు నగదు బహుమతి ప్రకటించి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ సాంస్కృతిని చాటి చెప్పే దిశగా యువత భవితకు ఉపయోగపడే ఇలాంటి సృజనాత్మకమైన ఆచరణాత్మక అవకాశాల్ని కల్పించడానికి ఎప్పటికీ సిద్ధంగా ఉంటామని హరికృష్ణ తెలిపారు.

అలరించిన జయహో తెలంగాణ నృత్యాలు



జబర్దస్త్ నటుడు గడ్డం నవీన్‌ను సత్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు పురస్కరించుకొని గ్లోబల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో జయహో తెలంగాణ పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు పలు నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించి అలరించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మాజీ ఎంపీ వేణుగోపాలచారి హాజరై కళాకారులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా సాంస్కృతికోత్సవం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కళాకారులు తమ ప్రతిభను చాటుతూ విశ్వవ్యాప్తంగా ప్రదర్శినలివ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జబర్దస్త్ నటుడు గడ్డం నవీన్, నంబూరి విజయశ్రీ, రజనీరెడ్డి, చంద్రశేఖర్, లయన్ కదిరి వెంకట రమణారావు, చకిలం సుధాకర్, పటాస్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మోహన్‌రాజుకు విజయపల్లవి సంగీత పురస్కారం



పురస్కారగ్రహీతను సత్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భీమన్న సాహితీ నిధి, కళానిలయం సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి పద్మభూషణ్ డా. బోయి భీమన్న కుమార్తె గాయని విజయపల్లవి బోయి జయంతి సభ జరిగింది. ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ సభలో దివంగత మోహన్ రాజుకు విజయపల్లవి సంగీత పురస్కారం ప్రకటించారు. ఆయన కుమారుడు కొండా మదనమోహనరాజు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీ వీసీ వెలుదండ నిత్యానందరావు హాజరై మాట్లాడారు. విజయపల్లి బోయి గాయనిగా మంచి పేరు సంపాదించుకున్నారని అన్నారు. విజయపల్లవి పేరిట పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ఆచార్య టి.గౌరీశంకర్, గురజాడ శోభాపేరిందేవి, కోయి కోటేశ్వరరావు, సుమిత్ర పంపన, హైమావతీ భీమన్న, సురేందర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి





నేతాజీనగర్ బస్తీలో రోడ్డుపై పారుతున్న మురుగు, ఇళ్ల మధ్యే చెత్తా చెదారం

రాజేంద్రనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవుపల్లి డివిజన్ శ్రీరాంనగర్, వెంకటేశ్వర కాలనీ, నేతాజీ నగర్ బస్తీల్లో కనీస సదుపాయాలు లేక ప్రజలు దయనీయ పరిస్థితుల్లో కాలం వెల్లదీస్తున్నారని బీఆర్ఎస్ మైలార్‌దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్ అన్నారు. శుభోదయం మైలార్‌దేవుపల్లి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయా బస్తీల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లపై మురుగునీటి ప్రవాహం, చెత్తాచెదారం, కంకర తేలిన రోడ్లు, వెలగని వీధి దీపాలు లాంటి సమస్యలతో ప్రజలు సహజీవనం చేస్తున్నారన్నారు. నడవడానికి వీలు లేని విధంగా రహదారులు తయారయ్యాయన్నారు. కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. మైలార్‌దేవుపల్లిలో ప్రజా ప్రతినిధులు గానీ, అధికారులు గానీ ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించకపోతే రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ, జలమండలి కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేముల రాము యాదవ్, యువత అధ్యక్షుడు అక్కెం రాఘవేందర్ యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, రాజేశ్ యాదవ్, ఎడ్లకాడి సూర్యం, మైసిరెడ్డి, జి.రాజు, జగదీశ్, వెంకటరమణ, చిరంజీవి, భూదేవి, అరుణరెడ్డి, సరిత, ఎగ్గె శ్రీకాంత్, అనిల్, మహేశ్, అశోక్ కుమార్, సందీప్ గుప్తా, సునీల్‌రాజు, క్రాంతి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ఎప్‌సెట్ ర్యాంకర్లకు జూలై 6న స్వర్ణ పతకాలు

బర్కత్‌పుర, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో వేర్వేరుగా నిర్వహించిన ఎప్‌సెట్-2025లో వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన వారిలో వంద మంది ఆర్యవైశ్య విద్యార్థులను ఎంపిక చేసి బంగారు పతకాలతో జూలై 6న సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్న ఆవోపా బ్యాంక్ మెన్ చాప్టర్ అధ్యక్షుడు పి.వి. రమణయ్య, ముఖ్య సలహాదారు కె.రామానందం తెలిపారు. లక్డీకాపూల్‌లోని వాసవీ సేవా కేంద్రంలో ఆదివారం ఉదయం 9గంటలకు ఈ సన్మాన కార్యక్రమం ఉంటుందని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ, తెలంగాణ ఎప్‌సెట్లతో పాటు నీట్, జేఈఈ(అడ్వాన్స్‌డ్) పరీక్షలు రాసి ర్యాంకులు సాధించిన వారిని సన్మానం చేస్తున్నట్టు వారు తెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులను ఈనెల 28వ తేదీలోపు పంపించాలని కోరారు. ఇతర వివరాలకు 9441928528, 9290529166 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న పుస్తకాల నర్సింగ్‌రావు తదితరులు

రాజేంద్రనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్‌లో అర్హులైన పేదలకి ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు అన్నారు. ఆదివారం బుద్వేల్‌లోని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యాలయం (ఏఆర్ దేవరాజ్ భవన్)లో అంబేడ్కర్ నగర్ శాఖ సీపీఐ 3వ మహాసభను నిర్వహించారు. రాజేంద్రనగర్ మండల సీపీఐ సహాయ కార్యదర్శి షేక్ షఫీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పుస్తకాల నర్సింగ్‌రావు మాట్లాడుతూ, వంద సంవత్సరాల నుంచి పేదల పక్షాన నిలబడి పోరాడుతున్న పార్టీ సీపీఐ అని గుర్తు చేశారు. సమావేశంలో సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి, జిల్లా సమితి సభ్యులు ఎండీ రియాజ్‌లు పాల్గొన్నారు.

నూతన కమిటీ

అంబేడ్కర్ నగర్ సీపీఐ కార్యదర్శిగా బండారి శాంతమ్మ నియమితులయ్యారు. సహాయ కార్యదర్శిగా బి.వనమ్మ, కమిటీ సభ్యులుగా సుశీల, యాదమ్మ, అండాలు, బాలమణి నియమితులయ్యారు. కార్యక్రమంలో పార్టీ కార్యాలయ కార్యదర్శి జి.సత్యం, క్రిష్ణ, లక్ష్మన్, చెన్నకేశవులు, రాములు పాల్గొన్నారు.

ఒకేవర్గం వారిపై కేసులు బాధాకరం : బీజేపీ



రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ, ఇతర సంఘాల నాయకులు

రాజేంద్రనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న లక్ష్మీగూడలో జంతు కళేబరాలతో ఉన్న డీసీఎంతో పాటు అత్తాపూర్ పాండురంగానగర్‌లో ఆటోలో ఆవులను వధించడానికి తీసుకెళ్తుండగా అడ్డుకున్న వారిపై అక్రమ కేసులు బనాయించారంటూ ఆదివారం రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ కార్యాలయం ఎదుట బీజేపీ అనుబంధ సంఘాలు నిరసన చేపట్టాయి. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, గోరక్షదళ్, ఆర్ఎస్ఎస్‌తో పాటు బీజేపీ నాయకులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. యువకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు. డీసీఎంలలో, ఆటోలలో ఆవులను, జంతు కళేబరాలను తరలిస్తున్న వారిపై సైతం కేసులు నమోదు చేయాలన్నారు. ఒకే వర్గంపై కేసులు నమోదు చేయడం బాధాకరణమన్నారు. రాజేంద్రనగర్ డీసీపీ అందుబాటులో లేకపోవడంతో ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు టి.అంజన్ కుమార్ గౌడ్, రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ పి.మల్లేశ్ యాదవ్, విశ్వహిందు పరిషత్ నాయకులు రమేశ్ బాబు, గోరక్ష ప్రముఖ్ విశాల్ ప్రసాద్, విశాల్ సునాకర్, భానుమూర్తి, దీపక్ యాదవ్, ముఖేశ్ యాదవ్, సేన రాహుల్, శ్రీరామ్ యాదవ్, డీజే శ్రీనివాస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ కోసం పోరాటం చేస్తాం



సమావేశంలో పాల్గొన్న సాధన సమితి సభ్యులు

నార్సింగ్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు ఉన్న రోడ్డును హైవేగా మార్చి విస్తరింపజేయాలని హైవే రోడ్డు సాధన సమితి డిమాండ్ చేసింది. గండిపేట మండలం హైదర్షాకోట్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు. ఈ రోడ్డు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి మొదలై చేవెళ్ల, పరిగి, వికారాబాద్ పరిధిల్లోకి వస్తుందని, ఈ రోడ్డు నిర్మిస్తామని 30ఏళ్లుగా ప్రభుత్వాలు హామీ ఇవ్వడం తప్ప ఎలాంటి పనిచేయడం లేదని, అక్కడ అనేక ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రతినిధి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తేగానీ రోడ్డు విస్తర్ణ జరిగే అవకాశం లేదని, అందుకే ప్రజలంతా ఏకం కావాలన్నారు. హైదరాబాద్ నగరం నుంచి తమ నియోజకవర్గాలకు వెళ్లాలంటే ఇదే ప్రధానమైదని, కొన్నేళ్ల క్రితం రోడ్డు పనులు ప్రారంభించి నిలిపివేశారని ఆయన వాపోయారు. ఈ రోడ్డు సాధన కోసం కార్యాచరణ ముందుకు తీసుకుపోవడానికి చేవెళ్ల, పరిగి, వికారాబాద్, కొండంగల్ నియోజకవర్గాల్లో కూడా కమిటీలు వేసి, అక్కడ కూడా సమావేశాలు ఏర్పాటు చేసి ఆ ప్రాంత ప్రజలను భాగస్వామ్యులను చేస్తామన్నారు. ఈ రోడ్డును నిర్మించకపోవడంవల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, వారికి జీవించే హక్కులేదా అని ఆయన ప్రశ్నించారు. రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు తమ పోరాటం ఆగదని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌రెడ్డితో పాటు అమరేందర్‌రెడ్డి, సీటీరెడ్డి, మనోహర్, గోపీనాథ్, భీమ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జగన్‌మోహన్, ప్రతాప్, రాహుల్‌తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

సెయిలింగ్‌లో హైదరాబాదీల హవా



పతకాలతో క్రీడాకారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ మాన్‌సూన్ సెయిలింగ్ పోటీల్లో హైదరాబాదీలు సత్తా చాటారు. ఆరు రోజులుగా హుస్సేన్‌సాగర్‌లో జరుగుతున్న ఈ పోటీలు ముగిశాయి. అండర్-15 బాలుర విభాగంలో రిజ్వాన్ మహమ్మద్ స్వర్ణం, అండర్-19 మిక్స్‌డ్ డబుల్స్‌లో తనూజ-శ్రావణ్ జోడీ పసిడి, అండర్-15 బాలికల విభాగంలో లాహిరి రజత పతకాలు సొంతం చేసుకున్నారు.

మురళీధర్‌రెడ్డికి మల్టీటాలెంటెడ్ అవార్డు



కె.మురళీధర్ రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

గోషామహల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమంలో బోయి భీమన్న అవార్డు గ్రహీత కె.మురళీధర్ సేవలు మరువలేనివని సరస్వతిదేవి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, కొండవీటి జయప్రసాద్ పేర్కొన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారధ పరిషత్ ఆడిటోరియంలో శ్రీ లహరి క్లాసికల్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మల్టీ టాలెంటెడ్ అవార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కె.మురళీధర్‌ను సన్మానించి అవార్డును అందజేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



అవార్డులను అందజేస్తున్న ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్‌వర్మ

చాంద్రాయణగుట్ట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నేటి యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్ వర్మ అన్నారు. శంషీర్‌గంజ్‌లోని శారద విద్యాలయ మైదానంలో కిడాన్ స్పోర్ట్స్ అకాడమీ రెండో వార్షికోత్సవ క్రికెట్ వేడుకల ముగింపు కార్యక్రమంలో కిడాన్ స్పోర్ట్స్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ ఏబీ ప్రకాశ్, ఎస్ఐ త్రిమూర్తులుతో కలిసి ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. గ్లాడియేటర్ టీం కెప్టెన్ తేజస్, వైస్ కెప్టెన్ వికాస్, రన్నరప్‌లుగా సి.లయన్స్ కాలే వికాస్‌వర్ధన్, వైస్ కెప్టెన్ కాలే వివేక్ వర్ధన్‌కు ట్రోఫీలను అందజేసి సత్కరించారు.

నల్లపోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా మహేశ్



చాంద్రాయణగుట్ట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గౌలిపురా సీబీ క్వార్టర్స్‌లోని నల్ల పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఆదర్ల మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఉపాధ్యక్షులుగా డొంకి యాదగిరి, కౌడి సురేందర్, ఎం.కుమార్, జీఎం జ్యోతికుమార్, జె.చిరంజీవి, పుప్పాల మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జీపీ సురేశ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా ఎ.దయానంద్, జి.బాబురావు, సి.చంద్రమోహన్ తదితరులు ఎన్నికయ్యారు.

మోదీ పాలనలో దేశాభివృద్ధి



లక్ష్మీగూడ మండల పరిషత్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పాలనలో గడిచిన 11 సంవత్సరాల్లో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ దళిత మోర్చా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ జోగి రవి అన్నారు. మైలార్‌దేవుపల్లి డివిజన్-2 అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం లక్ష్మీగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు అడికె రాజు, నాయకులు బొమ్మ రాజు నర్సింహ, రావుల భాస్కర్, నవారు మురళీధర్‌రెడ్డి, వల్లూరు శ్రీనివాస్, జి.శ్రావణ్ కుమార్, ఎం.ప్రభాకర్, అడికె మహేందర్, బల్ల శ్రీనివాస్ యాదవ్, గూడురు అంజి, శివ శంకర్, పవన్, అడికెఅభిలాష్, కొండల్, అంకిత్, శశికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బుద్వేల్ కిష్టమ్మ గుట్టలో..

బీజేపీ చేపట్టిన తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం కిష్టమ్మ గుట్ట క్రిష్ణుని దేవాలయం ఆవరణలో ఆ పార్టీ నాయకులు మొక్కలు నాటారు. బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పి.మల్లేశ్ యాదవ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానంద్, డి.సత్యనారాయణ ముదిరాజ్, హరికిషన్, రాఘవేంద్ర చారి, శత్రుఘ్న, బాలక్రిష్ణ, సురేందర్, వెంకటేశ్, ప్రకాశ్ నాయక్, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/l9B4dHoలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

21న శ్రీనివాస కల్యాణ మహోత్సవం



కవితకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

గోషామహల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం కార్వాన్‌లో ఈనెల 21న నిర్వహించే శ్రీనివాస కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పురానపూల్, కార్వాన్ ఆర్యవైశ్య సంఘం నాయకులు కలిసి ఆహ్వానించారు. సంఘం నాయకులు మాడిశెట్టి సదానందం గుప్తా, యాద శ్రీనివాస్ గుప్తా, కిశోర్ గుప్తా, జాలవాడి ధనుంజయ గుప్తా కవిత నివాసంలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

డాక్టర్ వేము వందనంకు విశిష్ట సేవా పురస్కారం



విశిష్ట సేవా కీర్తి పురస్కారం అందుకుంటున్న డాక్టర్ వేము వందనం

రాజేంద్రనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ భవానీ కాలనీకి చెందిన కవి, రచయిత డాక్టర్ వేము వందనం ఆదివారం విశిష్ట సేవా కీర్తి పురస్కారం-2025ను అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో నగరంలోని త్యాగరాయ గాన సభలో ఆయనకు ఈ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వై.ఎస్ శర్మ, ప్రధాన కార్యదర్శి సుప్రియ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పండుగ



బుద్వేల్‌లో బొడ్రాయికి పూజలు చేసిన స్థానిక పెద్దలు

రాజేంద్రనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్‌లో ఆదివారం బొడ్రాయి పండుగ 8వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్దలు, బుద్వేల్ సంక్షేమ సంఘం సభ్యులు, బొడ్రాయి కమిటీ కార్యవర్గ సభ్యులు పూజలు నిర్వహించారు. ఎనిమిది సంవత్సరాల క్రితం బొడ్రాయి పండుగ నిర్వహించిన అనంతరం బుద్వేల్ బస్తీ ఎంతో విస్తరించి అభివృద్ధి చెందిందన్నారు.



● గౌలిపురా కోట మైసమ్మ దేవాలయం వద్ద రూ.16లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మని కైలాష్ గంగపుత్ర

- చాంద్రాయణగుట్ట, జూన్ 15(ఆంధ్రజ్యోతి)

కుటుంబ కలహాలతో రౌడీషీటర్ ఆత్మహత్య

అఫ్జల్‌గంజ్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ రౌడీషీటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జియాగూడ నవోదయనగర్‌కు చెందిన అత్వాల్ ఉమేశ్(28), స్వేత అత్వాల్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. అత్వాల్ ఉమేశ్ 2011 నుంచి కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్. భార్య ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. కొన్ని రోజులుగా ప్రతి చిన్న విషయానికి భార్యాభర్త గొడవ పడుతుండేవారు. ఆదివారం ఇద్దరి మధ్య మరోసారి గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన అత్వాల్ ఉమేశ్ వేరే గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన భార్య పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదో అంతస్తు నుంచి పడి కార్మికుడి దుర్మరణం

బోరబండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఐదో అంతస్తులో పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడడంతో మృతిచెందాడు. ఈ సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కార్మికనగర్‌లో శనివారం జరిగింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా పర్లాకిమిడి ప్రాంతానికి చెందిన కైలాష్ ప్రధాన్(26) రహ్మత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో భార్య దీప ప్రధాన్‌తో కలిసి నివసిస్తున్నాడు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కార్మికనగర్‌లో పెయింటింగ్ కాంట్రాక్టర్ జంగయ్యకు చెందిన ఇంటి ఐదో అంతస్తులో పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పక్కభవనం రెండో అంతస్తుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని హుటాహుటిన సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు కాగా, ఈ దంపతులకు 10 రోజుల క్రితమే కుమారుడు జన్మించాడు. మృతుడి కుటుంబసభ్యులు బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు సరఫరాకు కొత్త ఎత్తులు

- ప్రజా రవాణా, ఆటోలు వినియోగిస్తున్న స్మగ్లర్స్
- రాచకొండ ప్రత్యేక పోలీసు బృందాలు నిఘా
- రెండు నెలల్లో రూ. కోట్ల విలువైన సరుకు స్వాధీనం



ఇటీవల పట్టుకున్న హాషిష్ ఆయిల్‌ను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు (ఫైల్)

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మత్తు దందాలో స్మగ్లర్స్ కొత్త ఎత్తులు వేస్తున్నారు. బస్సులు, ఆటోలు, ప్రైవేట్ ట్రావెల్స్, లారీలు, ఇతర రవాణా మార్గాలను వినియోగిస్తూ రాష్ట్రాలు దాటిస్తున్నారు. ఒడిశా, ఏపీలోని పలు ప్రాంతాల నుంచి గంజాయి, హాషిష్ ఆయిల్ వంటి మాదకద్రవ్యాలను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేయాలంటే రాచకొండ కమిషనరేట్‌లోని ప్రాంతాలగుండా వెళ్లాల్సిందే. మాదకద్రవ్యాల సరఫరా ముఠాలు నగరం దాటకూడదని రాచకొండ సీపీ సుధీర్‌బాబు ప్రత్యేక బృందాలతో శివారు ప్రాంతాల్లో నిఘా పెంచారు. గడిచిన రెండు నెలల వ్యవధిలో కోట్ల రూపాయల విలువైన హాషిష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు.

ఇటీవల పట్టుబడ్డ ముఠాలు

- ఇటీవల ఏపీ అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు పెద్ద ఎత్తున హాషిష్ ఆయిల్ (గంజాయి తైలం) సరఫరా చేస్తున్న ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. ఇద్దరు స్మగ్లర్స్‌ను అరెస్టు చేసి వారి వద్ద 20 కిలోల హాషిష్ ఆయిల్ (800 కిలోల గంజాయితో సమానం)స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 1.20 కోట్లు ఉంటుందని, బహిరంగ మార్కెట్లో రూ. 2 కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు.
- తనతో పాటు చదువుకున్న కొంతమంది యువకులు సులభంగా రూ. లక్షల్లో సంపాదిస్తున్నారని నర్సీపట్నానికి చెందిన యువకుడు డిగ్రీ పూర్తి చేసిన తర్వాత స్మగ్లర్‌గా మారాడు. డబ్బు కోసం హాషిష్ ఆయిల్ రవాణా చేయడం ప్రారంభించాడు. నెలరోజుల క్రితం రాచకొండ పోలీసులకు చిక్కి జైలుకెళ్లాడు. అతడి వద్ద నుంచి 4 కేజీల హాషిష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు.
- ఆర్టీసీ బస్సుల్లో గుట్టుగా హాషిష్ ఆయిల్ (గంజాయి నూనె) హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్న ఇద్దరు స్మగ్లర్స్‌ను రాచకొండ పోలీసులు గత నెలలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 10.2 కిలోల హాషిష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు.
- ఒడిశా బోర్డర్ నుంచి బెంగళూరుకు గుట్టుగా హాషిష్ ఆయిల్ స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు యువకులను నెలరోజుల క్రితం రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 13.5 కేజీల హాషిష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్లో దాని విలువ రూ. 1.35కోట్లు ఉంటుందన్నారు.

విశాఖ మన్యం ప్రాంతాల్లో తయారీ కేంద్రాలు

విశాఖలోని మన్యం ప్రాంతాలు.. ఆంధ్రా ఒడిశా బోర్డర్‌లో ఇబ్బడి ముబ్బడిగా హాషిష్ ఆయిల్ కేంద్రాలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. క్వింటాళ్లకొద్దీ గంజాయిని ఇతర ప్రాంతాలకు తరలించడం కష్టమని భావించిన సరఫరాదారులు కొత్త పంథా ఎంచుకున్నట్లు తెలిసింది. గంజాయి కన్నా.. పదిరెట్లు ఎక్కువ మత్తు ఇచ్చే హాషిష్ ఆయిల్‌ను వినియోగించాలని ఇతర రాష్ట్రాల పెడ్లర్స్‌కు సూచిస్తున్నారు. ఈ క్రమంలో గంజాయి స్థానంలో హాషిష్ ఆయిల్‌ను రవాణా చేస్తున్నారు. మూడు రోజుల క్రితం పట్టుకున్న 20 కిలోల హాషిష్ ఆయిల్ తయారు చేయడానికి 800 కిలోల గంజాయి మరపట్టించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆయిల్ తయారైన తర్వాత ఆర్డర్‌ను బట్టి పాలిథీన్ కవర్స్‌లో మూటగట్టి ఆయిల్ ప్యాకెట్స్‌ను బ్యాగుల్లో దుస్తుల మధ్యలో పెట్టి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు.

- ఆసిఫ్‌నగర్‌కు చెందిన ముగ్గురు మత్తుకు అలవాటుపడ్డారు. ఆ తర్వాత సీలేరు వెళ్లి హాషిష్ ఆయిల్ కొనుగోలు చేసి నగరానికి తీసుకొచ్చి విక్రయించు సొమ్ముచేసుకుంటున్నారు.పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి 500 గ్రాముల హాషిష్ ఆయిల్‌స్వాధీనం చేసుకున్నారు.


రక్తదాన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, వైద్యులు

ప్రతీ ఏడాది పదివేల యూనిట్ల రక్తం సేకరణ

- ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏడాది పదివేల యూనిట్ల రక్తం సేకరిస్తున్నామని ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉస్మానియా ఆస్పత్రిలోని బ్లడ్ సెంటర్ రాష్ట్రంలో అతి పెద్ద రక్తదాన కేంద్రాలలో ఒకటిగా నిలిచిందన్నారు. ప్రతీ ఏడాది సేకరిస్తున్న రక్తాన్ని ప్లాస్టిక్ సర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, నెఫ్రాలజీ వంటి కీలకమైన విభాగాలకు రోగులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. అత్యవసర సమయాల్లో, ఈ కేంద్రం ప్రభుత్వ ప్రసూతి, ఎంఎన్‌జే క్యాన్సర్, ఛాతీ ఆస్పత్రుల రోగులకు రక్తం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆస్పత్రి ఆధ్వర్యంలో గత ఏడాది సుమారు 40 శిబిరాలు, ఈ ఏడాది ఇప్పటి వరకు 27 శిబిరాలను నిర్వహించినట్లు చెప్పారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ డీఆర్‌డీఎల్ మెడికోస్ బ్లడ్ డోనర్ క్లబ్‌లతో కలిసి రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్‌ఎంవోలు జయకృష్ణ, అనూష, వైద్యులు శ్రీకాంత్, ప్రవళిక, జాహ్నవి పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న దాతలు

తలసీమియా బాధితుల కోసం రక్త దానం

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తలసీమియా బాధితులను ఆదుకోవడానికి ఎన్‌ఎఫ్‌సీ, సీఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం జీఎం గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్టు మోగా రక్తదాన కార్యక్రమం నిర్వహించింది. సుమారు వందమందికిపైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు షేక్ ఇర్ఫాన్, మాజెట్టి అచ్యుత్, సుష్మిత, లోహిత, రోష్ని, హీనా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు. తలసీమియా బాధితుల కోసం రక్తదానం చేయాలని సంస్థ సంయుక్త కార్యదర్శి అలీమ్‌బేగ్ కోరారు.

భర్త ఆత్మహత్యకు దారితీసిన దంపతుల మధ్య గొడవ

రాజేంద్రనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య గొడవ భర్త ఆత్మహత్యకు దారితీసింది. నెల్లూరుకు చెందిన కుమారస్వామి(26), మౌనిక(25)కు ఏడాది క్రితం వివాహం అయింది. బండ్లగూడ భవానీ కాలనీలో నివసిస్తున్నారు. కుమారస్వామి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. భర్త చేతికి ఉండాల్సిన బ్రాస్‌లెట్ కనిపించకపోవడంతో భార్య అతడిని ఏమైందని అడిగింది. ఈ విషయమై శనివారం సాయంత్రం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. విషయాన్ని వారి తల్లిదండ్రులకు చెప్పగా సర్దిచెప్పారు. రాత్రి 11 గంటల సమయంలో మరోసారి గొడవపడ్డారు. కోపోద్రిక్తుడైన కుమారస్వామి భార్యను కొట్టగా స్పృహతప్పి పడిపోయింది. ఆమె లేవకపోవడంతో చనిపోయిందని భావించిన కుమారస్వామి ఫ్యాన్‌కు నైలాన్ తాడుతో ఉరేసుకున్నాడు. గంట తర్వాత స్పృహలోకి వచ్చిన మౌనిక భర్త ఉన్న గది గడియపెట్టి ఉండడంతో తలుపులను కొట్టింది. తీయకపోవడంతో పక్కనున్న ఇంటి వారి సహాయంతో తలుపులు తీసి చూడగా కుమారస్వామి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చొరబాటుదారులపై ఏం చేద్దాం..!

(5వ పేజీ తరువాయి)

ధ్రువపత్రాలు పొందుతున్న క్రమంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కారు.

పట్టుబడిన బంగ్లాదేశ్ ముఠా

ఇటీవల చాదర్‌ఘాట్, ఖైరతాబాద్‌లలో గుట్టుగా ఇళ్లలో అనైతిక (వ్యభిచారం) కార్యకలాపాలు నిర్వహిస్తున్న బంగ్లాదేశ్ ముఠా సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడింది. విటులు, దళారులను కలిపి మొత్తం 18 మందిని అరెస్టు చేశారు.

ఉగ్రవాది మూలం నగరంలోనే..

ఇటీవల మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది రిజ్వాన్ అబ్దుల్‌ను ఢిల్లీలో ఎన్‌ఐఏ అధికారులు అరెస్టు చేసే వరకు అతడు హైదరాబాద్‌లో తలదాచుకున్నట్లు వెలుగుచూడలేదు. ఐసిస్ తరఫున పుణె నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తూ.. హైదరాబాద్ శంకేశ్వర్ బజార్‌లోని అపార్టుమెంట్‌లో సుమారు 10 నెలల పాటు తలదాచుకున్నట్లు గుర్తించారు. అప్పటికే రిజ్వాన్‌పై రూ.3లక్షల రివార్డు ఉంది. కానీ, అతడు హైదరాబాద్‌లో ఉన్నట్లు నిఘా సంస్థలు, స్థానికులూ గుర్తించలేకపోవడం గమనార్హం.

210 మంది పాకిస్థానీయులు

ఇటీవల భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నగర పోలీసులు ఉమ్మడి సౌత్‌జోన్ (సౌత్, సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్) పై దృష్టి పెట్టారు. పాకిస్థానీయులు సుమారు 210మంది ఉన్నట్లు గుర్తించారు. వారిలో కొంతమంది వెళ్లిపోగా.. మరికొంతమంది వివిధ కారణాలు, న్యాయపరమైన చిక్కులతో ఉండిపోయారు. అలాగే నగరంలో సుమారు 700 మంది వరకు నైజీరియన్స్ అక్రమంగా ఉండొచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు.

పాతుకుపోతున్న రోహింగ్యాలు..

నగరంలో అక్రమంగా ఉంటున్న విదేశీయుల్లో రోహింగ్యాలు ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మయన్మార్ నుంచి వివిధ మార్గాల ద్వారా వలస వచ్చిన రోహింగ్యాలు సిటీలో సుమారు 70వేల మంది ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. పదేళ్లలో రోహింగ్యాల జనాభా భారీగా పెరిగినట్లు తెలిసింది.



మాట్లాడుతున్న బాస్ అధ్యక్షుడు కేశ వీరన్న

బడ్జెట్ పాఠశాలల విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలి

పంజాగుట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద, గిరిజన, దళిత విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బాస్) మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కేశ వీరన్న, ప్రధాన కార్యదర్శి యాదగిరి మాట్లాడారు. బడ్జెట్ పాఠశాలలకు రెండేళ్ల నుంచి నిధులు మంజూరు చేయకపోవడంతో వాటి పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. సుమారు రూ. 200 కోట్ల నిధులు రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే విద్యాబోధన కుంటుపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఫీజు బకాయిలు చెల్లించాలని ముఖ్యమంత్రి, మంత్రులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి మారం లింగారెడ్డి, ఉపాధ్యక్షులు జయసింహగౌడ్, లక్ష్మీకాంత్ రెడ్డి, అభిలాష్, ఉపేందర్, డాక్టర్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఎం నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బషీర్‌బాగ్ నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లోని పోస్టు గ్రాడ్యుయేట్ కాలేజీ ఆఫ్ లా 5వ గేట్‌లో సోమవారం ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నామని మల్లేపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మేళా జరుగుతుందని, ఆసక్తి గల యువతీ, యువకులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మేళాలో అంతర్జాతీయ, జాతీయ సంస్థలు, మహారత్న, నవరత్న, మినీరత్న పీఎస్‌ఈలు(ప్రభుత్వ రంగ సంస్థలు), ప్రభుత్వ, ప్రభుత్వేతర, ప్రైవేట్ రంగ సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. ఆయా సంస్థలు ఉద్యోగ నియామకాలు, అప్రెంటిస్‌షిప్ అవసరాల కోసం మేళాకు హాజరవుతున్నాయన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ, పీఎంకేవీవై, ఇంటర్, ఇంటర్ ఒకేషనల్, డిప్లొమా, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులు, బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలని ఆమె సూచించారు.

స్నేహితుడి వివాహానికి హాజరై తిరిగి వెళ్తుండగా..

- ద్విచక్రవాహనం ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

హైదర్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి వివాహానికి హాజరై తిరిగి వెళ్తుండగా ద్విచక్రవాహనం ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందాడు. కేపీహెచ్‌బీ ఎస్‌ఐ రూప తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన శ్రీకాంత్(29)ఇటీవల కేపీహెచ్‌బీ కాలనీలో నివసించాడు. ప్రస్తుతం గోపన్‌పల్లిలో ఉంటూ టీసీఎస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి బీహెచ్‌ఈఎల్‌లో స్నేహితుడి వివాహానికి హాజరయ్యాడు. తన బ్యాగ్‌లు తీసుకెళ్లేందుకు కేపీహెచ్‌బీ కాలనీకి వచ్చాడు. పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డు దాటుతుండగా మియాపూర్ నుంచి వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం శ్రీకాంత్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్రమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి కిందపడిన హెచ్‌సీయూ విద్యార్థి

రాయదుర్గం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఓ విద్యార్థి భవనం పైనుంచి కిదపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. కౌశిక్ అనే విద్యార్థి హెచ్‌సీయూలో ఎంటెక్ చదువుతూ మెన్స్ హాస్టల్ బ్లాక్-ఏలో ఉంటున్నాడు. ఆదివారం తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో హాస్టల్ భవనంపై నుంచి కిందపడిపోయాడు.

తీవ్రంగా గాయపడిన కౌశిక్‌ను సెక్యూరిటీ సిబ్బంది, విద్యార్థులు సమీపంలో గల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నయనానందంగా నృత్యోత్సవం



నాట్యం చేస్తున్న కళాకారులు

రవీంద్రభారతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): లయబద్ధంగా సాగిన నాట్యాంశాలకు చక్కటి అడుగులు వేసిన కళాకారులు నయనానందాన్ని పంచారు. ఆదివారం రవీంద్రభారతిలో సద్గురు శ్రీశివానంద నృత్యమాల ఆధ్వర్యంలో నృత్యోత్సవం 2025 పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీలో శిక్షణ పొందిన కళాకారులు నాట్యంశాలను ప్రదర్శించారు. నాట్య గురువు బి.సుధీర్‌రావు నేతృత్వంలో నాట్యారూపాల్ని ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. చక్కటి ఆహార్యం, ఆకట్టుకునే హావభావాలతో భళా అనిపించారు. జయ జయ స్వామిన్, మమావతు, మనసా సంచాలరరే, సుందరం, నమా శివయాతే, తిల్లాన తదితర అంశాల్లో నర్తించారు. పలువురు ప్రముఖులు అతిథులుగా హాజరై కళాకారులను సత్కరించి అభినందించారు.

ఆర్టీఐ చట్టాన్ని సక్రమంగా వినియోగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాడభూషి శ్రీధర్

రాంనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీఐ చట్టాన్ని కాపాడుకుని సమాజానికి పనికివచ్చే సమాచారాన్ని రాబట్టాలని కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ సూచించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం, పీపుల్స్ ఫ్రంట్ ఫర్ రైట్ టూ ఇన్ఫర్మేషన్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఆర్టీఐ చట్టం అమలు తీరు - పొంచి ఉన్న ప్రమాదాలు అనే అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆర్టీఐ చట్టాన్ని సక్రమంగా వినియోగించాలన్నారు. ఆర్టీఐ నిపుణుడు శ్రీనివాస మాధవ్ మాట్లాడుతూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆర్టీఐ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆర్టీఐ చట్టం వినియోగం, సమాచారం ఇస్తున్న తీరు లోపభూయిష్టంగా ఉందన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పీపుల్స్ ఫ్రంట్ ఫర్ రైట్ ఇన్ఫర్మేషన్ ఆధ్వర్యంలో ఆర్టీఐ చట్టం అమలు జరుగుతున్న తీరును ఆలిండియా లాయర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి వివరించారు. హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య, పీఎఫ్‌ఆర్‌ఐ అధ్యక్షుడు యాదయ్య, ఎం.శ్రీనివాసరావు, ఆర్టీఐ యాక్టివిస్ట్ ఎం. శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు, సంగీత, రాజమౌళి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎల్‌డీ పటిష్ఠానికి కృషి చేయండి

నాయకులకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జయంత్ చౌదరి పిలుపు




పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జయంత్ చౌదరి, దిలీప్‌కుమార్, ఇందిర, మహిళా కార్యకర్తలతో జయంత్

పద్మారావునగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డీ)పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జయంత్ చౌదరి పిలుపునిచ్చారు. కవాడిగూడలోని అన్నం కాంప్లెక్స్‌లో ఆర్‌ఎల్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్, జాతీయ మహిళా అధ్యక్షురాలు కె. ఇందిర, టీఆర్‌ఎల్‌డీ వర్కింగ్ ప్రెసిడెంట్ కిన్నెర సిద్ధార్థతో కలిసి పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు.

అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయంత్ చౌదరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ప్రజలకు సామాజిక న్యాయం జరగలేదన్నారు. రాష్ట్రంలో విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. 2012-14 మధ్య జరిగిన తెలంగాణ ఉద్యమంలో టీఆర్‌ఎల్‌డీ కీలకపాత్ర పోషించిందని తెలిపారు. ఉద్యమంలో తాను పాల్గొన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో పార్టీ పటిష్ఠతకు, రైతులు, నిరుద్యోగుల సమస్యలు, సామాజిక న్యాయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఎల్‌డీ నాయకులు గిరి కుండె, విశాల్, వంజరి, మల్లేశ్‌గౌడ్, రుషబ్‌జైన్, ఓంకార్‌గౌడ్, మడకం ప్రసాద్, భాస్కరరావు, నరసింహారావు, సాయిరామ్, బీరప్ప, మహ్మద్ జానీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.


పిల్లల మరణాలను నిరసిస్తూ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్ లామకాన్‌లో 'హైదరాబాద్ ఫర్ ద చిల్డ్రన్ ఆఫ్ గాజా' ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పాలస్తీనాలో చిన్న పిల్లల మరణాలను నిరసిస్తూ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో దృశ్యాలు

'లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి'

పంజాగుట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్టీలలో అత్యధిక జనాభా కలిగిన లంబాడీ సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్ నాయక్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమైన బంజారాలను విస్మరించడం సరికాదని అన్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన నలుగురు ఎమ్మెల్యేలలో ఒకరికి మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని, నామినేటెడ్ పదవులలో కూడా సముచిత స్థానం కల్పించాలని అన్నారు. బంజారాలకు కేవలం డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చి కాంగ్రెస్ పార్టీ చేతులు దులుపుకోవడం సరికాదని, మంత్రి పదవి కూడా ఇవ్వాల్సిందేనని తెలంగాణ గిరిజన మేధావుల ఫోరం డిమాండ్ చేసింది. ఆదివారం లక్డీకాపూల్ సెంట్రల్ కోర్టు హోటల్‌లో జరిగిన మేధోమథన సదస్సులో ఫోరం అధ్యక్షుడు ధనుంజయ నాయక్ మాట్లాడుతూ.. ఎస్టీ కమిషన్ వేసి తండా డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలను కలవనున్నట్లు చెప్పారు.

ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లేటప్పుడు..

సాధారణంగా తొమ్మిది నెలలు నిండిన తరవాత ప్రసవం కోసం గర్భిణులు ఆసుపత్రిలో చేరుతూ ఉంటారు. ప్రసవం తరవాత కనీసం మూడు నుంచి అయిదు రోజులు అక్కడే ఉండాల్సి వస్తుంది. ఇలా ఆసుపత్రికి వెళ్లే ముందు కాబోయే తల్లులు తమ వెంట ఏమేం తీసుకువెళ్లాలో తెలుసుకుందాం...

- వైద్యులు సూచించిన ప్రకారం ప్రసవ తేదీ సమీపిస్తుందనగానే ఒక బ్యాగ్‌ను సిద్ధం చేసుకోవాలి. ఆ బ్యాగ్ పెద్దదిగా, తేలికగా పట్టుకోవడానికి వీలుగా ఉండాలి. తల్లీ బిడ్డలకు అవసరమయ్యే వస్తువులు, దుస్తులు తదితరాలను పొందికగా సర్దడానికి అనువుగా ఉండాలి.
- వైద్యుల సూచనలతో ఇప్పటి వరకు వాడిన మందుల చీటీలు, ఇతరత్రా చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్టులు, ఎక్స్‌రేలు, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యానికి సంబంధించి కీలక సమాచారాన్ని తెలిపే పత్రాలను ఒక ఫైల్‌లో ఉంచాలి. దీనితోపాటు ఆధార్ కార్డ్, ఇన్సూరెన్స్ కార్డ్‌లను అడిగిన వెంటనే తీసి చూపించేందుకు వీలుగా బ్యాగ్‌లో పెట్టాలి.



- ప్రసవం అయిన తరవాత ధరించేందుకు వదులుగా ఉండే నూలు దుస్తులు, పొడవాటి చున్నీలు, బాలింతల కోసం ప్రత్యేకించిన బట్టలు, తువాళ్లు, లోదుస్తులు, మెటర్నిటీ ప్యాడ్స్ సర్దుకోవాలి.
- బిడ్డకు పాలిచ్చేటప్పుడు ఒడిలో పెట్టుకోవడానికి మెత్తటి దిండును తీసుకెళ్లాలి.
- రోజువారీగా అవసరమయ్యే టూత్‌బ్రష్, పేస్ట్, సబ్బులు, షాంపూలు, దువ్వెన, లిప్ బామ్, మసాజ్ ఆయిల్ తదితరాలను ఒక బాక్స్‌లో పెట్టుకోవాలి.
- ప్రసవం తరవాత నడవమని వైద్యులు చెబుతుంటారు. మెత్తగా సౌకర్యవంతంగా ఉండే చెప్పుల జతను తీసుకెళ్లాలి. పాదాలను వెచ్చగా ఉంచే సాక్స్ కూడా పెట్టుకోవాలి.
- పుట్టిన బిడ్డకు డైపర్లు అవసరమవుతాయి. వీటితోపాటు పిల్లలకు మాత్రమే ప్రత్యేకించిన ర్యాష్ క్రీమ్‌ను కూడా బ్యాగ్‌లో పెట్టుకోవాలి. అలాగే బిడ్డ కోసం రెండు జతల దుస్తులు, తలకు క్యాప్, కాళ్లకు సాక్స్, చేతులకు మిటెన్స్, బేబీ వైప్స్ లేదా మెత్తని టవల్స్, బేబీ క్యారియర్ లేదా స్లీపింగ్ బ్యాగ్ తీసుకెళ్లాలి.
- ప్రసవం తరవాత ఆకలి ఎక్కువగా ఉంటుంది. తేలికగా జీర్ణమయ్యే చిరుతిళ్ల , డ్రై ఫ్రూట్స్ లాంటివాటిని బాక్స్‌లో పెట్టుకుని తీసుకెళ్లాలి.

పోలీస్ అంటే.. భయం కాదు.. ధైర్యం

ఖాకీ డ్రెస్ వేసుకోవాలి... పోలీస్ ఉద్యోగం చేయాలి... ఈ కల నెరవేర్చుకోవడానికి... అంది వచ్చిన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకున్నారు.

ఎందరు నిరుత్సాహపరిచినా, ఎగతాళి చేసినా లెక్క చెయ్యకుండా... పట్టుదలతో శ్రమించి తన లక్ష్యం నెరవేర్చుకున్నారు.

ఇప్పుడు ప్రజలతో మమేకమై వారి మన్ననలతో పాటు సీఎం నుంచి, ఉన్నతాధికారుల నుంచి అభినందలను అందుకుంటున్నారు.

పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే తన ఆశయమంటున్న హనుమకొండ జిల్లా వంగర ఎస్ఐ గొల్లపల్లి దివ్య 'నవ్య'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.



"మాది కరీంనగర్ జిల్లా కేశవపట్నానికి చెందిన వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్నలు సమ్మయ్య, దేవేంద్రలకు నేను, చెల్లి... ఇద్దరు పిల్లలం. "ఇద్దరూ అమ్మాయిలేనా? కొడుకులు లేరా?" అని ఇరుగుపొరుగువారు అనేవారు. "కూతుళ్లయినా, కొడుకులైనా వీళ్లే" అని అమ్మానాన్నా ధైర్యంగా చెప్పేవారు. మమ్మల్ని చదివించడానికి వాళ్లు ఎంత కష్టపడుతున్నారో ప్రత్యక్షంగా చూశాను.

ప్రతి పరీక్షలో టాప్-10లో ఉండాలనే లక్ష్యంతో చదివాను. పదో తరగతి పరీక్షల్లో మా స్కూల్ టాపర్‌గా నిలిచాను. స్టేట్ లెవల్ కూడా టాప్ 10లో ఉన్నాను. బాసర ఐఐఐటీలో నాకు మొదటి కౌన్సెలింగ్‌లోనే సీటు వచ్చింది. అక్కడ బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగ వేటలో పడ్డాను.

ఆ ఫొటో చూసి...

వీఆర్‌వో ఉద్యోగాలకు 2021-22లో నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేశాను. పరీక్ష రాశాను. మరోవైపు బ్యాంక్ పరీక్షల కోసం సిద్ధమవుతున్నాను. ఆ సమయంలో... కరెంట్ అఫైర్స్ కోసం వార్తా పత్రికలు చదువుతున్నప్పుడు... ఒక ఫొటో నన్ను ఆకర్షించింది. కరీంనగర్ ప్రాంతంలోనే... హేమలత అనే పోలీస్ ఇన్‌స్పెక్టర్ జీపు దగ్గర నిలబడి, ప్రజలతో ఏదో చర్చిస్తున్నట్టున్న ఫొటో అది. 'నేనెందుకు పోలీస్ కాకూడదు?' అనే ఆలోచన నాలో ఉద్భవించిన క్షణం అది. అప్పటి నుంచి పోలీస్ వృత్తి నా డ్రీమ్ జాబ్‌గా మారిపోయింది. నా ఉద్దేశాన్ని నాన్నకు చెప్పినప్పుడు... "ఎందుకమ్మా పోలీస్ నౌకరీ? ఇంజనీరింగ్ చేశావు కదా... ఏదైనా ఉద్యోగం దొరకదా?" అన్నారు. ఈ సంగతి తెలిసి మా ఊర్లో చాలామంది ఎగతాళి చేశారు. "ఆడపిల్లవు... నీకెందుకు పోలీస్ ఉద్యోగం? ఏదో ఒక చిన్నపాటి నౌకరీ చూసుకొని... మీ అమ్మానాన్నలకు ఆసరాగా ఉండొచ్చు కదా?" అని సలహా ఇచ్చారు.

ఆ భయం పోగొట్టడానికి...

పోలీసు వాహనాన్ని చూస్తేనే ప్రజలకు భయం. ఏదైనా సమాచారం అడిగినా... చెప్పడం లేదు. వారి ఇంటి పక్కన నేరస్థుడు ఉన్నా... చెప్పే పరిస్థితి లేదు. పోలీసు వాహనాల్లో వెళ్లడం వల్ల ప్రజలకు దగ్గర కాలేకపోతున్నామని గ్రహించాం. అందుకే సైకిళ్లు కొనుగోలు చేశాం. రోజూ ఉదయం సైకిళ్లపై గ్రామాలకు వెళ్తున్నాం. దాంతో ప్రజలు మమ్మల్ని ఆసక్తిగా చూడడంతో పాటు మాతో మాట్లాడడానికి ముందుకు వస్తున్నారు. ఊరి సమస్యలను వారితో చర్చిస్తున్నాం. ఊరికి ఎవరైనా కొత్తగా వచ్చినా, అనుమానాస్పదంగా కనిపించినా మాతో చెబుతున్నారు. మాదక



ద్రవ్యాలు వాడుతున్నవారి వివరాలు కూడా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో... యువత డ్రగ్స్‌కు బానిసలు కాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నాం. కాగా... వివిధ సమస్యలతో పాటు పిల్లలు పట్టించుకోవడం లేదని వృద్ధులు చేసే ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. మొత్తంగా మాకు వచ్చిన ఈ ఆలోచన ప్రజలకు ప్రయోజనకరంగా ఉండడం, నేరాలను అరికట్టేందుకు... ముఖ్యంగా ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ఉపయోగపడడం ఆనందంగా ఉంది.

దాంతో కాస్త నిరుత్సాహానికి గురయ్యాను. ఇంతలో ఎస్ఐ పోస్టులకు నోటిఫికేషన్ వచ్చింది. ఏదైతే అది అవుతుందని దరఖాస్తు చేశాను. "ఆ ఉరుకుడు, దునుకుడు నీ వల్ల అయితదా... నువ్వసలే కొంచెం లావుగా ఉన్నావు" అన్నారు నా స్నేహితుల్లో చాలామంది. ఎవరి మాటలూ పట్టించుకోలేదు. పట్టుదలగా ప్రిపేర్ అయ్యాను. ప్రిలిమినరీ పరీక్షతో పాటు ఫిజికల్ టెస్ట్‌లో కూడా విజయం సాధించాను.

నా కోరిక... వారి ప్రోత్సాహం

ఆ తరువాత... మెయిన్స్ పరీక్షకు సిద్ధమవుతూ ఉండగా.. వీఆర్‌వో పరీక్ష ఫలితాలు వచ్చాయి. రాజన్న-సిరిసిల్ల జిల్లాలో నాకు ఉద్యోగం వచ్చింది. అందులో చేరిపోవాలనీ, దీన్ని వదులుకున్నాక... ఎస్ఐ మెయిన్స్‌లో క్వాలిఫై కాకపోతే... రెండిటికీ చెడినట్టు అవుతుందనీ ఎందరో చెప్పారు. "అసలే మీది బీద కుటుంబం. ఆలోచించుకో" అన్నారు. అయితే... ఖాకీ డ్రెస్ ధరించాలన్న నా బలమైన కోరికకు... మా అమ్మానాన్నల ప్రోత్సాహం తోడై, నాలో ఉత్సాహాన్ని నింపింది. "మా గురించి ఆలోచించకు బిడ్డా... నీకు ఏది మంచిదనిపిస్తే అది చెయ్యి. కానీ ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకో" అని వారు చెప్పడంతో... ఎస్ఐ ఉద్యోగం వైపే ధైర్యంగా మొగ్గుచూపాను. మెయిన్ పరీక్షలో ఉత్తీర్ణురాలిని అయ్యాను. ఎస్ఐ శిక్షణ తరువాత... వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఉద్యోగం వచ్చింది. మొదట మడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు. తరువాత ఇటీవలే వంగరకు ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయ్యాను. వంగర... మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు గారి స్వగ్రామం. ఇక్కడి పోలీస్ స్టేషన్ పరిధిలో చాలా తక్కువ గ్రామాలు ఉన్నాయి. ఎక్కువగా కుటుంబ కలహాలు, భూ వివాదాల కేసులే వస్తూ ఉంటాయి. కాగా... ఈ మధ్య ఒక యువకుడు గంజాయి తాగుతూ దొరికిపోయాడు. హైదరాబాద్ నుంచి అతని స్నేహితుడు గంజాయి పంపినట్టు విచారణలో తేలింది. దీని గురించి మా పై అధికారులకు సమాచారం ఇచ్చాం. యువత బాధ్యతగా ఉండాలి. గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై, సైబర్ మోసాలకు పాల్పడి, తమ జీవితాలను నాశనం చేసుకోకూడదు.

> "ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో... 'వారెవ్వా... వంగర పోలీస్' అనే కథనం రావడం, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మా డీజీపీ అభినందనలు తెలపడం జీవితంలో మరచిపోలేను. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ధన్యవాదాలు. అదే స్ఫూర్తితో పేదలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తాను."

• తడుక రాజనారాయణ
ఫొటోలు: వీరగోని హరీష్



ఈ ఆశ్రయం... మెరుగైన ప్రపంచం కోసం

వైకల్యం ఉందని కుంగిపోలేదు. సవాళ్లు ఎదురైనా భయపడలేదు. నిర్దేశించుకున్న గమ్యాన్ని చేరుకోవడానికి ఎంతటి శ్రమనైనా లెక్క చేయలేదు. మూడేళ్లకే పోలియో బారిన పడిన డాక్టర్ ఐశ్వర్యారావు విధిని ఎదిరించి గెలిచారు. వైద్యురాలిగా సేవలందిస్తూనే... నిలువనీడలేని వికలాంగ మహిళలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఈ మధ్యే వారి కోసం ప్రత్యేకంగా ఒక జిమ్ కూడా ఏర్పాటు చేసి, పారా క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. చెన్నైకి చెందిన 52 ఏళ్ల ఐశ్వర్య స్ఫూర్తిమంతమైన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

"మాది విద్యావంతుల కుటుంబం. మా నాన్న ఐఏఎస్ అధికారి. నన్ను బాగా చదివించాలనేది ఆయన కోరిక. కానీ తొమ్మిదేళ్లు వచ్చేదాకా నేను బడికే వెళ్లలేదు. కారణం... నాకు మూడేళ్ల వయసులో పోలియో సోకింది. నా కండరాలన్నీ బలహీనమైపోయాయి. కాళ్లను స్వతంత్రంగా కదపలేకపోయేదాన్ని. నా తల్లిదండ్రులు ఎన్నో ఆసుపత్రులకు తిరిగారు, ఎందరో వైద్యులను కలిశారు. కానీ పెద్దగా ప్రయోజనం కలగలేదు. అలా ఆరేళ్లపాటు ఇంటికే పరిమితమైపోయాను. ఇంట్లోనే అమ్మ దగ్గర రాయడం, చదవడం నేర్చుకున్నాను. నన్ను బడికి పంపడానికి మొదట్లో సంకోచించినా... నా ఉత్సాహం చూసి నాన్న ఒప్పుకున్నారు. అదృష్టవశాత్తూ ఒక స్కూల్‌లో నన్ను చేర్చుకోవడానికి ప్రిన్సిపాల్ అంగీకరించారు. కొన్ని పరీక్షలు పెట్టి... మూడో తరగతిలో అడ్మిషన్ ఇచ్చారు. అప్పుడు నాకు తొమ్మిదేళ్లు.

కొత్త ప్రపంచంలో...

స్కూల్ అనేది అప్పటికి నాకు పూర్తిగా కొత్త ప్రపంచం. 'అక్కడ ఎలా నెగ్గుకొస్తానా?' అనే అనుమానాలతోనే తరగతి గదిలోకి అడుగుపెట్టాను. అయితే తోటి విద్యార్థులు స్నేహపూర్వకంగా ఆహ్వానించారు. దాంతో నాకున్న సంకోచాలన్నీ మాయమయ్యాయి. అందరిలాగే నేను కూడా ఏదైనా సాధించగలననే ఆత్మవిశ్వాసం కలిగింది. చదువులో ఒక్కొక్క మెట్టూ ఎక్కాను. ఇంటర్ తరువాత... నాకు ఆరు ఇంజనీరింగ్ కళాశాలల్లో, ఒక మెడికల్ వైద్య విశ్వవిద్యాలయంలో సీట్లు వచ్చాయి. తీవ్రంగా ఆలోచించిన తరువాత... వైద్య విద్యవైపే మొగ్గు చూపాను. 1996లో ఎంబీబీఎస్ పూర్తయ్యాక, శిశు వైద్యంలో డిప్లమా చేశాను. పేదలకు, వైకల్యాలు ఉన్నవారికి ఏదైనా చేయాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. అందుకే విద్య, ఆరోగ్య సంరక్షణ, అత్యవసర సేవలు తదితర అంశాల్లో ఆ సంస్థ సేవలు అందించే 'వరల్డ్ విజన్' అనే స్వచ్ఛంద సంస్థలో చేరాను. కొన్నేళ్ల తరువాత... హెచ్ఐవి చికిత్సలోనూ నైపుణ్యం సంపాదించాను. ప్రభుత్వం చేపట్టిన ఎయిడ్స్ నిరోధక కార్యక్రమాల్లో భాగస్వామిని అయ్యాను. మరోవైపు 'భారత వైద్య పరిశోధన మండలి' (ఐసీఎంఆర్)లో పరిశోధకురాలుగా పని చేశాను. కానీ వాటన్నిటినీ వదిలేయాల్సిన పరిస్థితి ఎదురయింది.

కన్నీళ్లు ఆగలేదు...

ఒక రోజు ఇంట్లో జారి పడిపోవడంతో నా తుంటి ఎముక విరిగిపోయింది. శస్త్రచికిత్స చేయించుకున్నాక... కొన్నాళ్లపాటు కదలకుండా మంచం మీదే ఉండాల్సి వచ్చింది. దాంతో నా ఉద్యోగాన్ని, ఇతర కార్యకలాపాల్ని వదిలేయాలని నిర్ణయించుకున్నాను. చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్తున్నప్పుడు... వైకల్యాలున్న మహిళలు ఎందరో కనిపించేవారు. వారి కష్టాలు, సామాజికంగా వారు ఎదుర్కొంటున్న వివక్షలు, అవమానాలు, ఎగతాళి వ్యాఖ్యల గురించి తెలుసుకున్నాక నాకు కన్నీళ్లు ఆగలేదు. కుటుంబ సభ్యులు పట్టించుకోని, నిలువనీడలేని మహిళల కోసం సురక్షితమైన ఒక ఆశ్రయాన్ని కల్పించాలనీ, వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి... గౌరవంతో జీవించే దారి చూపించాలనీ అనుకున్నాను. చెన్నైలోని నూగంబాక్కంలో 'బెటర్ వరల్డ్ షెల్టర్' పేరిట వైకల్యాలు ఉన్న మహిళల పునరావాస కేంద్రాన్ని ప్రారంభించాను. గతంలో ప్రభుత్వ సంస్థలతో పని చెయ్యడం వల్ల అధికారులతో నాకు ఉన్న పరిచయాలు ఉపయోగపడ్డాయి. చెన్నై కార్పొరేషన్, తమిళనాడు ప్రభుత్వం మా కేంద్రానికి నిధులు కేటాయించాయి. అయితే అవి చాలకపోవడంతో నా సొంత డబ్బు ఖర్చు పెట్టడం, నగలు తాకట్టు పెట్టడం తరచుగా జరుగుతూనే ఉంది. ప్రస్తుతం మా కేంద్రంలో దాదాపు 75 మంది ఆశ్రయం పొందుతున్నారు. వారికి విద్యతోపాటు కుట్టుపని, ఆభరణాల తయారీ, ఎంబ్రాయిడరీ, పారా క్రీడలు తదితర అంశాల్లో నిపుణుల ద్వారా శిక్షణ ఇస్తున్నాం.అలాగే ఉద్యోగాల కోసం, స్వయంఉపాధి కోసం, వివాహాల కోసం అవసరమైన సాయం అందిస్తున్నాం.


అన్నీ ఉచితంగానే...

కొన్నేళ్లుగా పారా క్రీడలకు ఆదరణ పెరగడం, వాటిలో పాల్గొనాలనే ఆసక్తి చాలామందిలో ఉండడం గమనించాను. మా కేంద్రంలో ఉంటూ జాతీయ స్థాయిలో పతకాలు సాధించినవారు కూడా ఎంతోమంది ఉన్నారు. అయితే వారు అభ్యాసం చెయ్యడానికి తగిన సౌకర్యాలు సాధారణ వ్యాయామశాలల్లో ఉండవు. అంతే కాదు, దానికి అయ్యే ఖర్చు ఎక్కువ. సామాజికమైన ఇబ్బందులూ ఉంటూనే ఉంటాయి. ఈ విషయంపై రాష్ట్ర క్రీడామంత్రికి ఒక లేఖ రాశాను. దానికి సానుకూలమైన స్పందన లభించడంతో... ఈ ఏడాది మార్చిలో... ప్రభుత్వ సాయంతో ఒక జిమ్‌ను ఏర్పాటు చేశాను. దీనికోసం మా 'బెటర్ వరల్డ్ షెల్టర్'ను కొత్త భవనంలోకి మార్చాం. అత్యాధునికమైన, వైకల్యాలు ఉన్నవారికి అనువైన సదుపాయాలన్నీ ఇక్కడ ఉన్నాయి. పలువురు మా కేంద్రంలోనే ఆశ్రయం పొందుతూ సాధన చేస్తున్నారు. వారికి అన్నీ ఉచితంగానే సమకూరుస్తున్నాం. ఈ పారా-అథ్లెట్లలో 38 ఏళ్ల నదియా ఒకరు. ఆమె ఇప్పటికే దాదాపు నలభై వరకూ జాతీయ, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లలో పాల్గొని పతకాలు గెలుచుకున్నారు. అలాగే 41 ఏళ్ల ఏళ్ల మేరీ, 38 ఏళ్ల బెనీతా, 50 ఏళ్ల మెటిల్డా... వీరందరూ వీల్‌ఛైర్ బాస్కెట్‌బాల్ ప్లేయర్లు. జిమ్‌కు వచ్చే యువతుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. మా కేంద్రానికి సమీపంలో ఉన్నవారు తమ ఇళ్ల నుంచి వచ్చి శిక్షణ పొందుతున్నారు. ఇప్పటివరకూ కొన్ని వందలమంది మహిళలకు మా కేంద్రం అండగా నిలిచింది. పట్టుదల, దృఢ సంకల్పం ఉంటే ఏ వైకల్యమూ ఆపలేదు. ఎన్ని సవాళ్లు వచ్చినా ఎదిరించి... జీవితంలో నిలదొక్కుకోవాలనుకొనేవారికి చేయూతనివ్వడం నాకు సంతోషాన్నీ, సంతృప్తినీ కలిగిస్తోంది. 'మెరుగైన ప్రపంచానికి దోహదం చేసే ఆశ్రయం'గా మా కేంద్రం గుర్తుండిపోవాలన్నదే నా ఆశయం."



పిగ్మెంటేషన్ తగ్గిద్దామిలా

చాలా మంది మహిళలను ఇబ్బంది పెట్టే సమస్య పిగ్మెంటేషన్ (మంగు మచ్చలు). ఈ మచ్చలను ఇంట్లోనే ఎలా తగ్గించుకోవచ్చో తెలుసుకుందాం..



- ఒక టేబుల్ స్పూన్ తేనెలో ఒక టేబుల్ స్పూన్ కలబంద గుజ్జును కలిపి మచ్చల మీద రాసి అరగంట సేపు తరువాత కలిగేయాలి.
- పుదీనా ఆకులను రుబ్బి ఆ పేస్టును మచ్చల మీద రాయాలి. పావుగంట తరువాత కడిగేయాలి.
- రెండు టేబుల్ స్పూన్ల ఓట్ మీల్, టేబుల్ స్పూన్ పెరుగు, కొంచెం టమాటా రసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మంగు మచ్చలపై రాసి ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి.
- నారింజ తొక్కను ఎండబెట్టి పొడి చేసుకుని అందులో కొన్ని పాలు పోసి పేస్ట్‌లా చేసుకోవాలి. దీనిని మచ్చలపై రాయాలి. ఆరిన తరువాత చల్లటి నీళ్లతో కడిగేసుకోవాలి.
- బంగాళదుంపల రసాన్ని మచ్చల మీద రాసి అర గంట తరువాత కడిగేసుకోవాలి.
- పసుపులో పాలు పోసి పేస్ట్‌లా కలుపుకోవాలి. దీనిని మచ్చల మీద రాసి 20 నిమిషాల తరువాత కడిగేసుకోవాలి.
- వాడిన గ్రీన్ టీ బ్యాగులతో మచ్చల మీద రుద్దాలి. రోజుకు రెండుసార్లు ఇలా చేస్తే మచ్చలు తగ్గుతాయి.
- యాపిల్ సైడర్ వెనిగర్, నీళ్లు సమపాళ్లలో తీసుకుని కలిపి ఆ మిశ్రమాన్ని దూదితో మచ్చల మీద అద్దాలి. 5 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. రోజూ రెండుసార్లు ఇలా చేయాలి.
- రాత్రి పడుకునే ముందు కలబంద గుజ్జును రాసుకుని, ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. రోజూ ఇలా చేయడం వలన మంచి ఫలితం ఉంటుంది.

బీట్‌రూట్ ప్రయోజనాలెన్నో!

విటమిన్లు, ప్రొటీన్లు పుష్కలంగా ఉండే బీట్‌రూట్ తినడానికి చాలామంది ఇష్టపడరు. కానీ దీనిని రోజూ తినడం వలన బోలెడు ప్రయోజనాలు ఉన్నాయి. ఆ వివరాలివి..

- బీట్‌రూట్‌లో సహజ నైట్రేట్‌లు పుష్కలంగా ఉంటాయి. అవి రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి.
- ఇందులోని విటమిన్ బి, సిలు రక్తపోటును నియంత్రించి, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- బీట్‌రూట్ శరీరంలోని విష పదార్థాలను తొలగిస్తుంది. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.
- బీట్‌రూట్‌లో ఐరన్ ఉంటుంది. ఇది రక్తహీనతను తగ్గిస్తుంది. పీచు పదార్థాలు జీర్ణవ్యవస్థను పనితీరును మెరుగుపరుస్తాయి.
- బీట్‌రూట్‌తో ఆరోగ్యమే కాదు అందమూ సొంతమవుతుంది. దీనిలోని విటమిన్లు చర్మాన్ని నిగారింపుకు సహాయపడతాయి. మొటిమలు మచ్చలను యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, విటమిన్ సి తగ్గిస్తాయి.



- కాబట్టి అప్పుడప్పుడు బీట్‌రూట్ రసాన్ని ముఖానికి రాసుకోవాలి.

దిక్సూచి



ఇండస్ట్రీ డిమాండ్లతోపాటు, కొత్త కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి మన దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలు ముందు ఉంటున్నాయి. అందులో భాగంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఇంటర్ డిసిప్లినరీ, కొత్త ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను ప్రారంభిస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఐఐటీలు, ఎన్ఐటీలు ప్రారంభించిన కొత్త బ్రాంచ్‌లు ఏమిటో చూద్దాం.

ఇంజనీరింగ్‌లో కొత్త బ్రాంచ్‌లు

ఐఐటీల్లో

1. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అండ్ డేటా సైన్స్
ఏఐ అండ్ డేటా సైన్స్, డేటా సైన్స్ అండ్ ఏఐ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఏఐ ఇలా రకరకాల పేర్లతో లేదా కాంబినేషన్లతో హైదరాబాద్, గౌహతి, ఢిల్లీ, జోద్‌పూర్, పాట్నా ఐఐటీలు ఈ బ్రాంచీలను అందిస్తున్నాయి.
ఉద్యోగ అవకాశాలు: ఏఐఎంఎల్ ఇంజనీర్, డేటా సైంటిస్ట్, బిజినెస్ అనలిస్ట్, ఎన్ఎల్‌పీ ఇంజనీర్, కంప్యూటర్ విజన్ ఇంజనీర్‌గా పనిచేయవచ్చు.
ఏయే కంపెనీల్లో అవకాశాలు: గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి టెక్ దిగ్గజాలతోపాటు, స్టార్టప్‌లు, ఫైనాన్స్(క్వాంటమ్ రోల్స్), హెల్త్ కేర్(ఏఐ డయాగ్నస్టిక్స్), ఈ కామర్స్ తదితరాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: మన దేశంలో ఐఐటీలు, ఎన్ఐటీల వంటి సంస్థల్లో చదివిన వారికి 12 నుంచి 30 లక్షలు. విదేశాల్లో అయితే 20 నుంచి 50 లక్షల వరకు ఉండొచ్చు.
భవిష్యత్తు: ఆటోమేషన్, రోబోటిక్స్ తదితరాల్లో ఏఐ కీలకంగా మారుతుంది. అలాగే జనరేటివ్ ఏఐ అంటే చాట్ జీపీటీ తరహా మోడల్స్ కారణంగా వీరికి డిమాండ్ చాలా ఎక్కువగా ఉంటుంది.

2. రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ మెకట్రానిక్స్
అలహాబాద్(ప్రయాగ్‌రాజ్), హైదరాబాద్, జోద్‌పూర్ ఐఐటీలు ఈ బ్రాంచ్‌ను అందిస్తున్నాయి.
అవకాశాలు: రోబోటిక్స్ ఇంజనీర్, ఆటోమేషన్ స్పెషలిస్ట్, కంట్రోల్ సిస్టమ్ ఇంజనీర్, డిఫెన్స్ అండ్ స్పేస్‌లో ఆర్ అండ్ డీలుగా పని చేయవచ్చు.
ఏయే కంపెనీలు: టెస్లా, ఫాక్స్‌కాన్ వంటి మాన్యుఫాక్చరింగ్, ఇస్రో, స్పేస్ ఎక్స్ వంటి అంతరిక్ష సంస్థలు, డీఆర్‌డీఓ వంటి రక్షణ సంస్థలు, సీమెన్స్, బోష్ వంటి ఇండస్ట్రియల్ ఆటోమేషన్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: మన దేశంలో 8 నుంచి 20 లక్షలు. యూఎస్, జర్మనీ, జపాన్ వంటి విదేశాల్లోని రోబోటిక్స్ హబ్స్‌లో అయితే 20 నుంచి 60 లక్షలు.
భవిష్యత్తు: ఇండస్ట్రీ 4.0, స్మార్ట్ ఫ్యాక్టరీలు, అటానమస్ వెహికిల్స్ వంటివి వీరికి డిమాండ్‌ను తెస్తాయి.

3. రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్ వెహికిల్(ఈవీ) ఇంజనీరింగ్
ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పేరుతో బాంబే ఐఐటీ, ఎనర్జీ ఇంజనీరింగ్ పేరుతో ఢిల్లీ ఐఐటీ, సస్టయినబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్ పేరుతో మద్రాస్ ఐఐటీ ఈ బ్రాంచ్‌లను అందిస్తున్నాయి.
అవకాశాలు: ఈవీ డిజైన్ ఇంజనీర్, సోలార్ విండ్ ఎనర్జీ కన్సల్టెంట్స్, బ్యాటరీ టెక్నాలజిస్ట్, సస్టయినబుల్ అనలిస్ట్ తదితర ఉద్యోగాలు ఉంటాయి.
ఏయే కంపెనీలు: టెస్లా, టాటా మోటార్స్ ఓలా ఎలక్ట్రిక్, అదానీ గ్రీన్, సీమెన్స్ గమేసా, ప్రభుత్వ విద్యుత్ ప్రాజెక్టులు తదితరాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: మన దేశంలో 6 నుంచి 18 లక్షలు. విదేశాల్లో ఇంకా చాలా ఎక్కువగా ఉంటుంది.
భవిష్యత్తు: 2030 సంవత్సరం వరకు 500 గిగా వాట్ పునరుత్పాదక ఇంధనాలను తయారు చేయాలని భారత దేశం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే ఈవీ బూమ్ కూడా వీరికి పెద్ద ఎత్తున అవకాశాలను కల్పించనుంది.

4. మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (నానో టెక్నాలజీ, ఇతర స్మార్ట్ మెటీరియల్స్ కేంద్రంగా)
ఈ బ్రాంచ్‌ను కాన్పూర్, మద్రాస్, బాంబే ఐఐటీలు అందిస్తున్నాయి.

5. క్వాంటమ్ టెక్నాలజీ
క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీఎస్సీ డిగ్రీని మద్రాస్ ఐఐటీ అందిస్తుండగా, క్వాంటమ్ టెక్నాలజీస్‌పై ఐఐటీ జోద్‌పూర్‌లో బ్రాంచ్ ఉంది.
అవకాశాలు: క్వాంటమ్ ఆల్గోరిథమ్ డెవలపర్, క్వాంటమ్ హార్డ్‌వేర్ ఇంజనీర్, క్రిప్టోగ్రఫీ రీసెర్చర్ వంటి ఉద్యోగాలు చేయవచ్చు.
ఏయే కంపెనీలు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వంటి పరిశోధనశాలలు, ఐబీఎమ్, గూగుల్ క్వాంటమ్ ఏఐ వంటి పెద్ద టెక్ సంస్థలు, క్వాంటమ్ ఎన్‌క్రిప్షన్ వంటి రక్షణ సంస్థల్లో పనిచేయవచ్చు.
జీతభత్యాలు: భారతదేశంలో రీసెర్చ్ స్టార్టప్స్‌లో 15 నుంచి 30 లక్షలు. విదేశాల్లో సుమారు లక్షన్నర డాలర్లు.
భవిష్యత్తు: ఈ రంగాలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. కంప్యూటింగ్, క్రిప్టోగ్రఫి, మెటీరియల్‌సైన్స్‌లు వేగంగా ఎదిగే అవకాశం ఉంది.

6. బయో ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్
ఈ బ్రాంచ్‌లను ఢిల్లీ, బాంబే, కాన్పూర్, హైదరాబాద్‌ల్లోని ఐఐటీలు అందిస్తున్నాయి.
అవకాశాలు: మెడికల్ డివైజ్ డిజైనర్, బయో మెకానిక్స్ ఇంజనీర్, హెల్త్‌కేర్ ఏఐ స్పెషలిస్ట్
ఏయే కంపెనీలు: బయోకాన్- డాక్టర్ రెడ్డీస్ వంటి ఫార్మా కంపెనీలు, సీమెన్స్ హీల్ థిన్నర్స్ వంటి మెడ్‌టెక్ కంపెనీలు, ఎయిమ్స్, ఐసీఎంఆర్ వంటి పరిశోధన సంస్థల్లో అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: భారతదేశంలో 6 నుంచి 15 లక్షలు. విదేశీ మెడికల్ హబ్స్‌లో ఇంకా ఎక్కువగా ఉంటుంది.
భవిష్యత్తు: పెరుగుతున్న జనాభా, ఏఐ ఆధారిత హెల్త్‌కేర్ ఉత్పత్తుల కారణంగా వీరికి మంచి డిమాండ్ ఉంటుంది.


6. కంప్యూటేషనల్ ఇంజనీరింగ్(ఏఐ + మెకానిక్స్ డిజైన్)
ఈ బ్రాంచ్ హైదరాబాద్, గాంధీనగర్ ఐఐటీల్లో ఉంది.

7. ఎలక్ట్రిక్ వెహికిల్స్(ఈవీ) అండ్ మొబిలిటీ ఇంజనీరింగ్
మద్రాస్ ఐఐటీలో మొబిలిటీ ఇంజనీరింగ్, ఢిల్లీ ఐఐటీలో ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ ఉంది

8. సైబర్ సెక్యూరిటీ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ
కాన్పూర్ ఐఐటీలో సైబర్ సెక్యూరిటీ, జోద్‌పూర్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ బ్రాంచ్‌లు ఉన్నాయి.
అవకాశాలు: ఎథికల్ హ్యాకర్, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్, థ్రెట్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్, బ్లాక్‌చైన్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ తదితరాలు పనిచేయవచ్చు.
ఏయే కంపెనీలు: టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీలు, సెర్ట్ ఇన్ వంటి రక్షణ సంస్థలు, పేటీఎమ్-రాజోర్ పే వంటి ఫిన్‌టెక్ కంపెనీలు, పాలో ఆల్టో - క్రౌడ్ స్ట్రైక్ వంటి గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ సంస్థల్లో పనిచేయవచ్చు.
జీతభత్యాలు: భారతదేశంలో 10 నుంచి 25 లక్షలు. విదేశాల్లో సుమారు లక్ష డాలర్లు.
భవిష్యత్తు: భవిష్యత్తు సైబర్ యుద్ధాలు జరిగే కాలం, 5జీ క్లౌడ్ సెక్యూరిటీ అవసరాలు వీరి డిమాండ్‌ను బాగా పెంచుతాయి.

9. కాగ్నెటివ్ సైన్స్(హ్యూమన్-కంప్యూటర్ ఇంటరాక్షన్, ఏఐ+సైకాలజీ)
గాంధీ నగర్, కాన్పూర్ ఐఐటీలో కాగ్నెటివ్ సైన్స్‌లో డ్యూయల్ డిగ్రీ కోర్సు ఉంది.
అవకాశాలు: యూఎక్స్‌యూఐ డిజైనర్, ఏఐ ఎథీస్ట్, న్యూరోసైన్స్ ఇంజనీర్(బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్) తదితరాలుగా పనిచేయవచ్చు.
ఏయే కంపెనీలు: టెక్ కంపెనీలైన మైక్రోసాఫ్ట్ రీసర్చ్, మెటా, హెల్త్‌కేర్‌లో న్యూరో స్టార్టప్స్‌లో అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: యూఎక్స్ రోల్స్‌లో అయితే 10 నుంచి 25 లక్షలు. పరిశోధనలవైపు వెళితే ఇంకా ఎక్కువ ఉంటుంది.
భవిష్యత్తు: ఏఐ ఎథిక్స్, మెటావర్స్ ఏఆర్‌వీఆర్‌లో కాగ్నిటీవ్ సైన్స్ నిపుణుల అవసరం ఉంటుంది.

ఇంకొన్ని..



ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), సైబర్ ఫిజికల్ సిస్టమ్స్
అవకాశాలు: ఐఓటీ సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్, ఎంబెడెడ్ సిస్టమ్ ఇంజనీర్, స్మార్ట్ సిటీ కన్సల్టెంట్‌గా పనిచేయవచ్చు.
ఏయే కంపెనీలు: జియో, ఎయిర్‌టెల్ వంటి టెలికామ్ కంపెనీల్లో, ఎల్అండ్ టీ, సీమెన్స్ వంటి స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఐఓటీ ఆధారిత ఫార్మింగ్ అగ్రిటెక్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: భారతదేశంలో 8 నుంచి 20 లక్షలు. గ్లోబల్ ఐటీ మార్కెట్ డిమాండ్ బాగా ఉంది.
భవిష్యత్తు: 5జీ బాగా పెరుగుతోంది. ఐఓటీ ఆధారంగా స్మార్ట్‌సిటీలు తయారవుతున్నాయి.

మెటీరియల్స్ సైన్స్ (స్మార్ట్ మెటీరియల్స్ నానో టెక్)
అవకాశాలు: నానోటెక్ రీసెర్చర్, కాంపోజిట్ మెటీరియల్స్ ఇంజనీర్, సెమీ కండక్టర్ మెటీరియల్స్ స్పెషలిస్ట్ తదితరాలుగా పనిచేయవచ్చు.
ఏయే కంపెనీలు: ఇంటెల్, టీఎస్ఎమ్‌సీ వంటి సెమీ కండక్టర్ కంపెనీల్లో, ఇస్రో, బోయింగ్ వంటి స్పేస్ సంస్థల్లో, ఈవీ బ్యాటరీ, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో విభాగాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: భారతదేశంలో 7 నుంచి 18 లక్షలు. విదేశీ పరిశోధక సంస్థల్లో చాలా ఎక్కుగా ఉంటుంది.
భవిష్యత్తు: చిప్స్, ఈవీలు, స్పేస్ టెక్నాలజీ బాగా పెరుగుతుండడంతో డిమాండ్‌కు తిరుగులేదు.

'కీ' ట్రెండ్స్

- ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ అనేవి ఇప్పుడున్న పాపులర్ ట్రెండ్స్
- పునరుత్పాదన ఇంధనాలు, ఈవీలపై అందరి దృష్టి ఉంది.
- క్వాంటమ్ టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ అనేవి అత్యంత డిమాండ్ ఉన్న రంగాలు.
- ఇప్పుడు సంప్రదాయ కోర్సులను ఇంటర్ డిసిప్లినరీ కోర్సులు రిప్లేస్ చేస్తున్నారు. ఉదాహరణకు కంప్యూటర్ + ఏ రంగం అయితే ఆ రంగానికి సంబంధించిన కోర్సు దీనికి చేరుతోంది.
- ఐఐటీలు, ఎన్ఐటీలు ప్రవేశపెట్టిన ఈ కోర్సులకు ఉద్యోగ అవకాశాలు అత్యంత ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే టెక్నలాజికల్ అడ్వాన్స్‌మెంట్స్, ఇండస్ట్రీ అవసరాలతోపాటు, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, నేషనల్ ఏఐ స్ట్రాటజీ మొదలైన ప్రభుత్వ చొరవలకు అనుగుణంగా డిజైన్ చేసిన కోర్సులు ఇవి.

ఎన్ఐటీల్లో

- **ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్:** వరంగల్, తిరుచ్చి, సూరత్‌కల్, కాలికట్, పాట్నాల్లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఇంజనీరింగ్:** కురుక్షేత్ర, నాగపూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **బయోటెక్నాలజీ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్:** రూర్కేలా, దుర్గాపూర్, వరంగల్‌లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.



- **మానుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్ ఇండస్ట్రియల్ అండ్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్:** తిరుచ్చి, జంషెడ్‌పూర్‌లోని ఎన్ఐటీల్లో ఈ కోర్సు ఉంది.
- **మెకట్రానిక్స్ ఇంజనీరింగ్:** కాలికట్, పాట్నా ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **పెట్రోలియం ఇంజనీరింగ్, ఎనర్జీ ఇంజనీరింగ్:** కాలికట్, సూరత్‌కల్‌లోని ఎన్ఐటీల్లో ఉంది.
- **స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్:** తిరుచ్చి ఎన్ఐటీలో సివిల్ విత్ స్మార్ట్ టెక్నాలజీ కోర్సు ఉంది.
- **సైబర్, ఫిజికల్ సిస్టమ్స్(ఏఐ+ఐఓటీ=రోబోటిక్స్):** ఆంధ్రప్రదేశ్, మణిపూర్‌లోని ఎన్ఐటీల్లో ఉంది.

ఇంజనీరింగ్ ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రామ్స్ (బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ, బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్స్)

- క్వాంటమ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌తో ఇంజనీరింగ్ ఫిజిక్స్. ఇది బొంబే, మద్రాస్ ఐఐటీల్లో ఉంది.
- మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్. అన్ని ఐఐటీలు, పేరున్న ఎన్ఐటీల్లో ఈ కోర్సు ఉంది.
- ఎకనామిక్స్ అండ్ డేటా సైన్స్. కాన్పూర్, ఖరగ్‌పూర్ ఐఐటీల్లో ఉంది.
- ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ సస్టయిన్‌బిలిటీ. బాంబే ఐఐటీలో, తిరుచ్చి ఎన్ఐటీలో ఈ కోర్సు ఉంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

అఖండ 2 కొత్త షెడ్యూల్



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. 2021లో విడుదలై ఘనవిజయం సాధించిన 'అఖండ'కు ఇది సీక్వెల్. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ సినిమా కీలక షెడ్యూల్‌ను నేటి నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభించనున్నట్లు తెలిపారు మేకర్స్. బాలకృష్ణతో సహా ప్రధాన పాత్రధారులందరూ పాల్గొననున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. బాలకృష్ణ కుమార్తె తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయిక. ఆది పినిశెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

అవార్డు వచ్చినవాళ్లు స్వయంగా వచ్చి స్వీకరించాలి

● సినీ ప్రముఖులకు దిల్‌రాజు సూచన



'ప్రభుత్వం నుంచి అవార్డ్స్ వస్తున్నాయంటే చాలా జాగ్రత్తగా పురస్కారాలను స్వీకరించాలి. ఇది ఇండస్ట్రీలోని అందరికీ చెబుతున్నాను. భవిష్యత్‌లో ప్రభుత్వ పురస్కారాల ప్రకటన వచ్చినప్పుడు ఆ తేదీని డైరీలో నోట్ చేసుకొని... అవార్డు వచ్చినవాళ్లు స్వయంగా వచ్చి స్వీకరించాలి. నా విజ్ఞప్తిని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను' అని నిర్మాత, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) ఛైర్మన్ దిల్ రాజు అన్నారు. శనివారం నిర్వహించిన తెలంగాణ గద్దర్ అవార్డుల వేడుక విజయవంతమైన సందర్భంగా ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ 'షూటింగ్స్ ఉన్నా పక్కనపెట్టి పురస్కార గ్రహీతలు స్వయంగా అవార్డ్ ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరవ్వాలి. అది మన బాధ్యత. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సినీ పురస్కారాలను ఇవ్వబోతోంది. అందరికీ చెబుతున్నా... గుర్తు పెట్టుకోండి. ప్రభుత్వంతో సామరస్యపూర్వకంగా ముందుకెళ్లాల్సిన బాధ్యత ఇండస్ట్రీలోని ప్రతి ఒక్కరిపైన ఉంది' అని చెప్పారు. 'గద్దర్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించి విజయవంతం చేశాం. ఆరునెలల నుంచి పడిన కష్టం ఫలించినందుకు చాలా ఆనందంగా ఉంది. సినీ పరిశ్రమలోని వారంతా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన తీరు బావుందంటూ చాలామంది ప్రశంసిస్తున్నారు. సీఎం గారు గంట సమయం ఇస్తానన్నారు. కానీ నా కోరిక మేరకు ఆయన రెండు గంటలకుపైగా ఉండడం ఉత్సాహాన్నిచ్చింది. ఇంత పెద్ద వేడుకలో ఏవైనా పొరపాట్లు జరిగి ఎవరి మనసైనా నొప్పించి ఉంటే వాళ్లకు టీజీఎఫ్‌డీసీ తరఫున క్షమాపణలు చెబుతున్నాను' అని దిల్‌రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ పాల్గొన్నారు.



'కుబేర' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా

ఎస్.ఎస్.రాజమౌళి

"శేఖర్ కమ్ముల పైకి చూడ్డానికి చాలా సాఫ్ట్‌గా ఉంటారు. ఆయన్ని చూస్తూనే మనకి అలా అనిపిస్తుంది. కానీ ఆయన నమ్మిన సిద్ధాంతాల కోసం ఎంత దూరమైనా వెళ్లే మొండి పట్టుదల కలవారు. ఆయన నమ్మే సిద్ధాంతాలనే సినిమాలుగా తీస్తారు. ఆయనలోని ఈ గుణాన్ని నేను ఎంతో గౌరవిస్తాను. ఆయన ముందు ముందు కూడా ఇలానే మనకు మరిన్ని మంచి సినిమాలు అందించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమౌళి మాట్లాడుతూ "ట్రాన్స్ ఆఫ్ కుబేర' టీజర్ చూసి ఆశ్చర్యపోయాను. మేకింగ్ అద్భుతంగా ఉంది. తొలి రోజే సినిమాను చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు. నాగార్జున మాట్లాడుతూ "ధనుష్ మీ సినిమాలు చేశాను. సెట్స్‌లో మీరు పాత్రలోకి ఎలా పరకాయ ప్రవేశం చేస్తారో చూశాను. మీతో కలసి పనిచేయడం గొప్ప జ్ఞాపకం. ఇది కంప్లీట్‌గా శేఖర్ కమ్ముల సినిమా. ఈ చిత్రానికి ఆయనే హీరో" అని చెప్పారు. ధనుష్ మాట్లాడుతూ "ఇది 'సార్' తర్వాత నా రెండో తెలుగు చిత్రం. నిజానికి 'సార్' కంటే ముందే శేఖర్ కమ్ముల ఈ కథ చెప్పారు. మీ ముందుకు రావడానికి ఇంత టైమ్ పట్టింది. ఆయనో అద్భుత వ్యక్తి. చిన్నప్పటి నుంచి నాగార్జున సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయనతో కలసి నటించడం మరిచిపోలేని అనుభవం. ఇది రెండు భిన్న ప్రపంచాల మధ్య జరిగే కథ" అని పేర్కొన్నారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "రాజమౌళి ఈ కార్యక్రమానికి రావడంతో 'కుబేర' చాలా పెద్ద సినిమా అయ్యింది. దర్శకుడిగా అప్పుడే 25 ఏళ్లు అయ్యాయా అనిపిస్తోంది. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. నిజాయితీగా తీసిన సినిమా ఇది. చాలా కొత్తగా ఉంటుంది. ట్రూ పాన్ ఇండియా చిత్రమిది. అందరికీ కనెక్ట్ అవుతుంది" అని తెలిపారు. నిర్మాత సునీల్ నారంగ్ మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇప్పుడేం మాట్లాడను. సినిమా విడుదలయ్యాక సక్సెస్ మీట్‌లో మాట్లాడుతా" అని అన్నారు. నిర్మాత పుస్కుర్ రామ్‌మోహన్ రావు మాట్లాడుతూ "ఇదో విభిన్న చిత్రం. నాగార్జున,ధనుష్ నటన ఈ సినిమాకే హైలెట్‌గా ఉండబోతోంది" అని అన్నారు.

'కన్నప్ప' చిత్రంపై ఆ శివుడి అనుగ్రహం ఉండాలి



మంచు విష్ణు కథానాయకుడిగా ముఖేష్‌కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'కన్నప్ప'. డా.మోహన్‌బాబు నిర్మించారు. ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, మోహన్‌బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా కేరళలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో మోహన్‌లాల్ మాట్లాడుతూ "ఇప్పుడంతా పాన్ ఇండియా ట్రెండ్ నడుస్తోంది. 'కన్నప్ప' చిత్రం అద్భుతంగా వచ్చింది. ఆ శివుడి అనుగ్రహం ఈ సినిమాపై ఉండాలని కోరుకుంటున్నాను. ఈ చిత్రంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది" అని అన్నారు. మోహన్‌బాబు మాట్లాడుతూ "మోహన్‌లాల్ గొప్ప నటుడు. సినిమా కోసం ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా పారితోషికంగా తీసుకోలేదు. ఆయన చూపించిన ప్రేమకు రుణపడి ఉంటాను. ఆయనతో కలసి నటించాలనుంది" అని చెప్పారు. మంచు విష్ణు మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇక నేను చెప్పాల్సిన పని లేదు. మీరు అల్రెడీ ట్రైలర్ చూశారు. సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని అన్నారు.

స్వచ్ఛమైన ప్రేమకథ



'మను' ఫేమ్ ఫణీంద్ర నార్సెట్టి తెరకెక్కించిన చిత్రం '8 వసంతాలు'. 'మ్యాడ్' ఫేమ్ అనంతిక సునీల్‌కుమార్ కీలక పాత్రలో నటించారు. రవితేజ దుగ్గిరాల, హనురెడ్డి కీలక పాత్రలు పోషించారు. నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ప్రేమంటే ఒక దశ మాత్రమే.. దిశ కాదు', 'మగాడి ప్రేమకు సాక్ష్యాలుగా పాలరాతి సౌధాలు, భాగ్యనగరాలు ఉన్నాయి.. ఆడదాని ప్రేమకు ఏమున్నాయి? మనసులోనే సమాధి చేసుకున్న జ్ఞాపకాలు తప్ప' వంటి సంభాషణలు సినిమాపై మరింత అంచనాలను పెంచాయి. ప్రధాన పాత్రధారుల నటన, అద్భుతమైన విజువల్స్, సంగీతం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఇది మహిళా ప్రాధాన్యం ఉన్న కథ అయినా, ఇందులోని పాత్రలన్నీ కీలకమే. ప్రతీ పాత్రలో చాలా లేయర్స్ ఉంటాయి. ఇదో స్వచ్ఛమైన ప్రేమ కథ. నిజజీవితాన్ని తెరపై చూస్తున్న అనుభూతి కలుగుతుంది. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని పంచుతుంది" అని తెలిపారు.



భూ అంటే భూతం

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తమ్ముడు'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. లయ వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలకపాత్రలు పోషిస్తున్నారు. జులై 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'భూ అంటే భూతం' అంటే సాగే గీతాన్ని ఈ మంగళవారం విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్

సినిమాకే హైలెట్‌గా

రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు.పి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. కన్నడ హీరో ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ సూర్యకుమార్ అనే శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలో కీలకమైన టాకీ పార్ట్‌ను హైదరాబాద్‌లో షూట్ చేస్తున్నారు. రామ్, ఉపేంద్ర మధ్య తెరకెక్కుతోన్న ఈ కీలక సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా ఉంటాయని మేకర్స్ తెలిపారు. ఇందులో రామ్ పాత్ర చాలా విభిన్నంగా ఉండబోతోందని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని, సంగీతం: వివేక్- మెర్విన్.



అదే నా కర్తవ్యం



జట్టును సమష్టిగా ఉంచుతా
టీమిండియా కెప్టెన్ గిల్

లండన్: జట్టులో ఆనందకరమైన, ఏ మాత్రం అభద్రతకు తావులేని వాతావరణాన్ని నెలకొల్పుతానని టీమిండియా కొత్త సారథి శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. అతడి ఆధ్వర్యంలో తొలిసారిగా ఇంగ్లండ్ పర్యటనకు వచ్చిన భారత జట్టు ఈనెల 20 నుంచి ఐదు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. ఈ సందర్భంగా ఓ క్రీడా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గిల్ పలు అంశాలపై మాట్లాడాడు. 'జట్టుకు విజయాలు, ట్రోఫీలు అందించడమే కాకుండా ఆటగాళ్లంతా సౌకర్యవంతంగా, సంతోషంగా ఉండే సంస్కృతిని నెలకొల్పుతా. అలా అయితేనే ఒత్తిడికి లోనుకాకుండా ఆటగాడిలో నైపుణ్యం బయటపడుతుంది. నాయకుడిగా నా కర్తవ్యం కూడా అదేనని భావిస్తా. ఆరంభంలో ఇది కష్టమే కావచ్చు. కానీ ప్రయత్నిస్తే సాధ్యం కానిది లేదు. ఇక మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ గురించి మాట్లాడుతూ... అతను మైదానంలో దూకుడుగా కనిపించకపోవచ్చు. కానీ అతని వ్యూహరచన మాత్రం దూకుడుగానే ఉంటుంది. ఆటగాళ్ల నుంచి తానేం ఆశిస్తున్నాడో సిరీస్‌కు ముందే స్పష్టంగా చెప్పేవాడు. డ్రెస్సింగ్‌రూమ్‌లోనూ చక్కటి వాతావరణాన్ని నెలకొల్పాడు. మైదానంలో అతడి చేత చీవాట్లు తిన్నా దాన్ని ఎవరూ వ్యక్తిగతంగా తీసుకునేవారు కాదు. జట్టు విజయం కోసమే అలా చేస్తున్నాడని అంతా భావించేవారు' అని గిల్ తెలిపాడు. కాగా కోచ్ గౌతమ్ గంభీర్‌లో అంకితభావం ఎక్కువని, ఆటగాళ్లతో చాలా స్పష్టంగా ఉంటాడని అన్నాడు. ఇక స్టార్ పేసర్ బుమ్రాపై అధిక భారం పడకూడదని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్టు గిల్ తెలిపాడు. సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లను తను ఆడే అవకాశం లేదని ఇప్పటికే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సైతం తెలిపాడు. 'ప్రతీ మ్యాచ్ తర్వాత అతడిపై పడే పని ఒత్తిడి భారాన్ని పరిశీలిస్తాం. అంతేకానీ ముందే ఫలానా మ్యాచ్ ఆడతాడనే నిర్ణయాన్ని తీసుకోలేం' అని గిల్ తేల్చాడు. మరోవైపు ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌ను ఎదుర్కొనేందుకు తాము ఎలాంటి ప్రణాళికలను రచించలేదని చెప్పాడు. 'నేను ఎలా ఉండాలనుకుంటున్నానో ముందస్తుగా ఆలోచించడం ఇష్టముండదు. దూకుడుగా ఆడితే అంతే వేగంగా వికెట్లు కోల్పోయే అవకాశం కూడా ఉంటుంది' అని కెప్టెన్ గిల్ తెలిపాడు.



గంభీర్ బాధ్యతలు లక్ష్మణ్‌కు!

బెకెన్‌హామ్ (కెంట్): ఇంగ్లండ్‌తో తొలి టెస్టుకు భారత జట్టు సన్నాహకం ఊపందుకుంది. ఈనెల 20 నుంచి జరిగే మొదటి టెస్టుకు.. నాలుగు రోజుల ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌ను భారత్ ఆడుతున్న సంగతి తెలిసిందే. మ్యాచ్ ఆదివారం, మూడోరోజు కూడా జోరుగా సాగింది. మొదటి టెస్టుకు ఆల్‌రౌండర్ స్థానానికి తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్‌తో పోటీపడుతున్న శార్దూల్ ఠాకూర్ మూడో రోజు ఆటలో శతకం బాదాడు. మొదటి రోజు బౌలింగ్‌లో ఆకట్టుకున్న శార్దూల్..బ్యాట్‌తోనూ సత్తా నిరూపించుకోవడం విశేషం. 2023లో చివరి టెస్ట్ ఆడిన ఠాకూర్ రెండోరోజు 19 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఆ ఇన్నింగ్స్‌ను కొనసాగించి అజేయ సెంచరీ(122 నాటౌట్)తో మెరిశాడు. తద్వారా తొలి టెస్టుకు తుది జట్టు రేస్‌లో బలంగా నిలిచాడు. కాగా..శనివారం ఆటలో భారత్ 'ఎ' బ్యాటర్ సర్ఫరాజ్ శతకంతో చెలరేగాడు. ఇక..చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు తల్లి అనారోగ్యం కారణంగా స్వదేశం వెళ్లిన గంభీర్ తిరిగొచ్చేవరకు వీవీఎస్ లక్ష్మణ్ తాత్కాలిక కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నట్టు తెలిసింది.

కెప్టెన్సీ సమయంలో జుత్తు ఊడిపోయింది

లంక ఆల్‌రౌండర్ మాథ్యూస్



గాలె: శ్రీలంక ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మంగళవారం నుంచి బంగ్లాదేశ్‌తో గాలెలో జరిగే టెస్టు అతడి కెరీర్‌లో చివరిది. 25 ఏళ్లకే సారథిగా బాధ్యతలు చేపట్టిన మాథ్యూస్ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నాడు. అయితే, సారథ్యం చేపట్టిన తర్వాత తన జుత్తు ఎంతో ఊడిపోయిందన్నాడు. 'జట్టు పగ్గాలు అందుకొన్న తర్వాత జుత్తు బాగా రాలిపోయింది. ప్రతి కెప్టెన్ పరిస్థితి ఇంతే. దేశానికి ప్రాతినిథ్యం వహించడం వేరు.. సారథ్యం వహించడం వేరు. ప్రతీసారి అదనపు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. దృష్టంతా మనమీదే ఉంటుంది. మనం ఏం మాట్లాడతామో వినాలనుకొంటారు. కొన్నిసార్లు ఇబ్బందిగా అనిపించినా.. ఎంతో ఆస్వాదించా. విమర్శలను తట్టుకోలేక సారథ్యం వదిలేయాలని అనుకొనే వాడిని. కానీ, జట్టును మరోస్థాయికి తీసుకెళ్లడానికి అవకాశం వచ్చిందని నాకు నేను నచ్చజెప్పుకొనే వాడిన'ని మాథ్యూస్ తెలిపాడు.

మూడో టీ20లో ఐర్లాండ్‌పై విండీస్ విజయం

బ్రీడీ: ఐర్లాండ్‌తో జరిగిన మూడో టీ20లో వెస్టిండీస్ 62 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో సిరీస్‌ను కూడా 1-0తో గెలుచుకుంది. తొలి రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 256 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు ఎవిన్ లెవిస్ (91), హోప్ (51) తొలి వికెట్‌కు 122 పరుగులు జత చేశారు. చివర్లో కీసీ కార్టీ (49 నాటౌట్), షెఫర్డ్ (19 నాటౌట్) చెలరేగారు. మాథ్యూ రెండు వికెట్లు తీశాడు. ఆ తర్వాత ఛేదనలో ఐర్లాండ్ 20 ఓవర్లలో 194/7 స్కోరుకే పరిమితమై ఓటమి పాలైంది. రాస్ ఎడెయిర్ (48), టెక్టర్ (38), మార్ ఎడెయిర్ (31 నాటౌట్) మాత్రమే రాణించారు. హోసేన్‌కు మూడు, హోల్డర్‌కు రెండు వికెట్లు దక్కాయి.



జాతీయ జట్టు కంటే ఐపీఎల్ ముఖ్యమా?

ఆసీస్ బౌలర్లపై జాన్సన్ ఆగ్రహం

మెల్‌బోర్న్: ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి చవిచూసిన ఆస్ట్రేలియాపై స్వదేశంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆసీస్ మాజీ పేసర్, కామెంటేటర్ మిచెల్ జాన్సన్ జట్టు బౌలింగ్ విభాగంపై నిప్పులు చెరిగాడు. పేసర్లు మిచెల్ స్టార్క్, కెప్టెన్ పాట్ కమిన్స్, హాజెల్‌వుడ్, స్పిన్నర్ నాథన్ లియాన్‌కు భవిష్యత్‌లో జట్టులో చోటు కల్పించకూడదని తేల్చేశాడు. పైగా..తమ బౌలర్లంతా జాతీయ జట్టుకు కాకుండా ఐపీఎల్‌కు ప్రాధాన్యమివ్వడాన్ని జాన్సన్ ఆక్షేపించాడు. ముఖ్యంగా డబ్ల్యూటీసీ ఫైనల్లో కేవలం రెండు వికెట్లే తీసిన పేసర్ హాజెల్‌వుడ్‌ను తప్పుపట్టాడు. భారత్-పాకిస్థాన్ యుద్ధం కారణంగా కొద్దిరోజులు వాయిదాపడి పునఃప్రారంభమైన ఐపీఎల్‌లో పాల్గొనేందుకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఆటగాడు హాజెల్‌వుడ్ గాయాన్ని లెక్క చేయకుండా స్వదేశం నుంచి మళ్లీ భారత్ వెళ్లిన సంగతి తెలిసిందే. 'స్టార్క్, కమిన్స్, హాజెల్‌వుడ్, లియాన్‌తో కూడిన మా 'బిగ్ ఫోర్' బౌలింగ్ విభాగం వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లో విఫలం కావడాన్ని తేలిగ్గా తీసుకోకూడదు. వారికి భవిష్యత్‌లో జట్టులో చోటు గ్యారెంటీ కాకూడదు. జట్టులో యువ రక్తాన్ని నింపడంపై సెలెక్టర్లు దృష్టి సారించాలి' అని మిచెల్ జాన్సన్ సూచించాడు.

ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-4కు జ్యోతి, చికిత, ధీరజ్

పుణె: ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-4కు తెలుగు ప్లేయర్లు జ్యోతి సురేఖ, చికిత, ధీరజ్ బొమ్మదేవర ఎంపిక కాగా.. ఒలింపియన్ అతాను దాస్, సీనియర్ ప్లేయర్ అభిషేక్ వర్మకు సెలెక్షన్ ట్రయల్స్‌లో షాక్ తగిలింది. మహిళల రికర్వ్ టీమ్‌లో వెటరన్ దీపికా కుమారి, అంకిత భక్త్‌తోపాటు మహారాష్ట్రకు చెందిన 15 ఏళ్ల టీనేజర్లు గథా ఖడాకే, శార్వరి షిండే అర్హత సాధించారు. వరల్డ్‌కప్ స్టేజ్-4 మాడ్రిడ్‌లో వచ్చే నెల 8 నుంచి 13 వరకు జరగనుంది. మహిళల కాంపౌండ్ ఆర్చరీ టీమ్‌లో జ్యోతి సురేఖ టాప్‌లో నిలవగా.. పర్నీత్ కౌర్, ప్రీతిక ప్రదీప్, చికిత తర్వాతి స్థానాలు దక్కించుకొన్నారు. ట్రయల్స్‌లో టాప్-3లో నిలిచిన వారు మాత్రమే సెప్టెంబరులో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొనేందుకు అర్హులు.

నాన్నకు ప్రేమతో..

కోహ్లీకి వామిక క్యూట్ సర్‌ప్రైజ్



న్యూఢిల్లీ: ఫాదర్స్ డేను పురస్కరించుకొని కోహ్లీకి అతడి కుమార్తె వామిక ముద్దుముద్దుగా శుభాకాంక్షలు చెప్పింది. చేతితో రాసిన నోట్‌పై వామిక సంతకం చేయగా.. ఆ నోట్ ఫొటోను అనుష్క ఇన్‌స్టాలో పంచుకొంది. తన తండ్రి కల్నల్ అజయ్ కుమార్‌కు విషెస్ తెలిపిన అనుష్క.. వామిక నోట్‌ను కూడా షేర్ చేసి ఆశ్చర్యపర్చింది. 'అతడు నా సోదరుడులా ఉంటాడు. ఎంతో సరదాగా ఉంటాడు. నాకు గిలిగింతలు పెడతాడు. మేకప్ చేసే ఆటలు ఆడుకుంటాం. నన్ను ఎంతో ప్రేమిస్తాడు.. నేను కూడా అదే విధంగా ప్రేమిస్తా' అని ఆ నోట్‌లో ఉంది.

ఆ జట్టులో విషపు వ్యక్తులున్నారు!

ఢిల్లీపై డివిలీర్స్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలీర్స్.. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తరఫున అద్భుత ప్రదర్శన కనబరిచాడు. 2008 నుంచి 2010 వరకు మూడేళ్లపాటు ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున ఆడిన డివిలీర్స్ ఆ తర్వాత బెంగళూరుకు మారాడు. అయితే, బెంగళూరు జట్టు తరఫున రాణించిన తరహాలో ఢిల్లీకి ఆడలేకపోయాడు. అందుకు గల కారణాన్ని అతడు ఇప్పుడు బయటపెట్టాడు. తాను ఆడే రోజుల్లో 'ఢిల్లీలో విషపు మనస్తత్వం గల వారున్నార'ని చెప్పాడు. కానీ, వారి పేర్లను మాత్రం బయటపెట్టలేదు. 'వారి పేర్లు పలకడం కూడా ఇష్టంలేదు. ఎప్పుడూ రగిలిపోతూ.. విషాన్ని చిమ్ముతుండేవారు. అయితే, మెక్‌గ్రాత్, వెటోరి లాంటి వారితో ఆడడం తీపి జ్ఞాపకమ'ని డివిలీర్స్ చెప్పాడు.

అర్జున్ బృందానికి నిరాశ

వరల్డ్ బ్లిట్జ్ టీమ్ చెస్ విజేత డబ్ల్యూఆర్



లండన్: ఫిడే వరల్డ్ ర్యాపిడ్ టీమ్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న ఉత్సాహంలో.. బ్లిట్జ్ టైటిల్‌నూ సొంతం చేసుకోవాలనుకున్న భారత గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి సారథ్యంలోని ఎంజీడీ1 జట్టుకు నిరాశే ఎదురైంది. అర్జున్, హరికృష్ణ, ప్రణవ్, ల్యూక్ మెన్‌డోన్కా, స్టవ్రౌలా సొలాకిడో, అథర్వ టయాడేతో కూడిన ఈ బృందానికి నాకౌట్‌లో చుక్కెదురైంది. అర్జున్ జట్టును హెక్సామైండ్ జట్టు ఓడించి సెమీఫైనల్ చేరింది. ఇక, విశ్వనాథన్ ఆనంద్ సారథ్యంలోని ఫ్రీడమ్ జట్టుకూ నిరాశ తప్పలేదు. నాకౌట్‌లో ఫ్రీడమ్ టీమ్‌పై కజ్ చెస్ జట్టు గెలిచింది. ఇతర నాకౌట్ మ్యాచుల్లో అష్దోద్ ఎలీట్ క్లబ్‌పై ఉజ్బెకిస్థాన్, జర్మనీ అండ్ ఫ్రెండ్స్‌పై డబ్ల్యూఆర్ చెస్ గెలిచాయి. సెమీఫైనల్స్‌లో హెక్సామైండ్‌ను డబ్ల్యూఆర్ చెస్ జట్టు, ఉజ్బెకిస్థాన్‌ను కజ్ చెస్ జట్టు కంగుతినిపించాయి. అనంతరం జరిగిన తుదిపోరులో కజ్ జట్టుపై గెలిచి డబ్ల్యూఆర్ బ్లిట్జ్ చాంపియన్‌గా నిలిచింది. డబ్ల్యూఆర్ జట్టు బ్లిట్జ్ టైటిల్‌ను కైవసం చేసుకోవడం వరుసగా ఇది రెండోసారి కావడం విశేషం.



మాపై స్లెడ్జింగ్‌కు దిగారు

సఫారీ సారథి బవుమా

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో తమను మానసికంగా దెబ్బతీసేందుకు ఆస్ట్రేలియా జట్టు స్లెడ్జింగ్‌కు దిగిందని దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమా ఆరోపించాడు. నాలుగో రోజు ఆటలో సఫారీలు తమ విజయానికి 69 పరుగుల దూరంలో ఉండగా.. తొలి సెషన్‌లో ఆసీస్ మాటల యుద్ధానికి దిగిందట. 'మేం బ్యాటింగ్ చేసే సమయంలో చోకర్స్ అనే మాట కూడా వినాల్సి వచ్చింది. ఓ ప్లేయర్ అయితే 60 పరుగుల్లోపే మిగిలిన 8 వికెట్లు కూడా కోల్పోతారంటూ ఎద్దేవా చేశాడు. మార్‌క్రమ్ మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని పట్టించుకోవద్దని చెప్పాడు' అని బవుమా తెలిపాడు.

హాకీలో అదే వరస..

ప్రొ. లీగ్‌లో పురుషులు, మహిళల జట్ల ఓటమి

లండన్/ఆంట్వెర్ప్: ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో భారత హాకీ జట్లకు మళ్లీ ఓటమి ఎదురైంది. పురుషుల జట్టు వరుసగా ఆరో పరాజయాన్ని చవిచూడగా.. మహిళల బృందం వరుసగా రెండో మ్యాచ్‌లో ఓటమిపాలైంది. లండన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత మహిళలు 1-2తో ఆస్ట్రేలియా ధాటికి తలొంచారు. యూరోపియన్ లెగ్‌లో భాగంగా ఆదివారం బెల్జియంలోని ఆంట్వెర్ప్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 2-3తో ఆస్ట్రేలియా చేతిలో చిత్తయింది. భారత్ ఇప్పటికే నెదర్లాండ్స్, అర్జెంటీనా జట్లతో రెండేసి మ్యాచ్‌లను కోల్పోయిన సంగతి తెలిసిందే.

బిజినెస్

రాష్ట్రాల పీఎస్‌యూల కోసం కాగ్ ప్రత్యేక యూనిట్

న్యూఢిల్లీ: వివిధ రాష్ట్ర ప్రభుత్వాల యాజమాన్యంలో పని చేస్తున్న 1,600 ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) కోసం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) కార్యాలయం ప్రత్యేక ఆడిటింగ్ విభాగం ఏర్పాటు చేసింది. దీనివల్ల ఆయా సంస్థల ఆడిట్ వేగంగా పూర్తి చేయగలుగుతారు. తద్వారా అవి మరింత సమర్థవంతంగా పని చేయగలుగుతాయి. ఇప్పటికే ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఆ విభాగం ఏర్పాటు కాగానే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలోని పీఎస్‌యూలన్నీ ఆ విభాగం పరిధిలోకి వస్తాయని డిప్యూటీ సీఏజీ కేఎస్ సుబ్రమణియన్ చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర పీఎస్‌యూలను సీనియర్ మేనేజ్‌మెంట్ సభ్యులు ఆడిట్ చేస్తున్నారని, వీరు కనీసం 4-5 రాష్ట్రాల పీఎస్‌యూలను ఆడిట్ చేయాల్సి వస్తోందని ఆయన తెలిపారు. ప్రస్తుతం దేశంలో 700 వరకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఈ), 1600 రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు (ఎస్‌పీఎస్ఈ), 485 స్వతంత్ర ప్రతిపత్తి గల కేంద్ర సంస్థలు, 700 స్వతంత్ర ప్రతిపత్తి గల రాష్ట్ర సంస్థలు ఉన్నాయి.

హీరో ఫిన్‌కార్ప్ రూ.260 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: హీరో ఫిన్‌కార్ప్.. ప్రీ-ఐపీఓ రౌండ్‌లో భాగంగా రూ.260 కోట్లు సమీకరించినట్లు ప్రకటించింది. 12 మంది ఇన్వెస్టర్లకు ఒక్కో షేరును రూ.1,400 చొప్పున మొత్తం 18.57 లక్షల షేర్లను కేటాయించటం ద్వారా ఈ మొత్తాలను సమీకరించింది. కాగా ఈ నిధుల సమీకరణతో పబ్లిక్ ఇష్యూలో కొత్త షేర్ల జారీ పరిమాణాన్ని రూ.2,100 కోట్ల నుంచి రూ.1,840 కోట్లకు తగ్గించినట్లు తెలిపింది.

'మేడిన్ ఇండియా'కు చైనా కంపెనీలు జై!

అమెరికా, పశ్చిమాసియాలే లక్ష్యంగా భారత్ నుంచి ఎగుమతులు



న్యూఢిల్లీ: పరిస్థితులకు తగ్గట్టు మారితేనే వ్యాపారంలో మనుగడ. చైనా కంపెనీలు ఈ విషయాన్ని బాగానే వంటపట్టించుకున్నాయి. ఇప్పటి వరకు భారత మార్కెట్‌పైనే దృష్టి పెట్టిన ఈ కంపెనీలు ఇప్పుడు ఎగుమతులకూ భారత్‌ను కేంద్రంగా మార్చుకుంటున్నాయి. యూరోపియన్ యూనియన్ (ఈయూ), అమెరికా దేశాల్లో తమకు ఎదురవుతున్న ఆంక్షలను తప్పించుకునేందుకు 'భారత్‌లో తయారీ' (మేడిన్ ఇండియా)కి జై కొడుతున్నాయి. చైనా స్మార్ట్‌ఫోన్, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఉపకరణాల కంపెనీలు ఈ విషయంలో ముందున్నాయి. ఇందుకోసం స్థానిక కంపెనీలతో తయారీ ఒప్పందాలు కుదుర్చుకుని మరీ తమ వస్తువులను అమెరికా, పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ) వద్ద అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం 2023-24లో భారత్ నుంచి ఒప్పో మొబైల్స్ ఇండియా రూ.272 కోట్లు, రియల్‌మీ మొబైల్ టెలికమ్యూనికేషన్స్ (ఇండియా) రూ.114 కోట్ల విలువైన స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మన దేశం నుంచి ఎగుమతి చేశాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ఆర్థిక ఫలితాల వివరాలను ఈ కంపెనీలు ఇంకా ప్రకటించాల్సి ఉంది.

ఎందుకంటే?

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టక ముందు నుంచే అమెరికా, చైనా దిగుమతులపై ఆంక్షలు కఠినం చేసింది. ఈయూలోనూ ఇదే పరిస్థితి. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టాక అమెరికా చైనాపై మరింత రెచ్చిపోతోంది. చైనా ఉత్పత్తులపై ఏకంగా 145 శాతం సుంకం విధించారు. రేర్ ఎర్త్ ఖనిజ ఉత్పత్తుల కోసం ఈ సుంకాల పోటు కొద్దిగా తగ్గించినా.. చైనా వస్తువుల దిగుమతులు ఇంకా 55 శాతం సుంకాల పరిధిలో ఉన్నాయి. భారత్‌పై ఉన్న 26 శాతంతో పోలిస్తే ఇది 29 శాతం ఎక్కువ. భారత-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కుదిరితే ఈ పోటు కూడా ఉండదు. భారత-బ్రిటన్ మధ్య ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కూడా చైనా కంపెనీలను ఆకర్షిస్తోంది. దీంతో అమెరికా, ఈయూ మార్కెట్లలో ప్రవేశించేందుకు భారత్‌లో తయారీకి చైనా కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి.

ప్రభుత్వ ఆంక్షలు: అయితే 2020 గాల్వన్ సరిహద్దు ఘర్షణల తర్వాత కేంద్ర ప్రభుత్వం చైనా కంపెనీల పెట్టుబడులను కట్టడి చేసింది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ దేశీయ కంపెనీలోనూ చైనా కంపెనీల పెట్టుబడులను అనుమతించడం లేదు. అయితే స్థానిక కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని తమ ఉత్పత్తులను ఆ కంపెనీల్లో తయారు చేయించి ఎగుమతి చేసుకోవచ్చని పరోక్షంగా సూచించింది. అయితే ఇందు కోసం ఆ కంపెనీలకు పూర్తి స్థాయిలో టెక్నాలజీ బదిలీ చేయాలని స్పష్టం చేసింది. గతంలో ఇందుకు ససేమిరా అన్న చైనా కంపెనీలు.. ఇప్పుడు అందుకు రెడీ అంటూ ముందుకొస్తున్నాయి.

దారికొచ్చిన చైనా కంపెనీలు

- పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలకు హైసెన్స్ గ్రూప్ ఎగుమతి చేసే టీవీలు, గృహోపకరణాల తయారీ కోసం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సిటీలో రూ.100 కోట్లతో ప్లాంటు ఏర్పాటు చేస్తున్న ఇప్యాక్ డ్యూరబుల్స్ కంపెనీ
- డిక్సన్ టెక్నాలజీస్‌లో తయారైన తన అనుబంధ కంపెనీ మోటరోలా స్మార్ట్‌ఫోన్లను అమెరికాకు ఎగుమతి చేస్తున్న లెనోవా. త్వరలో సర్వర్లు, లాప్‌టాప్‌ల ఎగుమతికి సన్నాహాలు
- ఆఫ్రికా దేశాలకు ఎగుమతి కోసం చైనా కంపెనీ ట్రాన్సిషన్ హోల్డింగ్స్ ఐటెల్, టెక్నో, ఇన్ఫినిక్స్ బ్రాండెడ్ స్మార్ట్‌ఫోన్లను ఉత్పత్తి చేస్తున్న డిక్సన్ టెక్నాలజీస్
- భారత్ నుంచి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ పరికరాలు, గృహోపకరణాలు ఎగుమతి చేసే విషయాన్ని పరిశీలిస్తున్న హాయర్ కంపెనీ
- ఎగమతుల బాట పట్టిన స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలు ఒప్పో, వివో, వన్‌ప్లస్, షామీ

25,000 పైన బుల్లిష్

(జూన్ 16-20 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 25,204-24,473 పాయింట్ల మధ్యన కదలాడి 282 పాయింట్ల నష్టంతో 24,719 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,000 కన్నా పైన ముగిస్తే స్వల్ప కాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,947, 24,961, 24,844, 24,760 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,125 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,300
నిరోధ స్థాయిలు: 24,925, 25,025, 25,125 (24,825 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,500, 24,400, 24,300 (24,600 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	500
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

మార్కెట్లపై యుద్ధ భయాలు!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ప్రపంచ వాణిజ్యంపై పెను ప్రభావం చూపించనుంది. ఇప్పటికే క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. యుద్ధం మరింత తీవ్రతరమై ఇతర దేశాలకు పాకితే ప్రపంచ సంక్షోభం రావచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మదుపరులు ఆచితూచి అడుగులు వేయటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

భారత్ ఎలక్ట్రానిక్స్: అనిశ్చిత పరిస్థితుల్లోనూ డిఫెన్స్ స్టాక్స్ రాణిస్తున్నాయి. సుదీర్ఘ కన్సాలిడేషన్ తర్వాత ఈ షేరు మూడు నెలల్లో 40 శాతం మేర పెరిగింది. ఆ తర్వాత స్థిరంగా కొనసాగుతూ వస్తోంది. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ బాగున్నాయి. గత శుక్రవారం రూ.394 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.390 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.440 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.375 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బయోకాన్: ప్రస్తుతం ఈ షేరు స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ గణనీయంగా పెరుగుతోంది. పైగా 20,50 రోజుల ఈఎంఏపై స్థాయిలో చలిస్తున్నాయి. గత శుక్రవారం రూ.355 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.340 ఎగువన ప్రవేశించి రూ.410 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.320 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టెక్ మహీంద్రా: ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయి రూ1,700కి సమీపంలో ఉంది. ఏప్రిల్ నుంచి రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ క్రమంగా పెరుగుతున్నాయి. చివరి మూడు నెలల్లో 15 శాతం మేర పెరిగింది. ఫండమెంటల్స్ బలంగా ఉన్నాయి. గత శుక్రవారం రూ.1,659 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,630/1,650 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,740/1,770 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,610 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విప్రో: ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం అక్యుములేషన్ జరుగుతోంది. ప్రైస్ యాక్షన్ చాలా టైట్‌గా కొనసాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ పెరుగుతున్నాయి. గత శుక్రవారం రూ.260 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.250 శ్రేణిలో ఎంటరై రూ.390/410 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.240 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాక్స్‌హెల్త్: ఈ కౌంటర్‌కు అనేక అనుకూలతలు కనిపిస్తున్నాయి. తాజాగా 52 వారాలు, జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. జనవరి నుంచి కన్సాలిడేషన్ దిశలో కొనసాగుతోంది. పైగా మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉన్నాయి. గత శుక్రవారం రూ.1,232 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,220 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.1,450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,200 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,500 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్‌గానే ప్రారంభమై మానసిక అవధి 25,000 కన్నా పైకి దూసుకుపోయినా ఆ స్థాయిలో నిలదొక్కుకోలేకపోయింది. ఇది స్వల్పకాలిక బలహీనతను సూచిస్తోంది. అయితే శుక్రవారం నాడు 250 పాయింట్లు లాభపడడం ద్వారా 24,500 వద్ద మద్దతు లభించినట్టు కూడా నిర్ధారించింది. గత ఐదు వారాలుగా సైడ్‌వేస్, కన్సాలిడేషన్ ట్రెండ్‌లో ఉన్న మార్కెట్ 25,000-24,500 మధ్యన కదలాడుతోంది. అలాగే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా కీలక స్థాయిలు 60,000, 19,000 వరకు వెళ్లినా ఆ స్థాయిల్లో నిలదొక్కుకోలేకపోయాయి. మొత్తం మీద మార్కెట్ ఐదు వారాల కనిష్ఠ స్థాయిలో ముగియడం, శుక్రవారం అమెరికన్ మార్కెట్లు బలహీనత ప్రదర్శించిన నేపథ్యంలో ఈ వారం మార్కెట్ మద్దతు స్థాయిల్లో పరీక్ష ఎదుర్కొనవచ్చు. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

బుల్లిష్ స్థాయిలు: రికవరీ బాట పట్టినట్టయితే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను మరింతగా కొనసాగించేందుకు కీలక నిరోధం 25,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. అయితే కొన్ని వారాలుగా మార్కెట్ తీవ్ర ఆటుపోట్లలో ఉన్నందు వల్ల సానుకూలత కోసం మొదట కనిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేట్ కావడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: గత వారం నిఫ్టీ 24,500 వద్ద మైనర్ రికవరీ సాధించింది. భద్రత కోసం ఈ స్థాయిలో నిలదొక్కుకుని తీరాలి. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుందనేందుకు సంకేతంగా భావించాలి. ప్రధాన మద్దతు స్థాయి 23,900.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 57,000 వరకు వెళ్లి బలమైన కరెక్షన్‌లో పడడంతో పాటు 1,050 పాయింట్ల నష్టంతో 55,525 వద్ద ముగిసింది. గతంలో ఏర్పడిన టాప్ కన్నా దిగువన క్లోజ్ కావడం స్వల్పకాలిక అప్రమత్త సంకేతం. మద్దతు స్థాయి 55,000. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ముప్పు ఎదుర్కొంటుంది. రికవరీ బాట పడితే మరింత సానుకూలత కోసం నిరోధ స్థాయి 56,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి.

పాటర్న్: 24,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ఇదే స్థాయిలో ట్రిపుల్ బాటమ్ కూడా ఏర్పడింది. అందువల్ల ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. మార్కెట్ గత వారం 25 డీఎంఏ కన్నా దిగజారింది. ఇప్పుడు 50 డీఎంఏకు చేరువవుతోంది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం గురువారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,780, 24,850
మద్దతు	24,600, 24,500

తిరుపతి వెళ్లే విమానం ఇంజన్‌లో పొగలు

» శంషాబాద్‌లోనే నాలుగు గంటల పాటు నిలిపివేత

» లోపాన్ని సరిదిద్దిన తర్వాత అర్ధరాత్రి 12గంటలకు టేకాఫ్

శంషాబాద్ రూరల్: దేశంలో విమాన, హెలికాప్టర్ ప్రమాదాలు కలవర పెడుతున్న వేళ మరో విమానానికి సాంకేతిక సమస్య తలెత్తింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే స్పైస్‌జెట్ విమానం టేకాఫ్‌కు ముందు సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే స్పైస్ జెట్ విమానం ఎస్‌జీ -2138 ఆదివారం రాత్రి 7-30గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి టేకాఫ్ కావాల్సి ఉండగా, విమానం స్టార్ట్ చేయగానే ఇంజన్ భాగం నుంచి పొగలు, కాలిన వాసన రావడాన్ని గమనించిన ఫ్లైట్ సిబ్బంది విమానాన్ని నిలిపివేశారు. దీంతో కొంత మంది తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. 60మంది ప్రయాణికులు మరో విమాన సర్వీసు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అయితే, లోపాన్ని సరిదిద్దడంతో ఆదివారం నాలుగున్నర గంటలు ఆలస్యంగా అర్ధరాత్రి 12గంటల సమయంలో అదే విమానం టేకాఫ్ అయింది. మరోవైపు, జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి ఆదివారం హైదరాబాద్ బయలుదేరిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానం గమ్యం చేరకుండానే వెనుదిరిగింది. దీనికి కారణాలు తెలియరాలేదు. ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి బయలుదేరిన కాసేపటికే ఈ విమానం వెనుదిరిగినట్లు శంషాబాద్ విమానాశ్రయం ఏటీసీకి సమాచారం వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం 2.15 గంటలకు ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి బయలుదేరిన ఈ విమానం సోమవారం ఉదయం 6 గంటలకు హైదరాబాద్ చేరుకోవాల్సి ఉందని ఫ్లైట్‌వేర్.కామ్ వెబ్‌సైట్ పేర్కొంది. ఇది బోయింగ్ 787-9 డ్రీమ్‌లైనర్ విమానమని ఆ వెబ్‌సైట్ తెలిపింది.

నేడు ఏసీబీ ముందుకు కేటీఆర్

» ఫార్ములా ఈ-కారు రేసు కేసులో విచారణకు హాజరు

హైదరాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-కారు రేసు కేసుకు సంబంధించి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం మరోసారి ఏసీబీ విచారణకు హాజరు కానున్నారు. ఈ కేసులో కేటీఆర్‌ను ఏసీబీ, ఈడీ అధికారులు ఇప్పటికే పలుమార్లు విచారించారు. ఫార్ములా ఈ-ఆపరేషన్స్ సంస్థ ప్రతినిధులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రశ్నించారు.క్యాబినెట్ అనుమతి లేకుండా నిర్ణయం, సచివాలం బిజినెస్ రూల్స్ ఉల్లంఘనకు సంబంధించి ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించవచ్చని తెలుస్తోంది. కేటీఆర్ విచారణ పూర్తయిన తర్వాతే ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేయడానికి ఏసీబీ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా, కేటీఆర్ సోమవారం ఉదయం 9గంటలకు తెలంగాణ భవన్‌కు చేరుకుని.. అక్కడి నుంచి ఏసీబీ విచారణకు వెళ్లనున్నట్లు సమాచారం.

పట్లోళ్ల మహిపాల్‌రెడ్డికి సిట్ పిలుపు

వికారాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఫోన్ ట్యాపింగ్ కేసులో వికారాబాద్‌కు చెందిన ఉమ్మడి రంగారెడ్డి జెడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పట్లోళ్ల మహిపాల్‌రెడ్డికి ప్రత్యేక విచారణ బృందం (సిట్) నుంచి పిలుపు వచ్చింది. ఈ కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాల గురించి తెలుసుకునేందుకు మహిపాల్ రెడ్డి రావాలని విచారణ అధికారులు సూచించినట్టు తెలుస్తోంది. సోమవారం ఉదయం 11గంటలకు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ ఆవరణలోని సిట్ కార్యాలయంలో అధికారుల ఎదుట ఆయన హాజరు కానున్నట్లు సమాచారం.ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న మహిపాల్‌రెడ్డితో ఎవరెవరు మాట్లాడుతున్నారనే సమాచారాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెప్పించుకున్నట్లుగా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో గుర్తించినట్లు సమాచారం.

20న ఏపీ, తెలంగాణ బంద్‌కు నక్సల్స్ పిలుపు

హైదరాబాద్, చర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో ఆపరేషన్ కగార్ దాడులను నిరసిస్తూ ఈ నెల 20న ఏపీ, తెలంగాణ బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ తెలంగాణ కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో ఆదివారం ఓ లేఖ విడుదలైంది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. మావోయిస్టులను పట్టుకుని చిత్రహింసలకు గురి చేసి, చంపేస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ ప్రారంభించిన తర్వాత 550కి పైగా మావోయిస్టులను హత్య చేశారని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, ఆదివాసీల హత్యలను ఆపివేయాలని డిమాండ్ చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌పై పారదర్శక విచారణ చేపట్టాలి

» కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌కు ఎంపీ అర్వింద్ వినతి

న్యూఢిల్లీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా సమగ్ర విచారణకు బీజేపీ డిమాండ్ చేయాలని ఆ పార్టీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై పారదర్శక విచారణకు కృషి చేయాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే ఫోన్ ట్యాపింగ్‌లో కేసీఆర్ కుటుంబాన్ని, కుట్రలో భాగస్వాములందరినీ న్యాయస్థానంలో నిలబెట్టేలా చూడాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఫోన్ ట్యాపింగ్ ఉదంతంలో రాష్ట్ర ప్రభుత్వం నేరస్థులపై చర్య తీసుకునే అవకాశంలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడటం రాజకీయ కక్ష సాధింపు మాత్రమేకాదని, నేరపూరిత స్వభావంతో లక్ష్యంగా చేసుకున్నారని తెలిపారు.

కిషన్‌రెడ్డికి ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డికి ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "సామాన్య కార్యకర్త నుంచి ఎదిగిన మీరు ఆత్మనిర్భర భారత్ కోసం దేశ బొగ్గు, గనుల రంగాలను బలోపేతం చేయడంలో ముందంజలో ఉన్నారు. మీరు ఆరోగ్యం, దీర్ఘాయుష్షుతో జీవించాలని కోరుకుంటున్నాను" అని ప్రధాని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మోదీకి కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ.. వికసిత్ భారత్ కలను సాకారం చేసేందుకు తన వంతు ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మీ నిరంతర ప్రోత్సాహం స్ఫూర్తినిస్తుందన్నారు.

కాంగ్రెస్ మాటలు బూటకం: శ్రీనివాస్‌గౌడ్

» ఫార్ములా ఈ-రేస్ పేరిట కేటీఆర్‌పై చెత్త కేసు: ఆర్‌ఎస్ ప్రవీణ్

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మాటలు బూటకమని, బీసీ రిజర్వేషన్ల విషయంలో ఆ పార్టీ నయవంచన చేసిందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు.42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామన్న అధికారపార్టీ.. కేంద్రానికి బీసీ బిల్లు పంపి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. ఢిల్లీలో ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి కలిసినప్పుడు బీసీ బిల్లు చట్టబద్ధత గురించి ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు అడుగుతుందో చెప్పాలన్నారు. కేటీఆర్‌పై కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, ఆయనపై పెట్టిన ఫార్ములా ఈ-రేస్ కేసు ఒక చెత్త కేసని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు గుప్పించారు. తన 26 ఏళ్ల పోలీసు సర్వీసులో ఇలాంటి కేసు ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న కేటీఆర్‌పై ఇప్పటివరకు 14 కేసులు పెడితే.. అందులో నాలుగు కేసులను హైకోర్టు కొట్టేసిందని తెలిపారు.

లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి

» సేవాలాల్ సేన అధ్యక్షుడు భూక్య సంజీవ్

పంజాగుట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్టీలలో అత్యధిక జనాభా కలిగిన లంబాడీ సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్ నాయక్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ఎంతో కృషి చేశామని, అధికారంలోకి వచ్చిన తరువాత తమను విస్మరించడం సరికాదని అన్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన నలుగురు ఎమ్మెల్యేలలో ఒకరికి మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. అలాగే, తమ గురువు హాథిరామ్ బావాజీకి చెందిన ఆస్తులను పరిరక్షించాలన్నారు. తిరుపతిలోని హాథిరామ్ మఠం పీఠాధిపతిగా లంబాడీని నియమించాలని డిమాండ్ చేశారు.




ఆంధ్రజ్యోతి ఢిల్లీ బ్యూరో చీఫ్ కృష్ణారావు కుమారుడు అనిరుధ్-వైభవి వివాహ రిసెప్షన్ వేడుక హైదరాబాద్‌లోని దస్‌పల్లా హోటల్‌లో ఆదివారం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, ఏబీఎన్ డైరెక్టర్ భానుప్రకాశ్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఈసారి తెలంగాణ ఎన్నికలు..

పార్లమెంటుతో కలిపే!

(మొదటిపేజీ తరువాయి)

మోదీ సర్కారు.. ఈ పనిని రెండు దఫాలుగా సాకారం చేయడం సులభతరం అవుతుందని భావిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను తొలిదఫా జమిలిగా నిర్వహించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు రాష్ట్ర అసెంబ్లీకి చాలా దఫాలు పార్లమెంటుతో కలిపే ఎన్నికలు జరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక జరిగిన 2014 ఎన్నికలు కూడా జమిలిగానే నిర్వహించారు. అయితే ఆ తర్వాత 2018లో నాటి కేసీఆర్ ప్రభుత్వం లోక్‌సభతో కాకుండా సుమారు ఐదు నెలల ముందుగానే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లింది. 2023లోనూ అదే కొనసాగింది.

రెండు దశల వ్యూహం ఎందుకంటే..

ఒకే దేశం-ఒకే ఎన్నిక వ్యవహారం ఒకేసారి తేలేది కాదన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. పార్లమెంటు ఎన్నికలు గత ఏడాదే జరగగా.. వాటితోపాటు కేవలం నాలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కింల అసెంబ్లీ ఎన్నికలు మాత్రమే జరిగాయి. మిగిలిన రాష్ట్రాలన్నింటిలోనూ ఎన్నికలు కొంత ముందు, లేదంటే కొంత వెనక జరిగాయి. కొన్ని రాష్ట్రాల్లోనైతే ఏకంగా మూడేళ్ల ముందు కూడా జరిగాయి. బిహార్, అసోం, గోవా, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, పాండిచ్చేరి, పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల శాసనసభలకు 2021-2022లో ఎన్నికలు జరిగాయి. ఇక ఢిల్లీలో ఈ ఏడాదే ఎన్నికలు జరగగా, బిహార్‌లో వచ్చే సెప్టెంబరు-అక్టోబరులో జరగనున్నాయి. అయితే 2024 పార్లమెంటు ఎన్నికలకు సుమారు ఏడాది ముందుగానీ, ఏడాది తర్వాతగానీ అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాష్ట్రాలను ఒక క్యాటగిరీగా తీసుకోవాలని కేంద్రం యోస్తోంది. అంటే 2028, 2029లో ఎన్నికలు జరగాల్సి ఉన్న రాష్ట్రాలను తొలి విడతలో పరిగణనలోకి తీసుకోనున్నారు. 2028లో తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, మిజోరం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. 2029లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, హరియాణ, జార్ఖండ్, మహారాష్ట్ర ఉన్నాయి. ఈ 16 రాష్ట్రాలకు 2029 పార్లమెంటు ఎన్నికలతో కలిపి జమిలి ఎన్నికలు నిర్వహించనున్నారు. మిగతా 15 రాష్ట్రాల్లో ఏవైనా ఈ పరిధిలోకి వచ్చే అవకాశాలున్నాయా? అన్నది కూడా పరిశీలిస్తారు. అలా లేని వాటన్నింటినీ.. 2034 నాటికి ఒకే దేశం-ఒకే ఎన్నిక పరిధిలోకి తేవాలని యోచిస్తున్నట్లు సమాచారం.



పీఎస్‌యూలు, మాజీ న్యాయమూర్తుల అభిప్రాయాలు కూడా

ఒకే దేశం-ఒకే ఎన్నికకు సంబంధించి 129వ రాజ్యాంగ సవరణ బిల్లును గత ఏడాది డిసెంబరులో పార్లమెంటులో ప్రవేశపెట్టారు. పార్లమెంటు-అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడానికి సంబంధించిన అంశాలను ఇందులో పొందుపరిచారు. అంతకుముందు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ.. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు మాత్రమే కాకుండా స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఒకేసారి నిర్వహించాలని సిఫారసు చేసింది. పార్లమెంటు-అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన 100 రోజుల్లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. అయితే ప్రస్తుతానికి పార్లమెంటు-అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో అనే అంశంపైనే బిల్లును రూపొందించారు. తొలుత ఈ అంకాన్ని పూర్తిచేస్తే.. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ఏకకాలంలో అన్న అంకానికి తెర తీసే అవకాశాలున్నాయి. మరోవైపు 129వ రాజ్యాంగ సవరణ బిల్లుపై నియమించిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) కూడా ఆ అంశంపై అభిప్రాయ సేకరణకు అన్ని రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. తొలుత ఈ కమిటీలో 31 మందిని నియమించగా.. ఆ తర్వాత కొన్ని చిన్న పార్టీలు తమకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని కోరాయి. ఇందుకు కేంద్రం అంగీకరించడంతో ఆ సంఖ్య 39కి పెరిగింది.

రాష్ట్రాల్లో జేపీసీ పర్యటన..

జాయింట్ పార్లమెంటరీ కమిటీలో బీజేపీ నుంచి అనురాగ్ ఠాకూర్, బాన్సురి స్వరాజ్, కె.లక్ష్మణ్, సీఎం రమేశ్ తదితరులుండగా.. కాంగ్రెస్ నుంచి ప్రియాంకాగాంధీ, మనీశ్ తివారీ, రణదీప్ సూర్జేవాలా, టీడీపీ నుంచి గంటి హరీశ్, జనసేన నుంచి వల్లభనేని బాలశౌరి, వైసీపీ నుంచి వైవీ సుబ్బారెడ్డి, దేశంలోని పలు ఇతర పార్టీల ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఇప్పటికే ఐదు రాష్ట్రాల్లో పర్యటించింది. మహారాష్ట్ర, పంజాబ్, హరియాణ తదితర రాష్ట్రాల్లో కేవలం రాజకీయ పార్టీల అభిప్రాయాలే కాకుండా.. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల అభిప్రాయాలను కూడా తీసుకుంటోంది. అనేకసార్లు ఎన్నికలు రావడం వల్ల ఆయా సంస్థలు, బ్యాంకులకు ఏమైనా ఇబ్బందులున్నాయా? వాటి కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతుందా? అన్న విషయాలపైనా అభిప్రాయ సేకరణ చేస్తోంది. అదే సమయంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తుల అభిప్రాయాలు కూడా సేకరించినట్లు సమాచారం. ఇప్పటికే ఐదుగురు మాజీ సీజేలతో మాట్లాడామని, మరింతమంది అభిప్రాయాలు కూడా తీసుకుంటామని కె.లక్ష్మణ్ తెలిపారు.

యువతరం వస్తేనే స్వచ్ఛ రాజకీయాలకు నాంది

» భవిష్యత్ నాయకులను తయారు చేయాల్సిన అవసరముంది

» ప్రతినెలా మూడు రోజులు శిక్షణ: కవిత



హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యువతరం రాజకీయాల్లోకి వస్తేనే స్వచ్ఛమైన రాజకీయాలకు నాంది పడుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 'లీడర్' పేరిట చేపట్టనున్న రాజకీయ శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. యువత, మహిళలకు తెలంగాణ జాగృతి ఒక రాజకీయ శిక్షణ వేదికగా మారబోతుందని ఆమె తెలిపారు. తెలంగాణ అంటే ప్రశ్నించే తత్వం ఉన్న గడ్డ అని, ఈ కార్యక్రమం ద్వారా యువతకు ప్రశ్నించే తత్వాన్ని నేర్పించాలని ఆమె కోరారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెలా మూడురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తారని చెప్పారు. జులైలో హైదరాబాద్‌లో ప్రారంభించి, ఆగస్టు నుంచి మిగతా జిల్లాల్లో చేపడతారని తెలిపారు. ప్రజాస్వామ్యంపై ఆసక్తి ఉన్నవారు.. ముఖ్యంగా యువత, విద్యార్థులు, మహిళలు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని కోరారు. సర్పంచ్ మొదలు ఎమ్మెల్యే, ఎంపీల దాకా ప్రజా ప్రతినిధుల విధులు, పరిధి, పరిమితులు అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యలను గుర్తించడం, వాటిని పరిష్కరించడం, అభివృద్ధికి నిధులు సాధించడం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వరంగల్, హన్మకొండ, హైదరాబాద్‌కు చెందిన పలువురు యువకులు, మహిళలు, విద్యార్థులు తెలంగాణ జాగృతిలో చేరగా వారికి కవిత కండువాలు కప్పి ఆహ్వానించారు.

జూరాల ప్రాజెక్టుకు నిలకడగా వరద

ధరూరు/ఆత్మకూరు/దోమలపెంట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు వరద నిడకడగా కొనసాగుతోంది. ఆదివారం 21 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, ప్రాజెక్టులో 2.3 టీఎంసీల నీరు ఉంది. జెన్‌కో జలవిద్యుత్ కేంద్రాలకు 15,808 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నెట్టెంపాడు లిఫ్ట్ కెనాల్‌కు 1500, కోయిల్‌సాగర్ లిఫ్ట్ కెనాల్‌కు 315, మొత్తం 17,680 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 8 యూనిట్లు ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి 41,944 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. జలాశయం నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా, 62.4320 టీఎంసీల నీరు ఉంది. 6,785 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

నేడు నైరుతిలో కదలిక

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హిందూ మహాసముద్రం నుంచి బలమైన తేమగాలులు వీస్తుండడం, రుతుపవనాలు చురుగ్గా మారడంతో దక్షిణ భారతం, దానికి ఆనుకుని పశ్చిమ భారతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు వాయవ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రుతుపవనాల్లో కదలిక వచ్చింది. సోమవారం గుజరాత్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా.. ఆదివారం కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురిశాయి.

మళ్లీ ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ..!

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించాలి? ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ కేటగిరీల కోసం ఎన్ని నిర్మించాలనేదానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. సమగ్ర నివేదికను రూపొందించి, క్యాబినెట్ ముందు ఉంచనున్నట్లు సమాచారం.

అందుబాటు ధరల్లో ఉండేలా..

అల్ప, మధ్య, అధిక ఆదాయ వర్గాల వారికీ సరసమైన ధరల్లో ఇళ్లను నిర్మించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. అందుకోసం కొత్తగా ఒక విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ఈ విధాన రూపకల్పన కోసం టెండర్లు ఆహ్వానించగా.. ఓ కంపెనీ దక్కించుకొని, హౌసింగ్ బోర్డు అధికారులకు సమగ్ర వివరాలతో నివేదికను అందించింది. ఆ విధానం ఆమోదయోగ్యంగా ఉందనుకుంటే.. దాని ప్రకారమే ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ విభాగాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడతారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్‌ఆర్)- రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) మధ్య శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని, వీలైన చోట, స్థలం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఏకంగా కొత్త గ్రామాలనే సృష్టించాలనే యోచనలో ఉంది. మొదటి దశలో ఫ్యూచర్ సిటీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, ఆ తర్వాత హైదరాబాద్ చుట్టుపక్కల, అనంతరం వివిధ ప్రాంతాల్లో వీటిని నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. తద్వారా ఇవన్నీ భవిష్యత్‌లో అధిక డిమాండ్ ఉన్న ప్రాంతాలుగా మారతాయని సర్కారు యోచిస్తోంది. ఈ సందర్భంగా ఉమ్మడి ఏపీ హయాంలో నిర్మించిన కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు సహా ఇతర ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్ల నిర్మాణాలను పరిగణనలోకి తీసుకుంది. హైటెక్‌సిటీ నుంచి కూకట్‌పల్లి వెళ్లే మార్గంలో వేణుగోపాలస్వామి ఆలయం పక్కన బోర్డు పరిధిలో ఉన్న స్థలంలో ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని భావిస్తున్నారు. అయితే హౌసింగ్ బోర్డు, దిల్, ఇతర భూముల్లో ఏర్పాటు చేసే నిర్మాణాల కోసం ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) లేదా ఇతర ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని నిర్మించడం, లబ్ధిదారులతో వాటాలు పెట్టించడం ఇలా పలు అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం హౌసింగ్ బోర్డు పరిధిలో 598 ఎకరాలు, దిల్ పరిధిలో 1,821 ఎకరాల భూమి ఉంది. దిల్ పరిధిలోని భూమిలో 1000 ఎకరాల వరకు ఆక్రమణల్లోనే ఉన్నట్లు అధికారులే చెబుతున్నారు.



సాధ్యమయ్యేనా..?

ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ వర్గాలకు సరసమైన ధరలకే ఇళ్లను అందించాలని నిర్ణయించినప్పటికీ ఇది సాధ్యమవుతుందా, పూర్తిస్థాయిలో ఈ పథకం విజయవంతం అవుతుందా అనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇందుకు ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రాజీవ్ స్వగృహ టవర్లను పూర్తిచేయలేకపోవడాన్ని ఉదహరిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కూడా ఇంటిని నిర్మించుకునే వారికి ఆర్థిక సాయం చేయడం తప్ప.. ప్రభుత్వమే ఇంటిని నిర్మించడం లేదు. ఈ క్రమంలో మళ్లీ అందుబాటు ధరల్లో ఇళ్లు అందించాలన్న అంశాన్ని తెరపైకి తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం కూకట్‌పల్లిలో భూముల ధరలు ఆకాశాన్నంటేలా ఉన్నాయి. ఇటీవల హౌసింగ్‌బోర్డు పరిధిలో 18 ఓపెన్ ప్లాట్లను వేలం వేయగా.. సగటున గజం రూ.2.38 లక్షలు పలికింది. ఇప్పుడు అపార్ట్‌మెంట్లు నిర్మించాలనుకుంటున్న స్థలం ప్రధాన రహదారి పక్కనే ఉంది. ఆ స్థలం పక్కన, ఎదురుగా రెండు పెద్ద మాల్స్ ఉన్నాయి. అలాంటి స్థలంలో ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ కేటగిరీలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తే లాభదాయకంగా ఉంటుందా? అనేదానిపైనా అధికారులు అధ్యయనం చేస్తున్నారు. మొత్తంగా ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై నివేదికను రూపొందించి, క్యాబినెట్‌కు సమర్పించనున్నట్లు తెలిసింది.

ఉమ్మడి ఏపీలో 81 వేల ఇళ్ల నిర్మాణం

ఆదాయాల వారీగా ఆయా వర్గాల కోసం ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ఉమ్మడి ఏపీలోనే మొదలైంది. ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ వర్గాలకు ఇళ్ల నిర్మాణాల కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి తెలంగాణ రాష్ట్రంఏర్పడే వరకు 81,058 ఇళ్లు నిర్మించారు. వీటిలో అల్పాదాయ వర్గాల కోసమే దాదాపు 27,410 ఇళ్లను (250-400 చదరపు అడుగుల్లో) నిర్మించగా, ఎంఐజీ కింద (400-650 చ.అ.) 15,072; హెచ్‌ఐజీ కింద (800-1,400 చ.అ.) 4,320 ఇళ్లను నిర్మించారు. రాజీవ్ గృహకల్ప కింద కూడా ఎల్‌ఐజీ వర్గాల కోసం 27,652 ఇళ్లను నిర్మించారు.

గుడ్ల టెండర్లు ఖరారయ్యేనా..?

» నేడు బిడ్ల దాఖలుకు ఆఖరు.. రేపు ఓపెన్

» ఎగ్ ర్యాక్‌ల టెండర్లు మళ్లీ 26కు వాయిదా

» అంగన్‌వాడీ కాంట్రాక్టర్ల ఎంపికలో సాగదీత

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్ల సరఫరా, గుడ్ల ర్యాక్స్, టేబుళ్ల కొనుగోలుకు సంబంధించిన టెండర్ల నిర్వహణలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు తిరిగి తెరచుకున్నా టెండర్లు సకాలంలో నిర్వహించి, కాంట్రాక్టర్లను ఎంపిక చేయకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికారుల ఉదాసీనత చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషకాహారంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నిబంధనల మార్పు పేరుతో గతంలో పలుమార్లు ఈ టెండర్ల ప్రక్రియను వాయిదా వేశారు. కొత్త గుత్తేదారులను ఎంపిక చేయకుండా పాతవారినే కొనసాగించడం వంటి చర్యలు అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నాయి. టెండర్లు లేకుండానే టేబుళ్ల సరఫరాను జైళ్ల శాఖకు అప్పగించడంపైనా విమర్శలు వస్తున్నాయి.



మార్చిలోనే ముగిసిన పాత టెండరు..

రాష్ట్రంలో 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా 19.60 లక్షల మంది చిన్నారులు, మహిళలు సేవలు పొందుతున్నారు. అంగన్‌వాడీలకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు గుడ్ల సరఫరాకు మార్చి 30న మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు టెండర్లు పిలిచారు. మొత్తం ఏడు జోన్లకు కలిపి 36.96 కోట్ల గుడ్ల సరఫరా టెండర్లకు బిడ్ల దాఖలు గడువు ఏప్రిల్ 10గా నిర్ణయించారు. వివిధ కారణాలతో ఏప్రిల్ 15, మే 15, జూన్ 16 వరకు గడువు పెంచుతూ వచ్చారు. సోమవారం గడువు ముగియనుంది. మంగళవారం బిడ్లను ఓపెన్ చేస్తారు. అయితే, ఈసారైనా కొత్త కాంట్రాక్టర్ల ఎంపిక జరుగుతుందా..? మళ్లీ వాయిదా పడుతుందా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి మార్చిలోనే టెండర్లు నిర్వహించి కొత్త గుత్తేదారులను ఎంపిక చేయాల్సి ఉంది. కానీ, వేసవి సెలవులు ముగిసి, అంగన్‌వాడీ కేంద్రాలు తెరచుకున్నా ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. గుడ్ల సరఫరా గడువు మార్చితోనే ముగియడంతో పాత గుత్తేదారులకే సరఫరా బాధ్యతలు అప్పగించారు. అంగన్‌వాడీలకు గుడ్ల ర్యాక్‌ల సరఫరా టెండర్ల నిర్వహణలోనూ తీవ్ర జాప్యమే జరుగుతోంది. గుడ్లను నిల్వ చేసుకోవడానికి మహిళా శిశు సంక్షేమ శాఖ సుమారు రూ.12 కోట్లతో టెండర్లు పిలిచింది. నోటిఫికేషన్ ప్రకారం ఏప్రిల్ 11 నాటికి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఆ గడువును మే 26 వరకు పెంచి.. జూన్ 14కు వాయిదా వేశారు. మళ్లీ ఈ నెల 26కు పొడిగించారు.

ధర తేల్చకుండానే టేబుళ్ల సరఫరాకు ఓకే..

అంగన్‌వాడీలకు వచ్చే గర్భిణులు కూర్చోవడానికి 72 వేల టేబుళ్లను కొనాలని అధికారులు నిర్ణయించారు. అందుకు రూ.30 కోట్లు కేటాయించారు. ఈ టెండర్లను గత నెల 9న ఓపెన్ చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలు(ఎంఎస్ఎంఈ)లు ఒక్కో టేబుల్‌ను రూ.2,600కు సరఫరా చేసేలా మిగిలిన వాళ్ల కంటే తక్కువకు కోట్ చేయగా.. సాంకేతిక కారణాల సాకుతో వాటిని రద్దు చేసి.. మళ్లీ టెండర్లు నిర్వహిస్తామని ప్రకటించారు. కానీ, టెండర్లు లేకుండా ఈ నెల 3న చంచల్‌గూడ జైలుకు తొలుత 25వేల టేబుళ్ల సరఫరా బాధ్యతను ఇటీవల బదిలీ అయిన డైరెక్టర్ కాంతి వెస్లీ అప్పగించారు. అందులో ఒక్కో టేబుల్ ధరను పేర్కొనలేదు. 50శాతం నిధులు అడ్వాన్స్‌గా చెల్లించడానికి సంబంధిత శాఖ అధికారులు అంగీకరించినట్లు తెలిసింది. కేంద్రాలకు అందించానుకున్న సెల్‌ఫోన్ల విషయంలో ఇంకా అడుగు పడలేదు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

విద్యార్థుల భవిష్యత్తే.. రాష్ట్ర భవిష్యత్తు

- విద్యారంగానికి ఎన్ని నిధులైనా వెచ్చిస్తాం: డిప్యూటీ సీఎం
- విక్టోరియా మెమోరియల్ హోంలో అనాథ విద్యార్థుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకొన్న భట్టి

ఎల్బీనగర్/హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే మెరుగుపడ్డ తెలంగాణ నేడు ప్రపంచంతో పోటీ పడుతోందన్నారు. అందుకే విద్యారంగానికి ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోంలో అనాథ విద్యార్థుల నడుమ భట్టి తన పుట్టినరోజు వేడుకలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ప్రపంచంతో పోటీపడేలా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో రూ.200 కోట్లతో ఈ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని.. మొదటి విడతలో రూ.11,600 కోట్లతో 100 పాఠశాలలను నెలకొల్పుతామని చెప్పారు. ఎంతో విలువైన విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ స్కూల్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడతామన్నారు. విక్టోరియా మెమోరియల్ స్కూల్ అభివృద్ధి, స్కూల్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించేందుకు రూ.5 కోట్లు తక్షణమే విడుదల చేస్తామని.. ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పుట్టిన రోజు సందర్భంగా గాంధీభవన్‌లో ఏర్పాటైన రక్తదాన శిబిరాన్ని పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో భట్టి కీలకపాత్ర పోషించారన్నారు. భట్టిపై అభిమానంతో వందలాది మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారని తెలిపారు.

జూలై తొలి వారంలో హ్యామ్ రోడ్లకు టెండర్లు!

- 5,190 కిలో మీటర్లు.. 50కి పైగా ప్యాకేజీలు

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్)లో నిర్మించతలపెట్టిన రహదారుల పనులకు జూలై మొదటివారంలో టెండర్లను ఆహ్వానించాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. ఇందులో భాగంగా మొదటి దశలో అభివృద్ధి చేయాలని గుర్తించిన 5,190 కిలోమీటర్లను 50కిపైగా ప్యాకేజీలుగా విభజించారు. పనుల నిర్వహణ, టెండర్ల వ్యవహారానికి సంబంధించి త్వరలోనే రాష్ట్రంలోని కాంట్రాక్టర్లతో కీలక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆ సమావేశంలో కాంట్రాక్టర్లు చెప్పే అంశాలను పరిగణనలోకి తీసుకుని, ప్యాకేజీలను పెంచాలా? తగ్గించాలా? అనేది ఖరారు చేయనున్నారు. కాగా, మొదటి దశలో 5,190 కిలో మీటర్ల హ్యామ్ రోడ్ల కోసం రూ.16,414కోట్ల మేర వ్యయం కానుంది. ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు, ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్లతో అనుసంధానం, జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు నాలుగు లైన్ల రహదారులను నిర్మించనున్న విషయం తెలిసిందే.

హ్యామ్ రోడ్ల ప్రాజెక్టుకు ప్రత్యేకంగా ఒక పేరు!

- కసరత్తు చేస్తున్న ఆర్ అండ్ బీ అధికారులు

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్(హ్యామ్)లో నిర్మించనున్న రోడ్ల ప్రాజెక్టుకు మంచి పేరు పెట్టాలని ఆర్ అండ్‌బీ అధికారులు యోచిస్తున్నారు. కర్ణాటకలోనూ అక్కడి ప్రభుత్వం కూడా పలు రహదారులను ఉన్నతీకరించింది. ఈ ప్రాజెక్టుకు 'కర్ణాటక-స్టేట్ హైవేస్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు(కే-షిప్)'గా నామకరణం చేసింది. దశలవారీగా అభివృద్ధి చేసిన రోడ్లన్నింటికీ కే-షిప్-1, కే-షిప్-2 పేరుతో పనులు చేపట్టగా, ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయి. అలాగే, ఇటీవల తెలంగాణలో జరిగిన మిస్‌వరల్డ్- 2025 పోటీలకు "తెలంగాణ జరూర్ ఆనా" క్యాప్షన్ జోడించడంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. అదే తరహాలో హ్యామ్ రోడ్ల ప్రాజెక్టుకూ ఒక పేరు పెట్టాలని ఆర్ అండ్‌బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొదటి దశ రోడ్లకు టెండర్లు పూర్తయ్యేలోపు ఖరారు చేయాలని యోచిస్తున్నారు.

నాకూ సీఎం పదవి మిస్సయింది

- రాజకీయాల్లో ఆశించినవన్నీ జరగకపోవచ్చు: జానారెడ్డి

నాగార్జునసాగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో కొన్నిసార్లు ఆశించినవన్నీ జరగకపోవచ్చునని, తనకు సీఎం పదవి దక్కాల్సి ఉన్నా మిస్సయిందని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకమైన కొండేటి మల్లయ్యకు సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పట్టణంలో కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా జానారెడ్డి జర్నలిస్టులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. కొండేటి మల్లయ్య ఎన్నో ఏళ్లుగా రాజకీయాల్లో తన అనుచరుడిగా ఉన్నారని ఈ క్రమంలో ఆయనకు ఎమ్మెల్యే సీటు రావల్సి ఉన్నప్పటికీ అది దక్కలేదని తెలిపారు. తనకు కూడా సీఎం పదవి దక్కాల్సినప్పటికీ అది రాలేదన్నారు. రాజకీయాల్లో కొన్నిసార్లు అలా జరుగుతుందని వ్యాఖ్యానించారు. తమ అందరి ఆశీర్వాదం, అభిమానంతో ఎప్పటికైనా మల్లయ్య ఉన్నతపదవిని పొందుతారని జానారెడ్డి అన్నారు.





తిరువనంతపురం విమానాశ్రయంలో అత్యవసరంగా దిగిన బ్రిటిష్ యుద్ధ విమానం

తిరువనంతపురం, జూన్ 15 : బ్రిటిష్ ఎఫ్-35 యుద్ధవిమానం ఒకటి కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం రాత్రి అత్యవసరంగా దిగింది. అరేబియా సముద్రంలో ఉన్న బ్రిటిష్ విమాన వాహక నౌక నుంచి బయలుదేరిన ఈ యుద్ధవిమానం దిగేందుకు తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర పరిస్థితి ప్రకటించి ఏర్పాట్లు చేశారు. ఆ యుద్ధవిమానంలో ఇంధనం అడుగంటిందని దిగేందుకు అనుమతించాలని దాని పైలెట్ కోరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకుని అనుమతించినట్లు సమాచారం. కేంద్రం నుంచి తగిన అనుమతి రాగానే దానిలో ఇంధనం నింపి తిరిగి వెళ్లేందుకు అనుమతిస్తారు. కాగా ఈ విషయమై భారత వైమానిక దళ అధికారులు స్పందిస్తూ.. బ్రిటిష్ యుద్ధవిమానం తిరువనంతపురంలో అత్యవసరంగా దిగడం సాధారణ విషయమేనని తెలిపారు. తమకు ఈ విషయం తెలుసని, అత్యవసర పరిస్థితి దృష్ట్యా సహకారం అందించినట్లు చెప్పారు. అమెరికాకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీ తయారుచేసిన ఈ ఎఫ్-35 లైట్నింగ్ 2 అత్యాధునిక ఐదో తరం యుద్ధ విమానం. బ్రిటన్‌తో సహా పలు నాటో దేశాలు దీన్ని ఉపయోగిస్తున్నాయి. కాగా భారత నౌకాదళం, బ్రిటన్‌కు చెందిన క్యారియర్ స్ట్రైక్ గ్రూప్(యూకే సీఎస్‌జీ25)తో కలిసి ఈ వారంలోనే పశ్చిమ అరేబియా సముద్రంలో రెండు రోజులపాటు విన్యాసాలు నిర్వహించింది.

స్కిల్ యూనివర్సిటీల్లో సీవోఈలు

- వాటికి ఐటీఐలను అనుసంధానం చేస్తాం
- కేంద్రమంత్రి జయంత్‌చౌదరితో సీఎం రేవంత్‌రెడ్డి
- ఐటీఐల్లో సోలార్ విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటుకు ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీఎఫ్ఎక్స్, గేమింగ్ ఆడియో విజువల్స్ రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి.. కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి సూచించారు. ఐటీఐ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ ఇద్దరూ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రిని కేంద్ర మంత్రి అభినందించారు. అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తాము ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసి.. దానికి ఐటీఐలను అనుసంధానిస్తామని తెలిపారు. జాతీయ నైపుణ్య శిక్షణ కింద ఈ యూనివర్సిటీకి మద్దతివ్వాలని కేంద్ర మంత్రిని కోరగా.. తమ సహకారం తప్పక ఉంటుందని జయంత్ చౌదరి చెప్పారు. ఐటీఐలన్నింటికీ ఉచితంగా విద్యుత్తు సరఫరా చేయాలని సీఎంకు సూచించగా.. ఐటీఐల్లో సోలార్ విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను రేవంత్ ఆదేశించారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్లు కాలానుగుణంగా ఐటీఐల్లో సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, ఇందుకోసం ప్రత్యేక కమిటీని నియమించాలని అన్నారు.



కేంద్రమంత్రి జయంత్ చౌదరిని సన్మానిస్తున్న సీఎం రేవంత్

మారేదేలే!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు. ఒకవేళ ఆ ఉత్తర్వులు వచ్చేనాటికే ఏవైనా భూములను లీజుకు ఇస్తే.. వాటి గడువు పూర్తయ్యాక శాఖ పరిధిలోకి తీసుకోవాలనే నిబంధన ఉంది. కానీ, సదరు శాఖ ఉన్నతాధికారి మాత్రం బర్కత్‌పురలో ఉన్న సంస్థ భూమి గడువు సమయం పూర్తికాకముందే.. మళ్లీ లీజు గడువు పొడిగించేందుకు నిర్ణయం తీసుకోవడంతోపాటు, ఆ ఫైలును క్యాబినెట్ ముందు ఉంచారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో మంత్రి కూడా అలా ఎలా నిర్ణయాలు తీసుకుంటారంటూ సదరు అధికారిని మందలించినట్లు తెలిసింది. తన శాఖలో పని చేసే ఇతర ఉద్యోగులు, అధికారుల పట్ల కూడా ఆ ఉన్నతాధికారి దురుసుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఓ అంశంపై చర్చించేందుకు సచివాలయంలో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఓ మహిళా ఉద్యోగి పట్ల 'బుద్ధి ఉందా' అంటూ దురుసుగా మాట్లాడినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళా ఉద్యోగి ఏడ్చుకుంటూ అక్కడి నుంచి బయటకు వెళ్లినట్లు, ఆయనపై మంత్రికి, ముఖ్య అధికారులకు ఫిర్యాదు చేయాలనే ఉద్దేశంతో ఉన్నట్టు తెలిసింది. కాగా, సదరు అధికారి ఆ శాఖ బాధ్యతలు తీసుకున్న మొదట్లోనూ ఒకరిద్దరిపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు, దీనిపై ఉద్యోగులు మంత్రికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో ఆ అధికారిని మంత్రి పిలిపించుకొని తీరు మార్చుకోవాలని సూచించినట్లు తెలిసింది.

ఐఏఎస్ వర్సెస్ ఐపీఎస్..

ఒక కీలకశాఖలో ముఖ్య ప్రధాన కార్యదర్శిగా ఐఏఎస్ ఉండగా.. అదే శాఖకు అనుబంధంగా ఉన్న ఒక సంస్థకు ఐపీఎస్ అధికారి బాధ్యతల్లో ఉన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉన్న శాఖ వాస్తవానికి చాలా మంచి ఫలితాలను ఇవ్వాలి. కానీ, ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతోంది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన ముఖ్యమైన అంతర్జాతీయ కార్యక్రమ నిర్వహణ విషయంలో ఇద్దరి మధ్య పొంతన కుదరలేదని, ఒకానొక సమయంలో ఇద్దరి మధ్య ఢీ అంటే ఢీ అనే స్థాయిలో వ్యవహారం నడిచిందనే ఆరోపణలున్నాయి. అంతర్జాతీయ కార్యక్రమ నిర్వహణకుగాను ముఖ్యమంత్రి పలు సూచనలు చేయగా.. వాటి ప్రకారమే ఐపీఎస్ అధికారి ప్రజెంటేషన్ రూపొందించి సీఎంకు వివరించారు. అయితే ఆ సమావేశం ముగిశాక, "ఈ విషయాన్ని సీఎం దగ్గర ఎందుకు చెప్పావు? ముందుగా నాకెందుకు చెప్పలేదు?" అంటూ ఐఏఎస్ అధికారి ప్రశ్నించడంతోపాటు నోటికి కూడా పనిచెప్పినట్లు తెలిసింది. ఇద్దరూ సీనియర్లు కావడంతో మిగతా అధికారులు ఏమీ చేయలేక మౌనంగా ఉండిపోవాల్సి వచ్చిందని సమాచారం. సదరు ఐపీఎస్ అధికారిని ప్రభుత్వం ఇటీవల బదిలీ చేయడంతో ఆ శాఖలో ఐఏఎస్, ఐపీఎస్‌ల మధ్య వైరం ముగిసిందని ఉద్యోగులు చెప్పుకొంటున్నారు.

ఆయనకు తిట్టడమే పని..!

రాష్ట్ర ప్రభుత్వంలో ప్రస్తుతం ఓ కీలకశాఖకు ముఖ్య కార్యదర్శి హోదాలో ఉన్న ఓ ఐఏఎస్ అధికారి.. గతంలో పనిచేసిన మరో విభాగంలో అత్యంత విచక్షణా రహితంగా వ్యవహరించేవారనే ఆరోపణలున్నాయి. ఆయన వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా అధికారులు, డిప్యూటీ అ ధికారులు, ఉద్యోగులు తట్టుకోలేక ఏకంగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. కొన్ని సమయాల్లో ఆయన నోటి నుంచి బూతు పురాణం తప్ప మరొకటి రాదనే ఆరోపణలూ ఉన్నాయి. ఇక పని విషయంలో కిందిస్థాయి ఉద్యోగులను తీవ్రంగా వేధించేవారని, టెలీ కాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లు, సమావేశాల్లోనూ ఇష్టారీతిన వ్యవహరిస్తారనే అభియోగాలున్నాయి. ఆయన తీరుతో ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తోందని అధికారులు, ఉద్యోగులు చెబుతున్నారు. శాఖలో కొన్ని నిర్ణయాలూ ఇష్టారీతిన ఉంటున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇక ఎంతో మందితో కూడుకుని ఉన్న ఓ కీలక శాఖకు ముఖ్య అధికారిణిగా పనిచేసే మరో ఐఏఎస్ వ్యవహారం.. ఆ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రోజూ ఏదో ఒక అంశంపై కాన్ఫరెన్స్‌లతో తీవ్ర ఇబ్బందికి గురిచేస్తున్నారని ఇతర అధికారులు, ఉద్యోగులు వాపోతున్నారు. ఆ శాఖకు మరోచోట కూడా కార్యాలయం ఉండడంతో.. అక్కడి నుంచి సచివాలయానికి రావడం, మళ్లీ అక్కడికి వెళ్లడానికే తమకు సరిపోతుందని అంటున్నారు. సమావేశాలు, సర్క్యులర్‌లంటూ హడావిడి చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన ఫలితం పెద్దగా కనిపించడంలేదని చెబుతున్నారు.

ఎవరిష్టం వారిదే..

పలు శాఖలకు ముఖ్య, ఉన్నతాధికారులుగా పని చేస్తున్న అధికారుల తీరు మరింత చర్చనీయాంశమవుతోంది. వారి తీరు పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమీక్షల సమయంలో ఆయన బహిరంగంగా అసహనం వ్యక్తం చేస్తుండడమే ఇందుకు నిదర్శనం. అయినా అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని అంటున్నారు. మరోవైపు జిల్లాల్లోని కలెక్టర్ల పరిస్థితి కూడా అలాగే ఉంది. పలుమార్లు నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో.. క్షేత్రస్థాయికి వెళ్లాలని, ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకెళ్లాలని, ప్రజలతో మమేకం కావాలని సీఎం సూచించినా.. పెద్దగా పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. మరోవైపు ఇటు రాష్ట్రస్థాయిలో పనిచేసే అధికారులు వారి శాఖల్లో తీసుకునే నిర్ణయాలు కూడా ఇష్టారీతిన ఉంటున్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో ఓ అథారిటీ పరిధిలో పనిచేసే అధికారి.. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఓ ముఖ్య అధికారితోపాటు మరికొంతమందికి మేలు చేసేలా కోట్ల రూపాయలు వెచ్చించి వారు నివాసం ఉంటున్న ప్రాంతంలో సీసీ రోడ్లు వేయించడం చర్చనీయాంశమైంది. ఈ విషయం సీఎంవోకు కూడా చేరినట్లు తెలిసింది. వెరసి ఉన్నత, ముఖ్య అధికారుల తీరు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

డైట్, ఎస్‌సీఈఆర్టీలు విద్యాభివృద్ధికి కృషి చేయాలి

- కొత్త సాంకేతికతను ఉపాధ్యాయులు తరగతి గదిలో వాడేలా చూడాలి
- కేంద్ర మంత్రి జయంత్ చౌదరి

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా, శిక్షణ సంస్థలు (డైట్), రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండళ్లు(ఎస్‌సీఈఆర్టీ) విద్యాభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి పేర్కొన్నారు. ఆదివారం ఎస్‌సీఈఆర్టీ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డైట్‌లు, ఎస్‌సీఈఆర్‌టీలు నిర్వహించే పరిశోధనలు, అధ్యయనాలను క్షేత్ర స్థాయిలో తప్పనిసరిగా అమలు చేసేలా అధికారులు చూడాలన్నారు. దీర్ఘ, స్వల్పకాల లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు తగు వ్యూహాలను అమలు చేయాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ఐటీ కేంద్రంగా గుర్తింపు పొందిందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులందరూ నూతన సాంకేతికతను తరగతి గదిలో వాడేలా చూడాల్సిన అవసరముందని పేర్కొన్నారు. పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. వేసవిలో ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇచ్చామని, విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు ఇవ్వడమేకాకుండా తరగతి గదుల్లో ఏఐ ఆధారిత బోధనను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను కేంద్ర మంత్రి జయంత్ చౌదరి సందర్శించారు. ఇందులో ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు, పీఎం శ్రీ, కేజీబీవీ పాఠశాలలు, విద్యార్థుల బోధన సాధనాలు, బడిబాట, సమ్మర్ క్యాంపులు వంటి కార్యక్రమాల చిత్రాలను ఆయన పరిశీలించారు.



రైతు నేస్తం ఏర్పాట్లపై వ్యవసాయ వర్సిటీ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

నేడు రైతు నేస్తం ప్రారంభం

- వ్యవసాయ వర్సిటీలో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- 1,034 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం
- వ్యవసాయ మంత్రి తుమ్మల వెల్లడి

రాజేంద్రనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విశ్వవిదాలయ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు సీఎం ఎ.రేవంత్‌రెడ్డి రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికల వద్ద రైతులతో మాట్లాడనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 1,034 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై ఆదివారం రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఇప్పటికే 566 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించి.. ప్రతి మంగళవారం రైతు నేస్తం' ద్వారా రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తద్వారా ఆదర్శ రైతుల అనుభవాలు, వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలను అన్నదాతలకు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకూ రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న 6.35 లక్షల మంది రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగం, రైతాంగానికి సీఎం రేవంత్ అధిక ప్రాధాన్యం ఇచ్చి ముందుకు సాగుతున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో రైతు సంక్షేమానికి రూ.78వేల కోట్లు ఖర్చు చేశామని తుమ్మల వివరించారు. రుణ మాఫీ, సన్న ధాన్యానికి బోనస్, మద్దతు ధరనివ్వడంతోపాటు పంటల కొనుగోలు, సబ్సిడీపై సూక్ష్మ సేద్య పరికరాలు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ బడుల్లో.. 'టెక్' బోధన!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి 12వ తరగతి (ఇంటర్మీడియట్) వరకు ఉచితంగా అత్యాధునిక బోధన సేవలు అందుతాయని విద్యాశాఖ తెలిపింది. ఎక్‌స్టెప్ ఫౌండేషన్, ప్రజ్వల ఫౌండేషన్, ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, ఫైజామ్ ఫౌండేషన్, ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థలతో ఇందులో భాగస్వాములుగా నిలిచాయని వెల్లడించింది.

ప్రాథమిక స్థాయి నుంచే ఆధునిక శిక్షణ..

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్.. ఇప్పటికే రాష్ట్రంలోని 540 ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక సేవలు అందిస్తోందని.. త్వరలో 33 జిల్లాల్లోని 5,000కుపైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుందని విద్యాశాఖ తెలిపింది. మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ భాషలతోపాటు గణితం సబ్జెక్టులో ప్రాథమిక అంశాలపై శిక్షణ ఇస్తుందని వెల్లడించింది. ఇక అలోక్ పాండే ఆధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా సంస్థ 12వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు నీట్, జేఈఈ, క్లాట్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన ఉచిత శిక్షణ అందిస్తుందని పేర్కొంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పోటీ పరీక్షల దృక్పథాన్ని కల్పిస్తుందని తెలిపింది. ఖాన్ అకాడమీ రాష్ట్రంలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల పాఠ్యాంశాలకు అనుగుణంగా వీడియో ఆధారిత స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) పాఠాలతో శిక్షణను అందిస్తుందని వివరించింది. డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్ 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలు చేపడుతుందని తెలిపింది. షోయబ్ దార్ నిర్వహిస్తున్న ఫైజామ్ ఫౌండేషన్ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు కోడింగ్, కంప్యూటేషనల్ థింకింగ్‌లో శిక్షణ ఇస్తుందని విద్యాశాఖ వెల్లడించింది. సఫీనా హుస్సేన్ ఆధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ పాఠశాలలకు దూరంగా ఉన్న 16వేల మందిపైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించడం సహాబాలికల అక్షరాస్యత, విద్యా అవకాశాల పెంపుపై పనిచేస్తుందని తెలిపింది. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సీఎంవో అధికారులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఎన్‌జీవోల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేకే

స్థానిక ఎన్నికలకు నెలాఖరులోగా షెడ్యూల్

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్/కూసుమంచి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నెలాఖరులోగా షెడ్యూల్ విడుదలవుతుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించిన అనంతరం ఎన్నికల తేదీలపై స్పష్టత వస్తుందన్నారు. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉంటాయని, తర్వాత పంచాయతీ, మునిసిపల్ ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. గడువు సమీపిస్తున్నందున ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆదివారం ఖమ్మం జిల్లా కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో పాలేరుకు చెందిన ముఖ్య నాయకులతో పొంగులేటి సమావేశం నిర్వహించారు. మరో వారంలో రైతుభరోసా, సన్న వడ్లకు బోనస్‌ను అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులదేనని, గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యలపై రైతులు చేసుకున్న దరఖాస్తులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటివరకు 561 మండలాల్లో 7,578గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, వీటిలో 4.61లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సర్వే రికార్డులు లేని ఐదు నక్షా గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన భూ సర్వే శరవేగంగా జరుగుతోందన్నారు.

నేడు మంత్రులతో సీఎం రేవంత్ భేటీ

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం మంత్రులతో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా వానాకాలానికి సంబంధించి రైతు భరోసా నిధుల జమ, రైతు నేస్తం కార్యక్రమం తదితర అంశాలపై ప్రధానంగా చర్చించనున్నట్లు తెలిసింది. ఈ నెలాఖరున స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందంటూ పలువురు మంత్రులు పరోక్ష సంకేతాలిస్తున్న నేపథ్యంలో వాటి నిర్వహణపై కూడా చర్చించనున్నారని సమాచారం. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు, యూనిట్ల మంజూరు విషయాలపై కూడా మాట్లాడే అవకాశమున్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు హైదరాబాద్‌లో అందుబాటులో ఉండే మంత్రులంతా ఈ భేటీకి హాజరవుతారని తెలిసింది.



టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌తో కాంగ్రెస్ నేతలు కృష్ణ గౌడ్, యాదగిరిగౌడ్ తదితరులు

గద్దర్ అవార్డులతో సినీ రంగానికి సర్కారు గౌరవం

- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

రాంనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గద్దర్ అవార్డుల ప్రదానంతో సినీ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవం తీసుకువచ్చిందని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేస్తోందని.. అందులో భాగంగానే గద్దర్ అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించిందన్నారు. గత 11 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నంది అవార్డుల ప్రదానం నిర్వహించకుండా సినీ రంగానికి నిర్లక్ష్యం చేసిందని.. ఈ విషయాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆదివారం మహేశ్ గౌడ్‌ను ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జి.నాగభూషణం, కార్యదర్శి యాదగిరిగౌడ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. గద్దర్ అవార్డులను ప్రదానం చేసినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



ఆలయ గర్భాలయంలో క్యూలైన్లలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు

- 78 వేల మంది రాక.. నిత్యాదాయం రూ.80.11 లక్షలు
- భక్తులకు ప్రసాద వితరణకు ఈవో రూ.3 లక్షల విరాళం..
- సర్వీసులో ఉన్నంతకాలం నెలకు లక్ష అందజేస్తానని వెల్లడి



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

యాదగిరిగుట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రం భక్తజనంతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు దినం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక దర్శనాలకు 2 గంటలు, ధర్మ దర్శనాలకు 4 గంటల సమయం పట్టింది. ఇక సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు సంప్రదాయ రీతిలో నిత్య పూజలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. సుమారు 78వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి తరలివచ్చారని.. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.80,11,461ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. కాగా, భక్తులకు ఉచిత ప్రసాద వితరణ నిమిత్తం ఈవో వెంకట్రావు దంపతులు రూ.3లక్షల చెక్కును ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయని నరసింహమూర్తి, డీఈవో భాస్కరశర్మకు అందజేశారు. తాను సర్వీసులో ఉన్నంతకాలం ప్రసాద వితరణకు ప్రతి నెలా రూ.లక్ష చెల్లిస్తానని ఈవో తెలిపారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులు పూర్తవడంతోపాటు స్కూళ్లు తిరిగి తెరుచుకుంటున్న క్రమంలో శుక్రవారం నుంచి తిరుమలలో అధిక రద్దీ నెలకొన్న విషయం తెలిసిందే. శుక్ర, శనివారాల తరహాలోనే ఆదివారం కూడా క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లన్నీ నిండిపోవడంతో క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు ఒకటిన్నర కిలోమీటరు వ్యాపించింది. క్యూలైన్‌లోని భక్తులకు 16 గంటల తర్వాత స్వామి దర్శనం లభిస్తోంది.

నీట్‌లో ర్యాంకు రాలేదని విద్యార్థిని ఆత్మహత్య

వెల్దండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వెలుబడిన నీట్ ఫలితాల్లో మంచి ర్యాంకు రాలేదనే మనస్తాపంతో ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తండాలో జరిగింది. తండాకు చెందిన ఇస్లావత్ పాండు, చిట్టి దంపతుల కుమార్తె శ్రావణి (19) హైదరాబాద్‌లో నీట్ పరీక్ష కోసం శిక్షణ తీసుకుంది. శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో ఆమెకు 720 మార్కులకు గాను 200 మాత్రమే వచ్చాయి. మంచి ర్యాంకు రాలేదనే మనస్తాపంతో ఆదివారం ఉదయం తల్లిదండ్రులు పొలానికి వెళ్లిన తర్వాత ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుంది. శ్రావణికి రెండో ప్రయత్నంలోనూ నీట్‌లో మంచి ర్యాంకు రాకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

29న రాష్ట్ర పర్యటనకు అమిత్ షా

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ నెల 29న రాష్ట్ర పర్యటనకు రానున్నారు. పార్టీ ముఖ్యనేతలతో ఆయన హైదరాబాద్‌లో సమావేశమవుతారు. అనంతరం నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరవుతారు. స్థానిక పాలిటెక్నిక్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం ఢిల్లీ వెళతారని పార్టీ వర్గాలు తెలిపాయి. అమిత్ షా పర్యటనపై ఒకటి, రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడుతుందని పేర్కొన్నాయి.

హైదరాబాద్-కటక్ ప్రత్యేక రైళ్ల పొడిగింపు

విజయవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-కటక్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొన్ని రోజుల పాటు పొడిగిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 07165 హైదరాబాద్-సీటీసీ రైలు ఈ నెల 15, 24 తేదీల్లో, 07166 సీటీసీ-హైదరాబాద్ మధ్య నడిచే రైలు ఈ నెల 18, 25 తేదీల్లో ప్రతి బుధవారం నడిచేలా పొడిగించినట్టు పేర్కొన్నారు. ఈ రైళ్లు విజయవాడ జంక్షన్‌తో పాటు రాజమండ్రి, విజయనగరం తదితర స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు.

పుష్కర సన్నద్ధత ఏదీ..?

2027 జూలై-ఆగస్టులో గోదావరి పుష్కరాలు.. తెలంగాణలో 6 చోట్ల నిర్వహణకు అవకాశం

- ఆరు కోట్ల మంది వస్తారని అంచనా
- ఏపీలో 2వేల కోట్లతో పనుల ప్రణాళిక
- 94 కోట్లు కేటాయించిన మోదీ సర్కార్
- తెలంగాణకు పైసా ఇవ్వని కేంద్రం

వరంగల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గోదావరి పుష్కరాలకు మరో రెండేళ్ల సమయమే ఉంది. ఈసారి ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశాలున్నాయి. వారంతా ప్రశాంతంగా పుణ్యస్నానాలు చేసి, సమీపంలోని ఆలయాల్లో దైవ దర్శనాలు చేసుకునేలా ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాల్సి ఉంది. 2015లో తెలంగాణ వ్యాప్తంగా ఆరు చోట్ల జరిగిన గోదావరి పుష్కరాలకు 4.60 కోట్ల మంది భక్తులు హాజరయ్యారని అంచనా. ఈసారి ఆరు కోట్లకు పైగా వస్తారని అధికారులు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీలో గోదావరి పుష్కరాల కోసం రూ.94 కోట్లు కేటాయించింది. మరోవైపు, తెలంగాణకు మాత్రం పైసా ఇవ్వకపోవటం చర్చనీయాంశమైంది. ఏపీలో గోదావరి పుష్కరాల కోసం అక్కడి ప్రభుత్వం రూ.2 వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు కార్యాచరణ సిద్ధం చేయగా.. తెలంగాణలో ఇంకా పుష్కర సన్నద్ధత లేకపోవటంపై భక్తులు పెదవి విరుస్తున్నారు. 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలు జరగనున్నాయి.

వేడుకలకు ఏర్పాట్లు ఏవీ..?

భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద ఇటీవల సరస్వతి పుష్కరాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల కోసం ప్రభుత్వం మూడు నెలల ముందు రూ.35 కోట్ల వరకు నిధులు కేటాయించింది. అయితే పుష్కరాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించటంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. 8 లక్షల మంది వస్తారని అధికారులు అంచనా వేస్తే 15 లక్షలకు పైగా భక్తులు పుణ్యస్నానాలు చేశారు. అధికారుల అంచనాలు తప్పటంతో పాటు నిర్వహణపై కూడా తీవ్ర విమర్శలు వచ్చాయి. 2015లో జరిగిన గోదావరి పుష్కరాలకు తెలంగాణలోని ధర్మపురి, బాసర, మంథని, కాళేశ్వరం, ఏటూరునాగారం, భద్రాచలం వద్ద 4.60 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు అంచనా. ఈసారి ఆరు కోట్లకు పైగా భక్తులు హాజరవుతారనే అంచనా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి పుష్కరాల కోసం అక్కడి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఉభయ గోదావరి జిల్లాల్లో ఉత్సవాల కోసం సుమారు రూ.2 వేల కోట్లతో ప్రణాళిక రూపొందించింది. అయితే తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు గోదావరి పుష్కరాలపై దృష్టి పెట్టకపోవటంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద ఇప్పటికే మూడు ఘాట్లు ఉన్నాయి. ఇక్కడ మరో మూడు ఘాట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు 25 కి.మీ. మాత్రమే డబుల్ రోడ్డు ఉంది. ఇప్పటికే



నిధులు మంజూరైనా అటవీ శాఖ అనుమతులు ఆలస్యం అవుతుండటంతో పనులు జరగటం లేదు. అలాగే హైదరాబాద్ నుంచి ఎక్కువగా భక్తులు వచ్చేది ములుగు జిల్లా ఏటూరు నాగారం పుష్కరఘాట్లకే. హైదరాబాద్ నుంచి పస్రా వరకు నాలుగు లైన్ల రోడ్డు ఉంది. అయితే పస్రా నుంచి ఏటూరు నాగారం వరకు 20 కి.మీ. మాత్రమే డబుల్ రోడ్డు ఉంది. ఇక్కడ కూడా జాతీయ రహదారి-163 విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ అటవీ శాఖ అనుమతులు లేక పనులు జరగటం లేదు. అలాగే ఏటూరునాగారం నుంచి మంగపేట మండలం మల్లూరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వరకు భక్తులు పెద్ద సంఖ్యలో వెళతారు. సుమారు 20కి.మీ. వరకు డబుల్ రోడ్డు ఉంది. దీనిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. వీటితో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రధానంగా రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉంది. అలాగే యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, లక్నవరం, బొగత జలపాతం, భద్రాచలం, పర్ణశాల, బాసర, ధర్మపురి తదితర ప్రాంతాల్లో పుష్కర ఘాట్లు, పర్యాటక అభివృద్ధికి నిధులు కేటాయించాల్సి ఉంది.

మనకేదీ కేంద్ర సాయం..?

గోదావరి పుష్కరాల కోసం కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించి, తెలంగాణకు మొండి చేయి చూపడం చర్చనీయాంశంగా మారింది. భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం 11 అక్టోబరు 2024న ఆంధ్రప్రదేశ్‌కు రూ.94 కోట్లు కేటాయించింది. అలాగే రైల్వే శాఖ ఏపీకి వరాలు కురిపించింది. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.271.43 కోట్లు కేటాయించింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి గోదావరి పుష్కరాలకు రాజమండ్రి రైల్వేస్టేషన్‌కు వచ్చే భక్తులకు సౌకర్యాల కోసం ఈ నిధులను కేటాయించారు. తెలంగాణకు మాత్రం నయా పైసా కేటాయింపులు చేయకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నా ఏం లాభమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తెలంగాణపై కేంద్ర చిన్నచూపు చూస్తుందనే చర్చ జరుగుతోంది. ఏపీ తరహాలోనే తెలంగాణకు కూడా పుష్కరాలకు కేంద్రం నిధులు కేటాయించేలా బీజేపీ ఎంపీలు ఒత్తిడి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

కొత్తగా 120 కేజీబీవీల ఉన్నతీకరణ

- ఈ ఏడాది నుంచే ఇంటర్మీడియట్ తరగతులు
- కృత్రిమమేధ సహా పలు కోర్సుల బోధనకు అనుమతి

జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ను ఇంటర్మీడియట్ వరకు ఉన్నతీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. సానుకూల స్పందన వచ్చింది. పేదరికంతో తల్లిదండ్రులు చదివించే స్తోమత లేక, మధ్యలో చదువు మానేసిన, బడి బయటి ఆడపిల్లలకు రెసిడెన్షియల్ విద్య అందించేందుకు 2005లో కేంద్ర ప్రభుత్వం కేజీబీవీలను నెలకొల్పింది. రాష్ట్ర వ్యాప్తంగా 495 కేజీబీవీలు ఉండగా.. గతంలోనే విడతల వారీగా 283 విద్యాలయాలను ఇంటర్మీడియట్ వరకు ఉన్నతీకరించారు. ఏటా ప్రతి కేజీబీవీలో 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రతి గ్రూపులో 40 సీట్లకు ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. 7, 8, 9, 10వ తరగతులు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో సీట్లు ఖాళీగా ఉంటేనే ప్రవేశాలు కల్పిస్తున్నారు. భోజనం, వసతి, నాణ్యమైన విద్య అందిస్తుండడంతో ఈ విద్యాలయాల్లో ప్రవేశాలకు తీవ్ర పోటీ నెలకొంది. అదే సమయంలో కేజీబీవీల వాతావరణానికి అలవాటు పడిన బాలికలు పదో తరగతి తర్వాత సాధారణ జూనియర్ కళాశాలల్లో సర్దుబాటు కాలేక డ్రాపౌట్స్‌గా మారుతున్నారు. ఈ నేపథ్యంలోనే మరో 120 కేజీబీవీలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో కేజీబీవీల్లో ప్రస్తుతం పదో తరగతి పూర్తి చేసిన వారంతా ఉన్న చోటనే ఇంటర్మీడియట్ కూడా పూర్తి చేసే వెసులుబాటు కలగనుంది. ఈ సారి కృత్రిమ మేధ(ఏఐ)తోపాటు అకౌంటింగ్, కంప్యూటర్‌సైన్స్, ఎంపీహెచ్‌డబ్ల్యూ వంటి డిమాండ్ ఉన్న కోర్సులను ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. భవిష్యత్తులో విద్యార్థినులు స్వయం ఉపాధి పొందేలా తర్ఫీదు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు కేజీబీవీ జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి అనుపమ తెలిపారు.

ఖతర్ పోలీసుల అదుపులో తెలుగు పాస్టర్లు

- దోహాలో అనుమతి లేకుండా మతప్రచారం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఖతర్‌లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా మత ప్రచారం నిర్వహిస్తున్నారనే అభియోగంపై పలువురు క్రైస్తవ మతప్రచారకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. దోహా నగరంలోని తుమమా అనే ప్రాంతంలో మత ప్రచారం చేస్తున్న మొత్తం 11 మందిలో ఐదుగురు తెలుగు పాస్టర్లు ఉన్నారు. అందులో ముగ్గురు సందర్శక వీసాలపై వచ్చి మతప్రచారం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రెండు వారాలకు పైగా అదుపులో ఉంచి విచారించిన అనంతరం పోలీసులు వీరిని ఇటీవల విడుదల చేసినా, దేశం విడిచి వెళ్లడానికి మాత్రం ఇంకా అనుమతించలేదు. ఖతర్‌లో క్రైస్తవులు ప్రార్థనలు చేసుకోవడానికి బర్వా అనే ప్రాంతంలో ప్రత్యేకంగా సువిశాల కాంపౌండ్ ఉంది. అందులోని చర్చిలకు చట్టబద్ధత ఉంది. ఈ చర్చిల్లో ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి భారత్ నుంచి వచ్చేవారికి ప్రత్యేకంగా సందర్శక వీసాలను కూడా ఖతర్ ప్రభుత్వం జారీ చేస్తుంటుంది. కానీ స్థానిక చట్టాలకు విరుద్ధంగా భారతీయులు కొందరు కొన్ని ప్రైవేటు నివాస స్థలాల్లో, విల్లాల్లో, ఎక్కడబడితే అక్కడ చర్చిలు నిర్వహించుకుంటుండగా, వారిలో తెలుగువారు ప్రముఖంగా ఉన్నారు. చట్టబద్ధమైన అనుమతి ఉన్న తెలుగు చర్చిల కంటే, ఇలా అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న చర్చిలకు జనం తాకిడి ఎక్కువగా ఉండడంతో పోలీసుల దృష్టికి వెళ్లింది. ఖతర్, ఇతర గల్ఫ్ దేశాల్లో చట్టబద్ధంగా ప్రార్థన సేవలు ఉన్నా, అనుమతి లేకుండా అన్యమత ప్రచారం చేయడం మాత్రం తీవ్ర నేరంగా పరిగణిస్తారు. గతంలో సిక్కులు కూడా ఒక ప్రదేశంలో అనధికారికంగా గురుద్వారా నిర్వహిస్తుండగా నిర్వహకులను పోలీసులు అరెస్ట్ చేసి దాన్ని మూసివేశారు.

బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి

- రాజ్యాంగ సవరణకు బిల్లు పెట్టాలి
- ఎంపీ ఆర్.కృష్ణయ్య

చంపాపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాల్లో బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. హస్తినాపురంలోని కేకే గార్డెన్‌లో బీడీఎల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 16లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశ పెట్టాలని కోరారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాల ని కోరారు. మండల్ కమీషన్, పార్లమెంట్ కమిటీ చైర్మన్ నాచియప్పన్ కమిటీ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫారసు చేసిందన్నారు. అన్నిపార్టీల నేతలతో చర్చిస్తామని, త్వరలో బీసీలకు మంచిరోజులు రానున్నాయని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.